శుక్రవారం 9-8-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 139



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

రజత నీరాజనం



జావెలిన్‌ను **89.45** మీటర్లు విసిరిన నీరజ్ చోప్రా

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి రజత పతకం లభించింది. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో భారత స్టార్ నీరజ్ చోప్రా రజత పతకం గెల్చుకున్నాడు. నీరజ్ జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ (92.97 మీటర్లు) ఒలింపిక్ రికార్డు నెలకొల్పి పసిడి పతకాన్ని దక్కించుకున్నాడు. గత టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. 'పారిస్' ఫలితంతో నీరజ్ వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో పతకాలు నెగ్గిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన నీరజ్ ఫైనల్లో కాస్త తడబడ్డాడు. తొలి ప్రయత్నంలో అతను విఫలమయ్యాడు. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరాడు. ఇదే స్కోరు అతనికి పతకాన్ని ఖరారు చేసింది. ఆ తర్వాత నీరజ్ మరో నాలుగు త్రోలు విసిరినా అవి ఫౌల్‌గా నమోదయ్యాయి.

- వివరాలు **14**లో

రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం


పచ్చ మూకల దాడిలో ధ్వంసమైన సామాజిక న్యాయ మహా శిల్పం బోర్డు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు

- బెజవాడ నడిబొడ్డున అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకల చీకటి దాడి
- ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతో భారీ విగ్రహం ధ్వంసానికి తరలివచ్చిన ఎల్లోగ్యాంగ్
- పోలీసుల సాక్షిగా అందరినీ బయటకు పంపేసి.. లైట్లు ఆర్పేసి బరితెగింపు
- ప్రజలు, మీడియా, అంబేడ్కర్ ఆలోచనాపరులు రావడంతో పరార్.. అధికారుల సమక్షంలోనే ఉన్మాదం
- సుత్తులు, ఇతర పరికరాలతో విగ్రహంపై దాడి
- సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ధ్వంసం

11లో




ప్రాజెక్టును చూడటానికి వచ్చిన సందర్శకులు

సాగర్ 26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

ఎగువ నుంచి భారీ వరద... దిగువకు 2,67,906 క్యూసెక్కుల నీరు

నాగార్జునసాగర్/దోమలపెంట: కృష్ణా ఎగువ నుంచి భారీస్థాయిలో నాగార్జునసాగర్ జలాశయానికి వరద పోటెత్తుతోంది.దీంతో గురువారం ప్రాజెక్టు మొత్తం 26 రేడియల్ క్రస్టుగేట్లు ఎత్తారు. గేట్ల ద్వారా 2,67,906 క్యూసెక్కులు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కులు.. మొత్తంగా 2,96,407 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.నాగార్జునసాగర్ గరిష్టస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు(312.5050 టీఎంసీలు). కాగా ప్రస్తుతం 586.00 అడుగుల(300.3200 టీఎంసీల) నీటి నిల్వలున్నాయి.

15 ఏళ్లలో 11సార్లు తెరుచుకున్న మొత్తం గేట్లు

ఈ పదిహేను సంవత్సరాల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్టుగేట్లు 11సార్లు తెరుచుకున్నాయి. 2009, 2010, 2011, 2012, 2013, 2014, 2019, 2020, 2021, 2022, 2024 సంవత్సరాల్లో 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయికి చేరుకున్న తర్వాత కూడా 2.5లక్షల క్యూసెక్కులు వరద వస్తే కచ్చితంగా 26 గేట్లు తెరవాల్సిందేనని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

- శ్రీశైలం జలాశయానికి వరద మళ్లీ కాస్త పెరిగింది. జూరాల ప్రాజెక్టుకు 3,15,000 ఇన్‌ఫ్లో ఉండగా.. 45 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 3,13,065 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 19,774 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సుంకేశుల నుంచి మరో 58,227 క్యూసెక్కులతో మొత్తం 3,91,066 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తుంది. దీంతో పది గేట్లు ఎత్తి 3,08,480 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 65,410 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలగా, సాగర్‌కు చేరుతోంది.

ఆదివాసీ గూడేల అభివృద్ధే నిజమైన అభివృద్ధి : మంత్రి సీతక్క

ఆదివాసీల అభివృద్ధికి మేధావులు ప్రభుత్వానికి సలహాలివ్వాలి

బంజారాహిల్స్: దేశంలోని మారుమూల ప్రాంతాలు, ఆదివాసీ గూడేల అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రాజనీతిశాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'ఆదివాసీ జీవనోపాధి పద్ధతులు: సాధికారత సాధనలో సమస్యలు–వ్యూహాలు'అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును మంత్రి ధనసరి సీతక్క హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆదివాసీ బిడ్డగా ఈ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఆత్మగౌరవం కోసం ఆదివాసీ పోరాటాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏ అభివృద్ధి నమూనాలోనైనా వెనుకంజలో ఆదివాసీలు: హరగోపాల్

ఏ అభివృద్ధి నమూనాలోనైనా ఆదివాసీలు వెనుకంజలోనే ఉన్నారని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు, ఆదివాసీల ప్రయోజనాల మధ్య ఎప్పుడూ వైరుధ్యముంటుందని, ఇక్కడ నష్టపోయేది గిరిజనులేనని ఆయన వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజి స్ట్రార్ సుధారాణి, అకడమిక్ డైరెక్టర్ పుష్పచక్రపాణి, సదస్సు డైరెక్టర్ గుంటి రవీందర్, సామాజిక శాస్త్రం విభాగాధిపతి వడ్డా ణం శ్రీనివాస్, కో–డైరెక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.


సదస్సులో మంత్రి సీతక్క, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు



హైదరాబాద్‌లో పరిశ్రమలు స్థాపించండి

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్‌ను కోరిన భట్టి

సాక్షి, హైదరాబాద్: అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్న హైదరాబాద్‌లో పరిశ్రమలు స్థాపించాలని, ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గ్యారెత్ విన్ ఓవెన్‌ను కోరారు. గ్యారెత్ విన్ ఓవెన్‌తోపాటు బ్రిటిష్ హైకమిషన్ సలహాదారు నళిని రఘురామన్ గురువారం ఉదయం ప్రజాభవన్‌లో భట్టితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ, అర్బన్ డెవలప్‌మెంట్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించడానికి హైదరాబాద్ అనువైన చోటు అని వివరించారు. అందరికీ అనుకూలమైన వాతావరణం, తక్కువ ధరలో మానవ వనరులు వంటి సదుపాయాలు ఉన్నాయని భట్టి వారికి తెలిపారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

రాజస్తాన్‌లో అదుపులోకి తీసుకున్న టీజీసీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: పలు రాష్ట్రాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. వారిని రాజస్తాన్‌కు చెందిన నంద కిషోర్, దీపక్ వైష్ణవ్‌గా గుర్తించారు. నిందితులిద్దరినీ రాజస్తాన్ వెళ్లి మరీ అరెస్టు చేసి తీసుకొచ్చినట్టు టీజీసీఎస్‌బీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, తమిళనాడులో కలిపి మొత్తం 23 నేరాల్లో ఈ ఇద్దరు నిందితుల పాత్ర ఉన్నట్టు గుర్తించారు. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట అమాయకులకు వలవేసి మోసాలు చేస్తున్నట్టు గుర్తించారు. ఇదే తరహాలో కరీంనగర్‌కు చెందిన సత్తయ్య అనే వ్యక్తిని వాట్సాప్‌లో మెసేజీలతో తమ బుట్టలో వేసుకున్నారు. పలు దఫాల్లో రూ.46.11 లక్షలు వసూలు చేశారు. తాను మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు కరీంనగర్ సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన సైబర్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుల్లో ఒకడైన నంద కిషోర్ గత ఏప్రిల్లో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో సల్సార్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేసి, సదరు సంస్థ పేరుతో ఎస్ఆర్ నగర్‌లోని బంధన్ బ్యాంకులో ఖాతా తెరిచి సైబర్ నేరాలకు ఉపయోగిస్తున్నాడని గుర్తించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

నిజాం కళాశాల విద్యార్థినుల ఆందోళన విరమణ

విద్యార్థినుల ఆందోళన శిబిరానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

సెప్టెంబర్ తర్వాత డిగ్రీ విద్యార్థినులకే హాస్టల్ ఉంటుందని హామీ

గన్‌ఫౌండ్రీ: వసతి గృహం కోసం నిజాం కళాశాల విద్యార్థినులు చేపట్టిన ఆందోళనను గురువారం విరమించారు. ఆందోళన శిబిరానికి చేరుకున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడారు. సెప్టెంబర్ వరకు పీజీ విద్యా సంవత్సరం ముగుస్తుందని అనంతరం పూర్తిగా డిగ్రీ విద్యార్థులకే హాస్టల్ ఉంటుందని హామీనిచ్చారు. ఇందుకు అనుగుణంగా 2,3 రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు ఇప్పిస్తామని వారికి నచ్చజెప్పారు. విద్యార్థినుల సమస్యను సీఎం రేవంత్ దృష్టికి తీసుకువెళ్లి మరో రెండు అంతస్తులు నిర్మించేందుకు నిర్ణయం తీసు కుంటామని వివరించారు. అనంతరం ఓయూ వీసీతో సమస్య గురించి చర్చించారు. బల్మూరు వెంకట్ ఇచ్చిన హామీతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేసి ఆందోళన విరమించారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో విద్యార్థినులు 'వంటావార్పు' కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 21న 5 లక్షల మంది మహిళలకు ఏఐలో శిక్షణ

రాయదుర్గం: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో మహిళా సాధికారత సాధించేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), సౌత్ ఏసియన్ విమెన్ ఇన్ టెక్నాలజీ (ఎస్ఏడబ్ల్యూఐటీ), ఎడ్యుటెక్ కంపెనీ 'గువీ' సంయుక్తంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. జనరేటివ్ ఏఐ రంగంలో అతివలు వారి నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకొనేలా ప్రపంచంలోకెల్లా మహిళలకు అతిపెద్ద శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నాయి. జెన్ ఏఐ లెర్నింగ్ చాలెంజ్ పేరిట సెప్టెంబర్ 21న ఏకంగా 5 లక్షల మంది మహిళలకు శిక్షణ అందించనున్నాయి. ఈ మేరకు గురువారం టీ–హబ్ వేదికగా నిర్వాహకులు ప్రకటన చేశారు. దేశవ్యాప్తంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సుమారు 8,200 విద్యాసంస్థలకు చెందిన 16 లక్షల మంది విద్యార్థినులను ఇందులో ఉచితంగా భాగస్వాములను చేయనున్నారు. 15 గంటల జెన్ ఏఐ కోర్సు పూర్తి చేసే విద్యార్థినులకు ఒక అకడమిక్ క్రెడిట్ పాయింట్ లభించనుంది.



బాట దాటాలంటే గుర్రం ఆటే

ఒకప్పుడు బురద బాటలపై వెదురు బొంగులతో నడక..

ఇప్పటికీ అదే ఆచారం

ఏజెన్సీలో ఖోడంగ్ సందడి


ఆధునిక కాలంలోనూ.. ఆదివాసీ గిరిజనులు సంప్రదాయాలు, ఆచారాలకు విశేష ప్రాధాన్యమిస్తూ.. కొనసాగిస్తూనే ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఖోడంగ్ (గుర్రం ఆట)లతో చిన్నారులు సందడి చేస్తున్నారు. శ్రావణ అమావాస్య మర్నాటి నుంచి.. పొలాల పండుగ మర్నాటి వరకు నెలరోజులపాటు ఆదివాసీ పిల్లలు, యువకులు వెదురుబొంగులతో గుర్రం ఆట ఆడుతుంటారు. రెండు వెదురు కర్రలతో నడక సాగిస్తారు. పొలాల పండుగ మర్నాడు.. బొడగ పూజలతో పండుగ ముగిస్తామని ఆదివాసీలు తెలిపారు. ఒకప్పుడు గిరిజన గ్రామాల్లో వర్షాకాలం వచ్చిందంటే రోడ్లు చిత్తడిగా మారిపోయేవి. బురదలో నడిచి వెళ్లడం వల్ల.. కాళ్లకు పుండ్లు అయ్యేవి. దీంతో అప్పట్లో వెదురు కర్రలతో నడుస్తూ.. ఇబ్బంది నుంచి గట్టెక్కారని చెబుతున్నారు. కాలం మారినప్పటికీ అదే ఆచారాన్ని కొందరు ఆదివాసీ గిరిజనులు కొనసాగిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం సాలెగూడ, ఇంద్రవెల్లి మండలం వాల్గొండ గ్రామాల్లో చిన్నారులు కర్రలపై నడుస్తున్న చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్/ఇంద్రవెల్లి

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి.
పాడిపంటలతో పులకించిపోవాలి'

పేజీలు: 20 | వెల: ₹ 5.50 | సంపుటి: 17 | సంచిక: 139

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వహ్వా హాకీ

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. గురువారం జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ 2-1 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టును ఓడించింది.

14లో

జేపీసీకి వక్ఫ్ బిల్లు

- లోక్‌సభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- తీవ్రంగా వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్షాలు
- సమాజాన్ని విచ్ఛిన్నం చేసే క్రూరమైన బిల్లు వద్దంటూ నినాదాలు
- ఉపసంహరించుకోవాలని డిమాండ్
- వెనక్కి తగ్గిన ప్రభుత్వం.. బిల్లును జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయం

6లో

నీళ్లు కష్టం.. సాగు నష్టం

సాగర్ కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, ముళ్ల కంపలు, పిచ్చి చెట్లు

- అనేకచోట్ల దెబ్బతిన్న లైనింగ్.. కొన్నిచోట్ల గండ్లు.. మైనర్ కాల్వలతో పాటు మేజర్ కాల్వలదీ అదే దుస్థితి
- వానాకాలానికి ముందు ఓఅండ్‌ఎం పనుల్లో నిర్లక్ష్యం
- కొన్ని కాల్వలకు ఏళ్ల తరబడి కొరవడిన మరమ్మతులు.. బలహీనంగా ఉన్న కట్టలు
- సామర్థ్యం మేరకు విడుదల కాని నీరు
- చివరి ఆయకట్టులో వేలాది ఎకరాలకు అందని నీళ్లు.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో రైతుల అవస్థలు



2లో

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం త్రిపురవరం సమీపంలోని పాలారం మేజర్ కాలువ కంపచెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో చివరి ఆయకట్టు గ్రామాలైన త్రిపురవరం, పాలారం, గోండ్రియాల, కొత్తగూడెం, కోదాడ మండలంలోని మంగలితండాల్లోని దాదాపు 450 ఎకరాల భూములకు నీరు అందడం లేదు. నాలుగైదేళ్లుగా ఇదే దుస్థితి నెలకొనడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు బోర్లు వేసుకుని, బావులు తవ్వుకుని పంటలు పండించుకుంటున్నారు.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి

బుద్ధదేవ్ కన్నుమూత

నేడు అంతిమయాత్ర..
మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత

- వివరాలు 6లో

నేను అలసిపోయాను!

ఫైనల్‌కు ముందు అనర్హతకు గురైన రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రెజ్లింగ్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

- వివరాలు 15లో

కమలానికి కొత్త సారథి.. ఎప్పుడు?

పోటీలో ఈటల రాజేందర్, ఎన్.రామచంద్రరావు

- ఈటల వైపే అమిత్ షా, సునీల్ బన్సల్ మొగ్గు?
- కొత్త వారికి అధ్యక్ష పదవి వద్దని కొందరి అభ్యంతరం
- ఆ వాదనకు సంఘ్ కూడా మద్దతిస్తే రామచంద్రరావుకు అవకాశం
- కొత్త అధ్యక్షుడిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలంటున్న పార్టీ శ్రేణులు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుడి నియామకపు అంశం మరోసారి చర్చనీయాంశమవుతోంది. రాష్ట్ర పార్టీలో సమన్వయ లేమి సమస్య, ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తుండడం, కేడర్‌లో నిరాసక్తత, నిస్తేజం పెరుగుతున్న నేపథ్యంలో... కొత్త అధ్యక్షుడిని జాతీయ నాయకత్వం ఇంకా ఎప్పుడు నియమిస్తుందా అన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం కేంద్ర మంత్రి పదవితో పాటు, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన రాష్ట్ర పార్టీకి పూర్తి సమయాన్ని కేటాయించ లేకపోతున్నారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమౌతోంది. కిషన్‌రెడ్డి కూడా వీలైనంత తొందరగా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను తప్పించాలని అధిష్టానానికి ఇప్పటికే విన్నవించినట్టు సమాచారం. దీంతో పాటు మరో మూడు నాలుగు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు జరగొచ్చుననే రాజకీయవర్గాల అంచనాల నేపథ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పార్టీ పటిష్టతతో పాటు స్థానిక ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం పెంచుకోవడమనేది బీజేపీకి తక్షణ అవసరంగా మారింది. స్థానిక ఎన్నికల్లో... జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అంతగా కేడర్, స్థానిక నాయకుల బలం లేని బీజేపీ.. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొని గణనీయమైన సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఎలా గెలిపించుకోగలుగుతుందనే చర్చ కూడా పార్టీలో సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వీలైనంత తొందరగా రాష్ట్ర రాజకీయాలపై పట్టున్న నేతను కొత్త అధ్యక్షుడిని నియమిస్తే...ఎన్నికల్లోగా సంస్థాగతంగా పార్టీ బలం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

ఈటల వైపే మొగ్గు...?



బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం..పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు గట్టిగా పోటీ పడుతున్న విషయం తెలిసిందే. ఈ పదవి కోసం ఎంపీలు డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, టి.రాజాసింగ్, ముఖ్యనేతలు ఎన్.రామచంద్రరావు, చింతల రామచంద్రారెడ్డి, టి.ఆచారి, యెండల లక్ష్మీనారాయణ, ఎం.ధర్మారావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డా. కాసం వెంకటేశ్వర్లు పోటీపడుతున్నారు. బీజేఎల్పీ నేతగా రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇచ్చినందున, రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందినవారినే అధిష్టానం నియమిస్తుందని పార్టీలో పలువురు నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. ఈ వాదన రాష్ట్ర రాజకీయాల్లో తలపండిన ఈటల రాజేందర్‌కు అడ్వాంటేజ్‌గా మారొచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈటల వైపే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ వంటి వారు మొగ్గుచూపుతున్నారని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బీసీ వర్గాల నుంచే ఎంపికచేస్తే ఈటలతో పాటు అర్వింద్ ధర్మపురి, పాయల్‌శంకర్, టి.ఆచారి, యెండల లక్ష్మీనారాయణ, కాసం వెంకటేశ్వర్లు పేర్లను సైతం పరిశీలిస్తారని తెలుస్తోంది. దాదాపు రెండేళ్ల క్రితమే పార్టీలో చేరిన ఈటలకు అధ్యక్ష పదవి ఎలా ఇస్తారనే ప్రశ్నను కొందరు లేవనెత్తుతున్నారు. పార్టీలో చేరి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచాక కొత్త, పాత అంటూ ఉండదని, రాష్ట్రంలో పార్టీ గ్రామస్థాయి వరకు సంస్థాగతంగా విస్తరించి, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలంటే ఇది అడ్డంకి కాకూడదని వాదిస్తున్న వారూ పార్టీలో ఉన్నారు.

అలాగైతే రామచంద్రరావుకే..



సైద్ధాంతిక అంశాలకు ప్రాధాన్యతనిస్తే... మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావును అధ్యక్షుడిగా ఎంపిక చేసినా ఆశ్చర్యపోనక్కర లేదని పార్టీ వర్గాలంటున్నాయి. కొత్త వారికి అధ్యక్ష పదవి వద్దన్న కొందరి అభ్యంతరాల నేపథ్యంలో సంఘ్ పరివార్ కూడా మద్దతిస్తే రామచంద్రరావుకు అవకాశం దక్కవచ్చని అంటున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిపై త్వరలో నిర్ణయం తీసుకోవాలని అధిష్టానాన్ని పార్టీ నాయకులు కోరుతున్నారు. మొత్తంగా చూస్తే పార్లమెంట్ సమావేశాలు ముగిశాక కొత్త అధ్యక్షుడిని నియమిస్తారా లేదా అన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు

బాల కార్మిక కేసుల్లో తెలంగాణ టాప్



అనిల్ కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: కోవిడ్ సమయంలో 2020 నుంచి 2022 మధ్య అత్యధిక బాల కార్మిక కేసులు తెలంగాణలో నమోదయ్యాయని కేంద్రమంత్రి శోభ కరంద్లాజే తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,840 బాల కార్మిక కేసులు నమోదు కాగా తెలంగాణలో 546 కేసులు నమోదయ్యాయని కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్నకు కేంద్రమంత్రి గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

డీపీఆర్ దశలో రెండు రహదారులు



కిరణ్‌కుమార్

ఎన్‌హెచ్ – 765లోని హైదరాబాద్-శ్రీశైలం సెక్షన్, హైదరాబాద్ రీజనల్ రింగ్‌రోడ్ డీపీఆర్ దశలో ఉన్నాయని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ పనులు డీపీఆర్ ఆధారంగా అంచనా వేసిన ట్రాఫిక్, టెక్నో-ఎకనామిక్ సాధ్యత, నిధుల లభ్యత వంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

మియాపూర్–సంగారెడ్డి మెట్రో ప్రతిపాదన రాలేదు



రఘునందన్

మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైల్ సదుపాయాన్ని పొడిగించాలన్న అంశంపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర మంత్రి తోఖన్ సాహు తెలిపారు. గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిలు నిర్మించండి

హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ పెరగడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, ప్రమాదాల నియంత్రణ కోసం అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈటల తెలంగాణలోని రహదారుల గురించి మాట్లాడారు. కొంపల్లి, జీడిమెట్ల చౌరస్తా దగ్గర సుమారు పది ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించిన దాదాపు 60 మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణించారని ఆయన కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రమాదాల నియంత్రణ కోసం విజయవాడ జాతీయ రహదారిపై రెండు ఓవర్ బ్రిడ్జిలు, ఛత్తీస్‌గఢ్ రహదారిలో రెండు, కొంపల్లి నుంచి నాగ్‌పూర్ జాతీయ రహదారిపై ఆయా చోట్ల ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేయాలని ఈటల కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

ఇదండీ సంగతి



ప్రపంచమంతా మిమ్మల్నే ఫాలో అవుతున్నార్సార్!

నీళ్లు కష్టం.. సాగు నష్టం

సాగర్ కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, ముళ్ల కంపలు, పిచ్చి చెట్లు



నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు శివారులో ఉన్న కిష్టాపురం మేజర్ కాలువ నిర్వహణ లోపంతో కంపచెట్లు, ఇతర మొక్కలు, పూడికతో నిండిపోయింది. ఈ కాలువ కింద మొత్తం 3,361 ఎకరాల ఆయకట్టు ఉండగా నీళ్లు కిందకు రాకపోవడంతో గూడూరు, బోట్యానాయక్ తండా, సిద్ధాపురం తదితర గ్రామాల్లోని దాదాపు 1,800 ఎకరాల్లో సాగు కష్టమవుతోంది.

ఖమ్మం జిల్లాలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో 33 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాల్వ కింద బోనకల్ మండలంలోని కలకోట, పోలంపల్లి, లక్ష్మీపురం, రాపల్లిలో మేజర్ కాల్వలు, మరో 16 మైనర్ కాల్వలున్నాయి. వీటి కింద 26 వేల ఎకరాలు సాగవుతున్నాయి. అయితే బ్రాంచ్ కెనాల్ పరిధిలో రెండు కి.మీ. మేర లైనింగ్ సక్రమంగా లేదు. పదేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరి కాల్వ కోతకు గురైంది. పోలంపల్లి కాల్వ నామరూపాలు లేకుండా పోయింది. జాలిముడి, చిరునోముల ప్రధాన రహదారిపై ఉన్న మైనర్ కాల్వతో పాటు ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల కాల్వలో చాలా వరకు మొక్కలు పెరిగిపోయాయి.



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలోని సాగర్ కాల్వలో పెరిగిన మొక్కలు, చెట్లు

సాక్షి ప్రతినిధులు నల్లగొండ/ఖమ్మం: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని నాగార్జునసాగర్ కాలువల కింద చివరి భూములకు నీరందడం కష్టంగా మారుతోంది. చివరి భూములకు సైతం నీరందిస్తామని ప్రజా ప్రతినిధులు పదేపదే ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ఏటా పంట చేతికి వచ్చే సమయానికి నీరందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్వహణ సరిగా లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని స్పష్టం చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో డిస్ట్రిబ్యూటరీ కాలువలకు లైనింగ్ లేకపోవడంతో కంపచెట్లు పెరిగి కాలువలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల కాల్వలకు గండ్లు పడ్డాయి. ఖమ్మం జిల్లాలో గతంలో ప్రపంచ బ్యాంక్ నిధులతో మెయిన్ కెనాల్‌ను ఆధునీకరించారు. అయితే మేజర్, మైనర్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. జిల్లాలోని ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మధిర మండలాల్లోని కాల్వలకు ఏళ్లుగా మరమ్మతు చేయలేదు. రెండు జిల్లాల్లోనూ పూడిక సమస్య ఉంది. దీంతో అనేకచోట్ల చివరి భూములకు నీరందడం లేదు. మరికొన్ని చోట్ల రావాల్సిన నీళ్లు రావడం లేదు. దీంతో పంటలు సరిగా పండక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఉమ్మడి నల్లగొండలో..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని మేజర్ కాల్వలు అధ్వానంగా మారాయి. జిల్లాలో ఎడమకాలువ పరిధిలో మొత్తం 54 మేజర్లు ఉండగా నల్లగొండ జిల్లాలో 30, సూర్యాపేట జిల్లాలో 24 మేజర్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో మేజర్ల కింద 98,030 ఎకరాలు, 31 ఎత్తిపోతల పథకాల కింద 47,690 ఎకరాల సాగు భూమి ఉంది. సూర్యాపేట జిల్లాలో మేజర్లు ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 2.35 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాల్వలు సరిగా లేకపోవడంతో ఒక్కొక్క మేజర్‌కు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ కాల్వ కట్టలు బలహీనంగా ఉండి పూడిక, కంపచెట్లు పేరుకుపోవడంతో ప్రస్తుతం 60 క్యూసెక్కుల నీటిని మాత్రమే డిశ్చార్జ్ చేస్తున్నారు. దీంతో చివరి భూములకు నీరందడం లేదు. 2010లో దాదాపు రూ.4,444కోట్లతో ఎడమ కాలువ ఆధునీకరణ పనులు చేపట్టినా, నిధులు సరిపోక అన్ని మేజర్లు, లింక్ కాల్వలకు లైనింగ్, ఫ్లోరింగ్ చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. కాలువల నిర్వహణ లేకపోవడంతో 2022లో నిడమనూరు సమీపంలో సాగర్ ఎడమ కాలువకు గండి పడగా ఇటీవల హాలియా సమీపంలోని మారెపల్లి వద్ద వరద కాలువకు గండిపడి కిందకు సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో..

ఖమ్మం జిల్లాలో 2.54 లక్షల ఎకరాల మేర సాగర్ ఆయకట్టు ఉండగా.. గతంలో ప్రపంచ బ్యాంక్ నిధులతో మెయిన్ కెనాల్‌ను ఆధునీకరించారు. అయితే మేజర్, మైనర్ కాలువలు డిస్ట్రిబ్యూటరీలు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. జిల్లాలోని ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మధిర మండలాల్లోని కాల్వలకు ఏళ్లుగా మరమ్మతు చేయలేదు. దీంతో చివరి ఆయకట్టు రైతాంగం పంట చేతికి వచ్చే సమయాన నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో సాగర్ కాల్వల మరమ్మతులపై అధికారులు దృష్టి పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల్లో సాగర్ కాల్వలు ఉండగా, కొన్ని కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో పాటు మొక్కలు మొలిచాయి.

ఓఅండ్‌ఎం పనులు అంతంతే..

ఏటా వానాకాలం సీజన్‌కు ముందు కాల్వల్లో జలవనరుల శాఖ అధికారులు ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులు చేపట్టాలి. చెత్తా చెదారం, మొక్కలు, పూడిక తొలగించాలి. అవసరమైన మరమ్మతులు చేయాలి. రైతుల అవసరాలతో పాటు సంబంధిత ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రతిపాదనల మేరకు పనుల అంచనాలు రూపొందిస్తారు. అయితే ఈ ఓఅండ్‌ఎం పనులు సరిగా సాగడం లేదు. 2023–24లో ఖమ్మం జిల్లాలో 106 పనులకు రూ.20.14 కోట్లు మంజూరు కాగా.. ఇప్పటివరకు రూ.3.52 కోట్ల విలువైన 35 పనులు మాత్రమే పూర్తి కావడం గమనార్హం. ఇక 2024–25లో ఈ పనులు అసలు ప్రారంభమే కాలేదు.

నారుమడి ఎండిపోయేలా ఉంది



కాల్వలు పూడుకుపోయి కంప చెట్లు మొలిచాయి. మరమ్మతులు లేక బలహీనంగా ఉన్న కాల్వ కట్టలు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే తెగిపోయే పరిస్థితి ఉంది. నాకున్న ఏడెకరాల పొలానికి నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. వేసిన నారుమడి ఎండిపోయే దశకు వచ్చింది.

– మేక రాంబాబు, కిష్టాపురం, ఉమ్మడి నల్లగొండ జిల్లా

చెత్తా చెదారంతో నీళ్లు రావడం లేదు



లింగగరి మేజర్ కాలువ చెత్తా చెదారంతో నిండి పోయింది. కంపచెట్లు పెరగడంతో నీరు సరిగా రావడం లేదు. ప్రస్తుతం వదిలిన సాగర్ నీరు ఈ కాలువలోకి వచ్చే సరికి ప్రవాహ వేగం తగ్గిపోతోంది. దీంతో కింది గ్రామాల పొలాలకు నీళ్లు సరిగ్గా అందడం లేదు.

– రామిశెట్టి రాము, రైతు, హుజూర్‌నగర్ ఉమ్మడి నల్లగొండ జిల్లా

గత ఏడాది రూ.50 వేల నష్టం



మాకు మీనవోలు రెవెన్యూలో ఆరు ఎకరాల భూమి ఉంది. గతేడాది పత్తి సాగు చేశాం. సాగర్ నీరు చుక్క కూడా రాకపోవడంతో దిగుబడి తగ్గి రూ.50 వేలకు పైగా నష్టం వచ్చింది. ఈ ఏడాది మిర్చి సాగుకు సిద్ధమయ్యాం. పక్కనే సాగర్ కాల్వ ఉన్నా గంటల సమయం వేచి ఉన్నా నీరు వచ్చే పరిస్థితి లేదు.

–రామిశెట్టి సుజాత, రైతు, మీనవోలు, ఎర్రుపాలెం, ఖమ్మం జిల్లా

హైదరాబాద్‌లో చార్లెస్ స్క్వాబ్ సెంటర్

అమెరికాలో రేవంత్ బృందంతో సంస్థ ప్రతినిధులు భేటీ

- ఆర్థిక సేవల రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పన!



చార్లెస్ స్క్వాబ్ సంస్థ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్ ఇతర అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక సేవల రంగంలో దిగ్గజ సంస్థగా పేరొందిన 'చార్లెస్ స్క్వాబ్' హైదరాబాద్‌లో నూతన సాంకేతిక అభివృద్ధి కేంద్రం (టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. చార్లెస్ స్క్వాబ్ భారత్‌లో ఏర్పాటు చేసే తొలి డెవలప్‌మెంట్ సెంటర్ ఇదే కావడం గమనార్హం. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో చార్లెస్ స్క్వాబ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు హోవార్డ్, రామ బొక్కా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో చర్చల సందర్భంగా హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. చార్లెస్ స్క్వాబ్‌కు ప్రభుత్వ పక్షాన పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన తుది అను మతుల కోసం చార్లెస్ స్క్వాబ్ వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపనున్నట్లు తెలిపింది. ఈ సెంటర్ ఏర్పాటు ద్వారా ఆర్థిక సేవల రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు వీలవుతుందని, ఈ రంగంలో హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందని అంచనా వేస్తున్నారు.

'కామ్‌కాస్ట్' ప్రతినిధులతో శ్రీధర్‌బాబు

అంతర్జాతీయ మీడియా, టెక్నాలజీ కంపెనీ 'కామ్‌కాస్ట్'కు చెందిన సీనియర్ ప్రతినిధి బృందం.. మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయింది. తెలంగాణ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా అనేక సంస్థలతో వ్యూహాత్మక, భాగస్వామ్య ఒప్పందాలు చేసుకుంటున్నట్లు శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ భేటీలో కామ్‌కాస్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మెల్ పెన్నా, సీటీఓ రిక్ రియోబొలి, సీఐఓ మైక్ క్రిసొపుల్లి పాల్గొన్నారు.

అభివృద్ధిని వేగవంతం చేసేందుకే..

సీఎం బృందం అమెరికా పర్యటనలో భాగంగా పెట్టుబడుల కోసం వివిధ సంస్థలతో చేసుకుంటున్న ఒప్పందాలపై విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రతినిధి బృందంలోని అధికారులు వివరణ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసే దిశలోనే వివిధ సంస్థలతో చర్చలు ఒప్పందాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. 'పెట్టుబడులను ఆకర్షించేందుకు అనేక రోడ్ షోలు, వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. సీఎం కూడా అనేక బహుళజాతి సంస్థలు, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు, వాణిజ్య పారిశ్రామిక రంగాలకు చెందిన వారితో భేటీ అవుతున్నారు. భవిష్యత్తు సమావేశాల్లోనూ రాష్ట్రానికి మేలు జరిగేలా చూస్తాం..' అని ఐటీ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు.

కలిసి పనిచేసేందుకు ప్రపంచ బ్యాంకు ఆసక్తి

'ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సీఎం జరిపిన భేటీ ఆసక్తికరంగా, ఫలప్రదంగా సాగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో కలిసి పనిచేసేందుకు ప్రపంచ బ్యాంకు ఆసక్తి చూపించింది. పట్టణీకరణ, కాలుష్య రహిత నగరాలకు సంబంధించిన ప్రణాళికలపై కూడా ఆసక్తి చూపింది. పట్టణీకరణ ద్వారా ఎదురయ్యే మురుగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారానికి రాష్ట్రంతో కలిసి పనిచేయాలని నిర్ణయించింది..' అని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు.

కాలిఫోర్నియా చేరుకున్న సీఎం బృందం

రేవంత్‌రెడ్డి బృందం గురువారం కాలిఫోర్నియాకు చేరుకుంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, డాలస్, టెక్సాస్‌లో పర్యటన అనంతరం ఇక్కడికి వచ్చిన బృందానికి ఘన స్వాగతం లభించింది. కాలిఫోర్నియాలో దిగ్గజ కంపెనీల సీఈఓలతో ఈ బృందం భేటీ అవుతుంది.

జీవో 33పై పోరాటం

మాజీమంత్రి హరీశ్‌రావు

- తెలంగాణ విద్యార్థులకు నష్టం చేస్తే ఊరుకోం
- హరీశ్‌ను కలిసిన జీవో 33 బాధిత విద్యార్థులు



మాజీ మంత్రి హరీశ్‌ను కలిసిన విద్యార్థులు, తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం చేస్తున్న జీవో 33పై పోరాటం చేస్తామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని న్యాయ పోరాటానికి కూడా వెనుకాడేది లేదన్నారు. రాష్ట్ర విద్యార్థుల స్థానికత కోసం ప్రభుత్వం కొత్తగా సమగ్ర విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో అత్యున్నత కమిటీ వేసి వైద్య విద్య ప్రవేశాల్లో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని, బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్‌రావు భరోసానిచ్చారు. జీవో 33 వల్ల తమకు జరుగుతున్న అన్యాయంపై గురువారం హరీశ్‌రావును ఆయన నివాసంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి వివరించారు. జీవో 33 నిబంధనల మేరకు తెలంగాణకు చెందిన తమ పిల్లలు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికేతరులుగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన తమ పిల్లలు ఏపీలో చదవడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ స్థానికేతరులుగా మారుతున్నారన్నారు. తమ పిల్లలకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు హరీశ్‌రావును కోరారు.

పంచాయతీలపై ఉన్నమాట అంటే ఉలుకెందుకు..?

కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తాము ఆధారాలు, గణాంకాలతో చెబుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కి పడుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్‌ఎస్ అబద్ధాలు చెబుతోందంటూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఎదురుదాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా గ్రామ పంచాయతీలకు నయాపైసా చెల్లించలేదంటూ ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ, హెల్త్ మిషన్ వంటి పథకాల కింద వచ్చిన రూ.2100 కోట్లను కూడా పంచాయతీలకు ఇవ్వకుండా దారి మళ్లించారని పేర్కొన్నారు. రెండు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు, ఎనిమిది నెలలుగా జడ్పీటీసీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వలేదని, ఈ వాస్తవాలను అంగీకరించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మవంచన బీఆర్‌ఎస్ నైజం



సర్పంచులను పాడెనెక్కించిన ఘనత మీది

- హరీశ్‌రావు విమర్శలకు మంత్రి సీతక్క కౌంటర్

సాక్షి, హైదరాబాద్: 'మాజీ ఆర్థిక మంత్రిగా హరీశ్‌రావుకు పెండింగ్ బిల్లుల బాగోతం తెలుసు. అయినప్పటికీ పదేపదే వాస్తవాలను వక్రీకరించడం అంటే ఆత్మవంచన చేసుకోవడమే అవుతుంది' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో సర్పంచులతో బలవంతంగా పనులు చేయించారు.. వందలకోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో ఎంతో మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రజాసేవ కోసం వచ్చిన సర్పంచులను పాడెనెక్కించింది మీరే' అంటూ ఆమె ధ్వజమెత్తారు. 'గ్రామ పంచాయతీల సమస్యలపై మీరు మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టే. గ్రామ స్వరాజ్యాన్ని గంగలో కలిపి ఇప్పుడు నీతి సూక్తులు వల్లిస్తే ఎలా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, పీఆర్ మంత్రిగా తనపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలపై ఆయా అంశాల వారీగా మంత్రి సీతక్క గురువారం ఓ ప్రకటనలో బదులిచ్చారు. పంచాయతీల బాగుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఏళ్లుగా బిల్లులు పెండింగ్ పెట్టడంతో గ్రామపంచాయతీల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. 'పంచాయతీలకు మేము ఏం చేశామో ప్రజలకు తెలుసు. 15వ ఫైనాన్స్ కమిషన్‌కి సంబంధించి రూ.431.32 కోట్ల నిధులు విడుదల చేశాం. దీనికి అదనంగా రూ.323.99 కోట్ల సీఆర్‌డీ నిధులిచ్చాం. అయినా 9 నెలల్లో 9 పైసలు కూడా విడుదల చేయలేదని అనడం విడ్డూరంగా ఉంది' అంటూ హరీశ్‌రావుపై సీతక్క ధ్వజమెత్తారు.

మంత్రిగా ఎన్ని కంపెనీలు, పెట్టుబడులు తెచ్చారు?

కేటీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ ఎంపీల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా విదేశాలకు వెళ్లిన కేటీఆర్ అక్కడి నుంచి ఎన్ని కంపెనీలు, పెట్టుబడులు తీసుకొచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనతోపాటు.. ఆయన సోదరులపై బీఆర్‌ఎస్ చేస్తున్న విమర్శలను ఖండించారు. ప్రజల కోసం రోజుకు 18 గంటల పాటు పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని వేలెత్తి చూపే హక్కు బీఆర్‌ఎస్ నేతలకు లేదన్నారు. కేవలం అస్తిత్వం కోసమే ఆ పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం బాగుకోసం కేటీఆర్ బావమరిది, కవిత భర్త పెట్టుబడులు పెట్టడానికి వస్తే ఆహ్వానిస్తామన్నారు. అయితే.. గంజాయి, చీప్ లిక్కర్, డగ్స్ మినహా అన్ని వ్యాపారాలకు అనుమతులు ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఢిల్లీకి వచ్చి బీజేపీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని, అవి ఫలించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

తరగతి ఇంతే!

ఒకే గదిలో ఐదు తరగతులు



అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రభుత్వం బడుల్లో సౌకర్యాలు కల్పిస్తుంటే.. ఖమ్మంలోని ఓ పాఠశాలలో ఒకే గదిలో ఒకటి నుంచి అయిదు తరగతులను నిర్వహిస్తున్నారు. ఖమ్మం రజక వీధిలో ప్రభుత్వ పాఠశాల ఉన్నా.. విద్యార్థులు రాక పోవడంతో ఎనిమిదేళ్ల క్రితం రమణగుట్టలో చిన్న గది అద్దెకు తీసుకుని తరలించారు. ప్రస్తుతం పాఠశాలలో 53 మంది విద్యార్థులున్నప్పటికీ.. ఒకే రేకుల గదిలో బోధన సాగుతోంది. దీనికితోడు ఆవరణలో టార్పాలిన్ వేసి పాఠాలు చెబుతుండగా.. వర్షం వస్తే విద్యార్థులు ఇళ్లకే పరిమితం కావలసి వస్తోంది. రెండేసి తరగతుల విద్యార్థులను పక్కపక్కన కూర్చోబెట్టి పాఠాలు చెబుతుండడంతో.. అర్థం కాక ఇబ్బంది పడుతున్నారు. గత కలెక్టర్ ఈ పాఠశాలను సందర్శించి ప్రభుత్వ స్థలంలో గదులు నిర్మించాలని సూచించినా అధికారులు స్పందించలేదు. మరోవైపు అదే రమణగుట్టలో మూసివేసిన బాలవెలుగు పాఠశాలకైనా ప్రస్తుత బడిని తరలించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

బస్సు అద్దాన్ని పగులగొట్టి... కండక్టర్‌పై పామును విసిరి...

మద్యం మత్తులో మహిళ హల్‌చల్...

చెయ్యెత్తినా బస్సు ఆపలేదని ఆగ్రహం



నల్లకుంట (హైదరాబాద్): మద్యం మత్తులో ఉన్న ఓ మహిళ నల్లకుంట ప్రాంతంలో హల్‌చల్ చేసింది. చెయ్యెత్తినా సిటీ బస్సు ఆపకపోవడంతో ఆగ్రహంతో బీర్ బాటిల్ విసిరేయడమే కాకుండా.. ప్రశ్నించిన లేడీ కండక్టర్‌పై పామును విసిరేసింది. జవహర్‌నగర్ ప్రాంతానికి చెందిన బేగం (50) గురువారం సాయంత్రం విద్యానగర్–ఎన్‌సీసీ గేటు మధ్య రహదారిపై నిలుచుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆమె ఆ ఇరుకైన రోడ్డులోని లక్కీ ఎక్స్ రోడ్ వద్ద సిటీ బస్సుల్ని ఆపే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన '107 వీ'సర్వీస్ నెంబర్ కలిగిన బస్సు అక్కడకు రావడంతో ఆపాలంటూ బేగం చెయ్యి ఎత్తింది. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకున్న డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన బేగం తన చేతిలో ఉన్న సంచి నుంచి బీర్ బాటిల్ తీసి బస్సు వైపు విసిరింది. దీంతో బస్సు వెనుక అద్దం పగిలిపోయింది. లోపల ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపడంతో కిందికి దిగి వచ్చిన కండక్టర్ స్వప్న బేగంను నిలదీశారు. మద్యం మత్తులో ఉన్న బేగం తన చేతి సంచి నుంచి పామును బయటకు తీసి కండక్టర్‌పై విసిరారు. పాము పక్కకు పడటంతో కండక్టర్‌కు ముప్పు తప్పింది. బేగం అంతటితో ఆగకుండా కండక్టర్‌తో వాగ్వాదానికి దిగింది. ఈలోపు సమాచారం అందుకున్న నల్లకుంట పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. పాము కోసం స్నేక్ క్యాచర్ల సాయంతో వెతికినా ఫలితం దక్కలేదు. కండక్టర్ ఫిర్యాదు మేరకు బేగంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. బేగంపై బస్సు అద్దాన్ని ధ్వంసం చేయడం, కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించడం, పాము పట్ల అమానుషంగా ప్రవర్తించడం తదితర ఆరోపణలతో కేసు నమోదైంది.



బీరు బాటిల్ తగలడంతో పగిలిన బస్సు అద్దం

ఐదుగురు ఐపీఎస్‌లకు డీజీలుగా పదోన్నతి

- పదోన్నతి పొందిన వారిలో కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, శివధర్‌రెడ్డి, అభిలాష బిస్త్, సౌమ్యా మిశ్రా, శిఖా గోయల్
- తిరిగి అదే స్థానాల్లో వారిని కొనసాగిస్తూ సీఎస్ ఉత్తర్వులు



డీజీగా పదోన్నతి పొందిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన శివధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, బి.శివధర్‌రెడ్డి, అభిలాష బిస్త్, సౌమ్యా మిశ్రా, శిఖాగోయల్ ఉన్నారు. అయితే, వీరిలో కేడర్ కేటాయింపు వివాదం కొనసాగుతున్న ఐపీఎస్ అధికారి అభిలాష బిస్త్‌కు మాత్రం డీఓపీటీ నుంచి తెలంగాణ కేడర్‌కు కేటాయించినట్టు నిర్ధారణ అయిన తర్వాతే పదోన్నతి వర్తిస్తుందని స్పష్టం చేశారు. డీజీలుగా పదోన్నతి పొందిన ఐదుగురు అధికారులను తిరిగి ప్రస్తుత పోస్టింగ్‌లలోనే డీజీపీ హోదాలో కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. వీరిలో కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ సీపీగా, బి.శివధర్‌రెడ్డి ఇంటెలిజెన్స్ డీజీపీ, అభిలాష బిస్త్‌ను తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, డీజీపీ ట్రైనింగ్‌గా, డా.సౌమ్యా మిశ్రా జైళ్లశాఖ డీజీగా, శిఖాగోయల్ సీఐడీ డీజీపీగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా, టీజీఎఫ్ఎస్ఎల్, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కాగా, పదోన్నతి పొందిన వారిలో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సర్వీస్ వచ్చే ఏడాది ఆగస్టు వరకు, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి సర్వీస్ 2026 ఏప్రిల్ వరకు, జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా సర్వీస్ 2027 డిసెంబర్ వరకు, శిఖాగోయల్ సర్వీస్ 2029 మార్చి వరకు ఉంది.

నివారించగలిగిన మహాపరాధాలకు గనక మీరు దూరంగా ఉన్నట్లయితే,
మీ చిన్న చిన్న పాపాలను మేము మీ (లెక్క) నుండి తీసేస్తాము.
ఇంకా మిమ్మల్ని గౌరవప్రద స్థానాల్లో ప్రవేశింపజేస్తాము.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 9 ఆగస్టు 2024

గూగుల్‌పై కన్నెర్ర!

అతిథిగా వచ్చి అడిగినవన్నీ గుక్క తిప్పుకోకుండా చెబుతున్న సిద్ధుణ్ణి చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయిన ప్రవరాఖ్యుడు 'సృష్టికర్త బ్రహ్మకైనా నేర్వశక్యంగాని ఇన్ని సంగతులు తమరికెలా సాధ్యమయ్యాయ'ని ఎంతో వినయంగా అడుగుతాడు 'మనుచరిత్ర' కావ్యంలో. ఈ ఆధునాతన యుగంలో ఆ సిద్ధుణ్ణి మించిపోయి, అడిగిన అరక్షణంలో అన్నిటినీ గూగుల్ ఏకరువు పెడుతోంది. అసలు గూగుల్ లేకపోతే మనకు చాలా విషయాలు తెలిసేవికాదని, మన జ్ఞానానికి ఎన్నో పరిమితులుండేవని ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది విశ్వసిస్తారు. అంతటి గూగుల్‌పై అమెరికా ఫెడరల్ న్యాయస్థానం రూపంలో పిడుగుపడింది. ఈ సంస్థ గుత్తాధిపత్య పోకడలు పోతోందని న్యాయ స్థానం తీర్పునిచ్చింది. పోటీదారులందరికీ సమానావకాశాలు ఉండితీరాలన్న స్వేచ్ఛా మార్కెట్ సూత్రాలకు తిలోదకాలిచ్చి, చట్ట ఉల్లంఘనలకు పాల్పడి వక్రమార్గంలో లాభార్జనకు పాల్పడుతున్నదని తేల్చిచెప్పింది. సంస్థపై ఏ చర్యలు తీసుకోవాలన్నది న్యాయస్థానం ఇంకా చెప్పలేదు. అయితే దాన్ని భిన్న సంస్థలుగా విభజించాలని ఆదేశించటంతో సహా ఎలాంటి చర్యలనైనా సూచించే అవకాశం ఉంది. అసలు ఒక టెక్ దిగ్గజంగా, మహాసంస్థగా వెలిగిపోతున్న గూగుల్ ఏడెనిమిదేళ్ల క్రితం ఒక పెద్ద కార్పొరేట్ సంస్థ 'ఆల్ఫాబెట్'లో ఒదిగి చిన్నబోయింది. ఇప్పటికే అమెజాన్, మెటా, యాపిల్ వగైరా భారీ కార్పొరేట్ కంపెనీలపై నడుస్తున్న వ్యాజ్యాలకు తాజా తీర్పు ప్రమాణంగా మారుతుందన్నది గుత్తాధిపత్య నిరోధక చట్టాల నిపుణులంటున్న మాట. నిజానికి మైక్రోసాఫ్ట్‌పై 2000 సంవత్సరంలో వెలువడిన యాంటీట్రస్ట్ తీర్పు ప్రస్తుత గూగుల్ కేసును ప్రభావితం చేసింది. ఈ కేసు పరిష్కారానికి ఏం చేయాలన్న అంశంపై ప్రభుత్వమూ, గూగుల్ మాట్లాడుకోవాలని, వచ్చే నెల 6 నాటికి నిర్ణయం తెలపాలని న్యాయమూర్తి చెప్పారు. ఈ తీర్పుపై గూగుల్ ఎటూ అప్పీల్‌కి పోతుంది.

గూగుల్‌పై వచ్చిన ఆరోపణలు కొట్టివేయదగ్గవి కాదు. తన సెర్చ్ ఇంజన్‌ను సెల్‌ఫోన్లలో, బ్రౌజర్‌లలో అమర్చేలా యాపిల్‌తో సహా అనేక స్మార్ట్ ఫోన్ కంపెనీలకూ, బ్రౌజర్ కంపెనీలకూ గూగుల్ ఒక్క 2021లోనే 2,600 కోట్ల డాలర్లు చెల్లించిందని, ఇందువల్ల ఇతర సంస్థలు భారీగా నష్టపోయాయని ఆ అభియోగాల సారాంశం. ఒక అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల్లో 90 శాతం మంది గూగుల్ సెర్చ్ ఇంజన్‌పైనే ఆధారపడుతున్నారు. అయితే వినియోగదారులను తాము నియంత్రించటమో, నిర్బంధించటమో చేయటం లేదని... ఎందులో మెరుగైన ఫలితాలొస్తాయో తేల్చుకుని స్వచ్ఛంగా తమను ఎంచుకుంటున్నారని గూగుల్ వాదించింది. వర్తమానంలో ఇంటర్నెట్ తెరిచాక సాగే అత్యంత ప్రధాన వ్యాపకం శోధించటమే. అయితే సెల్‌ఫోన్ తయారీదార్లకూ, బ్రౌజర్ కంపెనీలకూ భారీ చెల్లింపులు చేసి గూగుల్ సెర్చ్ ఇంజన్‌ను చేర్చాక వాటిని వినియోగించేవారికి అంతకన్నా గత్యంతరం ఏముంటుందని న్యాయమూర్తి వేసిన ప్రశ్న సహేతుకమైనది. నిజానికి గూగుల్‌తోపాటు బింజ్‌తో సహా డజను వరకూ సెర్చ్ ఇంజన్ సంస్థలున్నాయి. కానీ అనేక ఏళ్లుగా గూగుల్ తెరచాటుగా సాగిస్తున్న గుత్తాధిపత్యం పర్యవసానంగా వాటికంత ప్రాధాన్యం లేకుండా పోయింది. ఆసక్తికరమైన విషయాన్నీ, అవసరమైన సమాచారాన్నీ సేకరించటానికి వినియోగదారుల్లో అత్యధికులు యథాలాపంగా ఆధారపడేది గూగులే. దాంతో పోలిస్తే వ్యక్తిగత గోప్యత మొదలుకొని అనేక అంశాల్లో ఇతర సంస్థల తీరు ఎంతో మెరుగ్గా ఉన్నదని టెక్ నిపుణులు చెబుతున్న మాట. వినియోగదారులు ఎలాంటి అంశాల గురించి ఆరా తీస్తున్నారన్న డేటా అత్యంత కీలకమైనది. ఈ క్రమంలో వినియోగదారుల ఇష్టానిష్టాలూ... వారి అలవాట్లు, ఆసక్తులకు సంబంధించిన సమాచారం వివిధ ఉత్పాదక సంస్థలకు చాలా అవసరం. వినియోగదారులకు తెలియకుండా ఈ వివరాలన్నీ గూగుల్ అమ్ముకుంటున్నదని చాన్నాళ్లుగా వినబడుతోంది. దాంతోపాటు ఈ రంగంలో గుత్తాధిపత్యం ఉండటాన్ని ఆసరా చేసుకుని వాణిజ్య ప్రకటనకర్తలు చెల్లించే రుసుమును అపారంగా పెంచుతోంది. వివిధ విషయాలూ, పదాలూ ఆధారంగా సెర్చ్ ఇంజన్లకు వినియోగించే క్రమసూత్రాలు (అల్‌గారిథమ్స్) ఏమిటన్నది గూగుల్ అత్యంత రహస్యంగా ఉంచుతోంది.

అమెరికాలో దాఖలైన ఈ కేసులో ఆసక్తికరమైన అంశం ఉంది. ముందుముందు ఎన్నో సంస్థల భవితవ్యాన్ని ప్రభావితం చేసే ఈ కేసులో వ్యాజ్యాన్ని ఎదుర్కొన్న గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాదిరే తీర్పునిచ్చిన న్యాయమూర్తి అమిత్ మెహతా కూడా భారతీయుడే. యాంటీట్రస్ట్ చట్టం నిజానికి 19వ శతాబ్దం నాటిది. పారిశ్రామికరంగం భిన్నరంగాల్లో ఎదగటానికి గుత్తాధిపత్యం పెను అవరోధమని భావించి అప్పట్లో యాంటీట్రస్ట్ చట్టాన్ని తీసుకొచ్చారు. 1970లలో ఐబీఎం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లు, ఆ తర్వాత 1990లలో మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ వ్యవస్థ పైనా ఇలాంటి వ్యాజ్యాలే పడ్డాయి. అవి భారీగా పరిహారాలు చెల్లించుకున్నాయి. మెయిన్‌ఫ్రేమ్ మార్కెట్ ఇప్పుడు దాదాపు లేదు. గూగుల్ రాకతో మైక్రోసాఫ్ట్ గుత్తాధిపత్యం కూడా అంతరించింది. అలాగే ప్రాసెసర్ల మార్కెట్‌లో వెలుగులీనిన ఇంటెల్ ప్రభ కూడా మరోపక్క క్షీణిస్తోంది. మారిన పరిస్థితులను అందిపుచ్చుకోలేకపోవటం, కొత్త రంగాలకు విస్తరించటానికి బద్ధకించటం లాంటివి వీటి వర్తమాన అవస్థకు ప్రధానంగా చెప్పుకోవాల్సిన కొన్ని కారణాలు. గూగుల్ వ్యవహారాన్ని కూడా మార్కెట్ శక్తులకే వదిలేస్తే కాగల కార్యం అవే తీరుస్తాయనీ, గత కాలపు చట్టాలతో నియంత్రించటం వ్యర్థమనీ వాదించేవారికి కూడా కొదవ లేదు. అయితే నియంత్రణ వ్యవస్థలు లేకపోతే కొత్త సంస్థల ఆవిర్భావం సాధ్యమేనా? ఏది ఏమైనా తాజా తీర్పు పర్యవసానాలు ప్రపంచవ్యాప్తంగా ఉంటాయన్నది వాస్తవం.

మానవుల వల్లే వైరస్‌ల విజృంభణ!

వాతావరణ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా జంతువుల నుంచి మనుషులకు వైరస్ సోకే ప్రక్రియ వేగవంతమైంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతూండటం, మంచినీటి లభ్యత తగ్గిపోతూండటం, తమ సహజ ఆవాస ప్రాంతాల నుండి బయటకు మనుషులతోపాటు జంతువులూ కదులుతూండటం వల్ల సమస్య మరింత జటిలమవుతోంది. వాతావరణ మార్పు తీవ్రతను ఎంత కనిష్ఠంగా లెక్క కట్టినా కనీసం మూడు లక్షల వైరస్‌లు మొట్టమొదటిసారి కొత్త జంతు అతిథిలోకి చేరతాయని అంచనా. క్షీరదాలు, పక్షుల వలస మార్గాలను కృత్రిమ మేధ సాయంతో అంచనా కట్టి... వ్యాధికారక సూక్ష్మజీవులు ఎక్కడెక్కడ అధికం అవుతాయో గుర్తించి తగిన చర్యలు తీసుకోవటం, గట్టి ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటం ఇందుకు పరిష్కారం.

విశ్లేషణ



కె. శ్రీనాథ్ రెడ్డి

దేశంలో మళ్లీ ఇప్పుడు వైరస్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఒక పక్క ప్యారిస్‌లో భారీ మహోత్సవాల మధ్య ఒలింపిక్స్ జరుగుతుండగా... ఇంకోపక్క దేశంలో నిఫా, చాందీపుర వైరస్‌లు కూడా ఒలింపిక్స్ మాదిరిగానే వార్తల్లోకి ఎక్కుతున్నాయి. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా కోవిడ్ కారణంగా ఇప్పటికీ మరణాలు కొనసాగుతున్నట్లు మనల్ని హెచ్చరి స్తుండటం గమనార్హం. వీటన్నింటినీ పక్కనపెట్టినా, సాధారణ జలుబు రూపంలో బోలెడన్ని వైరస్ రకాలు తెరిపి లేకుండా మనిషిని జబ్బున పడేస్తూనే ఉన్నాయి.



అనేక వైరస్ వ్యాధులు జంతువుల నుంచి మనుషులకు సోకుతున్నవే. అదేదో జంతువులు మనపై కక్షకట్టి చేస్తున్న పనేమీ కాదు. మానవులు ఆక్రమించుకున్న తమ ఆవాసాలను మళ్లీ సంపాదించుకునే పనిలో ఉన్నాయనీ కాదు. అడవిలో బతికే జంతుజాలాన్ని మనం మన ఆవాసాల్లోకి చేర్చుకున్నాం కాబట్టి! అలాగే మన మధ్యలో ఉన్న జంతువులు అటవీ ప్రాంతాల్లోకి చేరేందుకు తగిన 'మార్గం' వేశాము కాబట్టి! అటవీ ప్రాంతాల విచ్చలవిడి విధ్వంసం, పాడి పశువులను పెద్ద ఎత్తున పెంచుతూండటం, రకరకాల పెంపుడు జంతువుల ఎగుమతి, దిగుమతులు, దేశాల మధ్య మనిషి విపరీతంగా తిరిగేస్తూండటం వంటివన్నీ వైరస్‌లు కూడా మనుషుల్లోకి జొరబడేందుకు అవకాశాలు పెంచుతున్నాయి.

పెరుగుతున్న వేడి... తరుగుతున్న నీరు

వాతావరణ సంక్షోభం కారణంగా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జంతువుల నుంచి మనుషులకు వైరస్ సోకే ప్రక్రియ వేగవంతమైంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతూండటం, మంచినీటి లభ్యత తగ్గిపోతూండటం, తమ సహజ ఆవాస ప్రాంతాల నుండి బయటకు మనుషులతోపాటు జంతువులూ కదులుతూండటం వల్ల సమస్య మరింత జటిలమవుతోంది. వైరస్‌లు స్వేచ్ఛగా ఒక జంతువు నుంచి ఇంకో దాంట్లోకి చేరేందుకు ఈ పరిస్థితులు వీలు కల్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే సురక్షితంగా ఉండేందుకు లేదా తీవ్రస్థాయి అనారోగ్యం కలిగించేందుకు వీలు కల్పించే కొత్త కొత్త జంతు అతిథులు వైరస్‌లకు లభిస్తున్నాయి. సైన్స్ రచయిత ఎడ్ యంగ్ ఇటీవల 'ది అట్లాంటిక్'లో రాస్తూ... మనిషి 'ప్యాండెమిసీన్' యుగాన్ని సృష్టించుకున్నాడని ప్రస్తుత పరిస్థితిని అభివర్ణించారు. భూమిపై మనిషికి ముందు ఉన్న యుగాన్ని హోలోసీన్ అని, మనిషి పుట్టుక తరువాతి యుగాన్ని ఆంత్రోపసీన్ అని పిలిస్తే... ప్రస్తుత మహమ్మారుల యుగాన్ని ప్యాండెమిసీన్ (పాండమిక్ = మహమ్మారి) అని పిలిచాడన్నమాట.

జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన గ్లోబల్ ఛేంజ్ జీవశాస్త్రవేత్త కాలిన్ కార్ల్‌సన్ ఈ మధ్యే ఈ ప్యాండెమిసీన్‌కు సంబంధించి భవిష్యత్తు దర్శనం చేయించారు. వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్తులో ఎలాంటి వైరస్‌లు మనుషులకు సోకే అవకాశముందో అంచనా కట్టారు. 'నేచర్'లో ప్రచురితమైన ఈ అంచనా ప్రకారం... మనిషిని ముట్టడించేందుకు అవకాశమున్న వైరస్‌ల సంఖ్య ఏకంగా పదివేల రకాలు! ప్రస్తుతం వీటిల్లో అత్యధికం జంతువుల్లో మాత్రమే తిరుగుతూ ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన హద్దులు చెరిగిపోతూండటంతో అవి ఇతర జంతువులకు అంటే మనుషులకు కూడా సోకే ప్రమాదం పెరిగింది. వాతావరణ సంక్షోభం కాస్తా జంతువులు, మనుషులు కొత్త ప్రాంతాలకు వలస వెళ్లేలా చేస్తూండటం గోరుచుట్టుపై రోకటిపోటు అన్న చందం అయిందన్నమాట. ఇట్లాంటి పరిస్థితులు వైరస్‌లకు జాతర లాంటిది అంటే అతిశయోక్తి కాదు. అసలు పరిచయమే లేని బోలెడన్ని వైరస్‌లు ఒక దగ్గర చేరితే ఎన్ని కొత్త స్నేహాలు, బంధుత్వాలు కలుస్తాయో ఊహించుకోవచ్చు.

వినాశకర మార్పులు

వేర్వేరు వాతావరణ, భూ వినియోగ మార్పు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కార్ల్‌సన్ వేసిన అంచనాల ప్రకారం 2070 నాటికి కనీసం 3,139 క్షీరద జాతులు (పాలిచ్చి పెంచే జంతువులు) సహజ ఆవాసాలకు దూరంగా వలస వెళతాయి. ఈ మార్పు కూడా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని ఎత్తైన, జీవవైవిధ్య భరిత, జనసాంద్రత అధికంగా ఉన్న చోట్ల జరుగుతుంది. దీనివల్ల జీవజాతుల మధ్య వైరస్‌ల సంచారం నాలుగు వేల రెట్లు ఎక్కువ అవుతుందని వీరు లెక్క కట్టారు. ఒకప్పుడు పశ్చిమ ఆఫ్రికాకు మాత్రమే పరిమితమైన ఎబోలా వైరస్ ఇప్పుడు ఖండమంతా విస్తరించింది. అలాగే దక్షిణాసియా లోనూ మునుపు నిర్ధారించిన ప్రాంతాలను దాటుకుని వైరస్‌లు మనుషులకు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ మార్పు తీవ్రతను ఎంత కనిష్ఠంగా లెక్క కట్టినా కనీసం మూడు లక్షల వైరస్‌లు మొట్టమొదటిసారి కొత్త జంతు అతిథిలోకి చేరతాయని కార్ల్‌సన్ బృందం అంచనా వేస్తోంది. వీటిల్లో 15,000 వరకూ క్షీరదాలు ఉంటాయి. వాస్తవానికి ఈ మార్పిడి ఇప్పటికే మొదలైందని కార్ల్‌సన్ హెచ్చరిస్తున్నారు. 2100 నాటికి భూమి సగటు ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీ సెల్సియస్ వరకూ పెరగవచ్చునని వాతావరణ శాస్త్రవేత్తలు ప్యారిస్ ఒప్పందంలో చెప్పిన విషయం ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఉష్ణోగ్రతలు ఆ స్థాయికి చేరక ముందే పరిస్థితి ఇలా ఉంటే ఇక చేరితే ఇంకెలా ఉంటుందో ఊహించడం కష్టమే.

కనిపించేది కొంతే... పొంచివున్నది ఎంతో!

కార్ల్‌సన్ బృందం చేపట్టిన ఈ అధ్యయనం పేరు 'ఐస్‌బర్గ్ స్టడీ'. అంటే పైకి కనిపించే భాగం మాత్రమే. కనిపించనిది ఇంకా చాలానే ఉందన్నమాట. ప్రస్తుతం ఎక్కువ అవుతున్న జూనోటిక్ వ్యాధులు రాగల ప్రమాదాలతో పోలిస్తే చిన్న భాగం మాత్రమేనని అర్థమవుతుంది. క్షీరదాల్లో గబ్బిలాలు జూనోటిక్ వైరస్‌ల విజృంభణలో ముందు వరసలో ఉన్నాయి. సార్స్ కోవ్–2 కూడా వూహాన్ ప్రాంతంలోని గుహల్లో ఉన్న గబ్బిలాల నుంచి మనుషులకు సోకిందే. ఎక్కువ దూరాలు ప్రయాణించగల సామర్థ్యం వల్ల ఈ గబ్బిలాలు వాతావరణ మార్పులకు వేగంగా స్పందిస్తాయి. వందల కిలోమీటర్ల దూరాన్ని దాటేస్తాయి. తమతోపాటు వైరస్‌లను కూడా మోసుకొస్తాయి. పండ్లను ఆహారంగా తీసుకుంటాయి కాబట్టి ఈ వైరస్ జాడలు పండ్ల నుంచి మనకూ సోకుతాయన్నమాట. నిఫా వైరస్ ప్రస్థానం కూడా దాదాపుగా ఇలాంటిదే. ఆగ్నేయాసియా ప్రాంతంలో గబ్బిలాల జీవవైవిధ్యం చాలా ఎక్కువ. ఫలితంగా ఈ ప్రాంతం నుంచి సరికొత్త వ్యాధులు పుట్టుకొచ్చే, వ్యాప్తి చెందే అవకాశం కూడా ఎక్కువే.

అయితే జలచరాలు, పక్షుల ద్వారా కూడా వైరస్‌లు మనిషికి సోకవచ్చు. ఇన్‌ఫ్లుయెంజా వైరస్ రకాలకు పక్షులు ఆతిథ్యమిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణ మార్పులు అనేవి వ్యవస్థ మొత్తాన్ని గందరగోళానికి గురి చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో వాతావరణ మార్పుల సమస్యను మనం మరింత తీవ్రతతో పరిష్కరించాల్సిన అవసరాన్ని ఈ ఐస్‌బర్గ్ స్టడీ స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిపాదించిన వన్ హెల్త్ (మనుషులతోపాటు పరిసరాల్లోని జంతువులపై కూడా పర్యవేక్షణ) మైక్రోబియల్ నిఘా వ్యవస్థ, వేర్వేరు ప్రాంతాలు, జీవజాతుల సమాచారాన్ని క్రోడీకరించడం వంటివి ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. క్షీరదాలు, పక్షుల వలస మార్గాలను కృత్రిమ మేధ సాయంతో అంచనా కట్టి... బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి వ్యాధికారక సూక్ష్మజీవులు ఎక్కడెక్కడ ఎక్కువ అవుతాయో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తు అవసరాలను సరిగ్గా అంచనా కట్టే ఆరోగ్య వ్యవస్థల ఏర్పాటూ తప్పనిసరి. అప్పుడే కొత్త వ్యాధుల ఆగమనం, వాటిని అడ్డుకోవడం, సమర్థంగా తిప్పికొట్టడం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త 'పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' మాజీ అధ్యక్షులు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మంచి జరిగేనా?



ఓ వెయ్యి మంది తమ జీవితకాలాల్లో కూడా అనుభవించలేనిది రెజ్లర్ వినేశ్ ఫోగట్ 29 ఏళ్లకే అనుభవించింది. రాజకీయా లను పక్కనపెడితే, ఇది తీవ్రమైన క్షోభ. దేవుడు ఏం చేసినా మంచికే చేస్తాడు అనేదాని మీదే సందేహం వస్తోంది. దీన్నుంచి ఆమెకు ఏం మంచి జరగనుందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా.

– అశోక్ లవాసా, మాజీ ఉన్నతాధికారి

గమనించడం లేదా?



భారతీయ ముస్లిం లుగా పాలస్తీనా గురించి మనం మాట్లాడకుండా ఉండలేదు. చాలామంది మన తోటి హిందువులు కూడా మనతో గొంతు కలిపారు. ఇప్పుడు మన పొరుగు దేశంలో హిందువులు నరమేధానికి గురవుతున్నప్పుడు, గొంతెత్తడం అటుండనీ, కనీసం దాన్ని గుర్తించక పోతే ఎలా?

– ఒమర్ ఖూజీ, రచయిత

హృదయం ముక్కలు



నేను ప్రేమించే నా దేశం బంగ్లాదేశ్‌లో మనుషులు ప్రాణాలు కోల్పోతుండటం నా గుండెను ముక్కలు చేస్తోంది. ఇలాంటి కష్టకాలంలో మా అమ్మను చూడలేకపోవడం, హత్తుకోలేకపోవడం మరింత వేదన కలిగిస్తోంది. ఏమైనా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా రీజినల్ డైరెక్టర్‌గా నా విధులకు కట్టుబడి ఉంటాను.

– సైమా వాజెద్, షేక్ హసీనా కూతురు

ఆహార ప్రభావం



పిండిపదార్థాలు తింటూ, అరుదుగా జిమ్‌కు వెళ్తూ కూడా యూరోపియన్లు ఫిట్‌గా ఉంటారు. అదే ఆచరిస్తే అమెరికన్లు మాత్రం లావెక్కుతారు. స్థూలకాయ రేటు యూరప్‌లో 17 శాతం అయితే, అమెరికాలో 42 శాతం. దీనికి ముఖ్య కారణం, అమెరికాలో అల్ట్రా–ప్రాసెస్డ్ ఆహారం తింటుంటే, యూరోపియన్లు సహజమైన ఆహారం తింటున్నారు.

– మైకేల్ మోరెల్లీ, ఆరోగ్య నిపుణుడు

ఎందుకు కనాలి?



ప్రపంచానికి పిల్లల్ని కనిచ్చే బాధ్యత మహిళల మీద లేదు. మగవాళ్లకు పిల్లల్ని కనిచ్చే బాధ్యత మహిళల మీద లేదు. దీనికి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కూడా వారి మీద లేదు.

– లారీ పెన్నీ, రచయిత్రి

దక్షిణాది భాషల
మహా సాహిత్య ఉత్సవం

దక్షిణాది దేశీభాషల మధ్య ఎంత సారూప్యత, సామీప్యం ఉన్నా, సంస్కృతుల ఆదాన ప్రదానాలున్నా, భావోద్వేగాల దగ్గరితనం ఉన్నా ఈ అన్ని భాషల కళా, సాంస్కృతిక రంగాల ఉమ్మడి సమ్మేళనాలు జరిగేది తక్కువ. జాతీయంగా జరిగే వేడుకలలో దక్షిణాది కళా సాహిత్య సాంస్కృతిక రంగాల సభ్యులు కలవడమే తప్ప స్థానికంగా వీరికై వీరు నిర్వహించుకునే సామూహిక సమ్మేళనాలు అరుదు. సాహిత్య రంగంలో అయితే తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషా రచయితలు ఒకచోట కూడి సాహిత్యాన్ని చర్చించుకునే మహా ఉత్సవాలు కొన్ని దశాబ్దాలుగా లేవు. సాహిత్య అకాడెమీ నిర్వహించుకునే సమావేశాలలో కొద్ది మంది కలవడమే కాని పెద్ద సంఖ్యలో కలిసే మహా ఉత్సవాలు ఏనాడూ జరగలేదు.

ఈ వెలితిని పూడ్చేందుకు బహుశా తొట్టతొలిసారిగా సందర్భం వచ్చింది. బెంగళూరులో పుస్తక ప్రచురణ, ప్రచార రంగంలో కృషి చేస్తున్న 'బుక్‌బ్రహ్మ' సంస్థ ఆగస్టు 9, 10, 11 తేదీలలో 'బుక్‌బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్– 2024' పేరుతో భారీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నది. కోరమంగళలోని సెయింట్ జాన్స్ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో నాలుగు భాషల నుంచి దాదాపు 300 మంది రచయితలు, విమర్శకులు, అనువాదకులు, ప్రచురణకర్తలు పాల్గొననున్నారు. ఆడిటోరియంలో ఐదు వేదికలలో సమాంతరంగా ప్రతి గంట ఒక సమావేశం జరగనుంది. కన్నడ సాహిత్యకారుడు సతీష్ చప్పరికె ఈ ఫెస్టివల్‌కు డైరెక్టర్. అనువాదకుడు అజయ్ వర్మ తెలుగు భాషకు అనుసంధానకర్తగా ఉన్నారు. ఓల్గా, మృణాళిని, కుప్పిలి పద్మ, వివినమూర్తి, వాడ్రేవు చినవీరభద్రుడు, కాత్యాయని విద్మహే, వినోదిని, జూపాక సుభద్ర, గోగు శ్యామల తదితర 30 మంది తెలుగు రచయితలు ఈ ఉత్సవంలో పాల్గొననున్నారు. పెరుమాళ్ మురుగన్, కె.సచ్చిదానందన్, వివేక్ శాన్‌భాగ్, జయమోహన్ వంటి సుప్రసిద్ధులు వేదికల మీద ప్రసంగించనున్నారు. ప్రధానంగా కథ, నవలా సాహిత్యంపై చర్చ ఉంటుంది.

ఇంగ్లిష్ భాష ద్వారా కాకుండా నేరుగా దక్షిణాది భాషల మధ్య అనుసంధానం ఏర్పరచడమే ఈ ఉత్సవం లక్ష్యం. ప్రతి ఉదయ, సాయంత్రాలు నాలుగు భాషల ఉద్దండ కళాకారులు సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్న ఈ ఉత్సవంలో విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. ద్రవిడ భాషలలో సాహిత్య వికాసానికి ఈ వేడుక ఒక మేలైన చోదకశక్తి కాగలదని పలువురు సాహిత్యకారులు భావిస్తున్నారు. ఈ ఉత్సవానికి ప్రవేశం ఉచితం. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎవరైనా పాల్గొనవచ్చు.

ఉన్నవాడికి చుట్టాలు... పేదవానికి కష్టాలు!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

కొత్త నేర చట్టాలను అనుసరించి మొత్తం 90 రోజులు నిందితులను కస్టడీలో పెట్టవచ్చు. పోలీసు కస్టడీ, కోర్ట్ కస్టడీల పేరుతో లాకప్‌లో లేదా జైళ్లలో బంధించేందుకు పోలీస్, న్యాయ వ్యవస్థలకు వీలు కల్పిస్తున్న ఈ చట్టాలు సాధారణ పౌరుల పాలిట శాపాలే అనడం అతిశయోక్తి కాదు. పోలీసులు తలచుకుంటే ఎవరినైనా శంకరగిరి మాన్యాలు పట్టించడానికి సకల అధికారాలనూ కట్టబెడుతున్న ఈ చట్టాల వల్ల... ధనవంతులకు అంతగా ఇబ్బంది ఉండకపోవచ్చు. వారు లంచాలు ఇవ్వగలుగుతారు. ఖరీదైన లాయర్లను నియమించుకొని బెయిల్ పొందగలుగుతారు. ష్యూరిటీలు ఇవ్వగలుగుతారు. కొత్త చట్టాల పుణ్యమా అని రాజకీయనాయకుల ప్రమేయం, డబ్బులు... పోలీస్ కేసుల వ్యవహారంలో మునుపటి కన్నా ఎక్కువ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయి.

ఇవీ మన కొత్త చట్టాలు–3



ఒక వ్యక్తి నేరం చేశాడనే అభియోగంతో అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు తీరికగా నేర ఆరోపణ చేసి కోర్టుకు పంపిస్తారు. ఆరోపణలపై విచారణకు ఎన్నేళ్లయినా పట్ట వచ్చు. చివరికి ఆరోపించిన నేరం రుజువు కాకపోవచ్చు. అప్పటివరకూ జైల్లో ఉన్న ఆ పౌరుని స్వేచ్ఛ ఖరీదెంత అంటే ఎవరూ సమాధానం చెప్పలేరు. ఒక వేళ నేరస్థుడు అని కోర్టు తీర్పు ఇస్తే ఇక అప్పీళ్లలో గెలవడం అనేది డబ్బుతో కూడుకున్న వ్యవహారం అవుతుంది. వకీళ్లకు సంబంధించిన డబ్బు, లంచగాళ్లను మేపడానికి చెల్లించడాలు ఉండనే ఉంటాయి.

పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌తో పోల్చితే కొత్త చట్టాలు (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023) ప్రమాదకరమైనవి. పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్– 1973 కింద 'అత్యధికంలో అధికం' 15 రోజులకు మించి ఎవరినీ అరెస్టు చేయడానికి వీల్లేదు. ఇది పార్లమెంట్ చేసిన చట్టం కాదు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాయక సభ 1950లోనే నిర్ణయించిన విషయం. రాజ్యాంగం మూడో భాగంలో అతి కీలకమైన పౌరుని ప్రాథమిక హక్కుల గురించిన వివరాలు ఉన్నాయి. ఇందులో 21వ ఆర్టికల్ జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛల ప్రాముఖ్యాన్ని చెబితే... 22వ ఆర్టికల్ అరెస్ట్, డిటెన్షన్‌లకు సంబంధించిన వివరాలను పేర్కొంటోంది. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల లోపే కోర్టు ముందు కచ్చితంగా హాజరు పరచాలని ఈ ఆర్టికల్ చెబుతోంది. ఈ రాజ్యాంగ నిబంధనలను అనుసరించి చేసిన చట్టాలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. ఇలా 24 గంటలని ప్రత్యేకంగా పేర్కొనడానికి కారణం... పోలీసుల కస్టడీలో దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్)కు ఒక్క 24 గంటలు చాలని భావించడమే! సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను గమనిస్తే ఇదే సంగతి బోధపడుతుంది.

అయితే 24 గంటలకు మించి కస్టడీలో ఉంచుకోవడానికి పోలీసులు రకరకాల కారణాలు చెప్పడానికీ, ఏ కారణాలూ ఇవ్వకుండానే అరెస్టు చేసి కస్టడీ చేసేందుకూ పోలీసులకు ఈ నేర చట్టాలు విపరీతమైన అధికారాలను ఇస్తున్నాయి. సింపుల్‌గా 'తరువాత చూద్దాంలే, ముందు కస్టడీలో పడేయండి' అనే అధికారం ఇస్తున్నాయి. ఎంపీలు, డబ్బున్నవారు, ఎమ్మెల్యేలు, మంత్రుల పలుకుబడి ఉన్నవారు ఈ కస్టడీల నుంచి బయట పడిపోగలుగుతారు. కానీ కనీసం జరిమానా కూడా కట్టలేక, బెయిల్ కండిషన్ల కింద డబ్బు చెల్లించలేక ఎంతోమంది పేద, మధ్యతరగతి పౌరులు జైలు పాలు అయ్యేవారే అధికం అని ఈ చట్ట నిబంధనల వల్ల అర్థమవుతుంది.

భారతీయ సురక్ష సంహిత కింద 15 రోజుల నుంచి, విడి విడిగా 40 రోజులు, 60 రోజుల దాకా; ఇంకా కొన్ని కేసుల్లో 90 రోజులూ జ్యుడిషియల్ కస్టడీ (అంటే కోర్టు సమీక్షించే కస్టడీ) పెంచడానికి చట్టాన్ని తయారు చేశారు.

పోలీసు కస్టడీ అయితే ఇంకా మరీ ఇబ్బందికరమైనది. పోలీసులు కస్టడీలో ఉంచే కాలం 15 రోజుల నుంచి 60 రోజుల దాకా పెరుగుతుంది. మొదట 15 రోజుల దాకా కస్టడీలో పడేస్తారు. దర్యాప్తు చేయడానికి సమయం చాలలేదని... కస్టడీ సమయాన్ని పొడిగించమని కోరితే సురక్ష సంహిత నియమాల ప్రకారం మరో 15 రోజులు కస్టడీకి పంపుతారు. ఇలా 60 రోజుల దాకా కస్టడీలో ఉంచే అవకాశాన్ని కొత్త చట్టాలు ఇస్తున్నాయి. 10 ఏళ్ల జైలు శిక్ష విధించగలిగిన సెక్షన్ కింద అరెస్ట్ చేస్తే 40 రోజుల దాకా పోలీసులు కస్టడీలో పెట్టుకునే అధికారం పోలీసులకు దఖలుపడుతోంది.

పోలీసులకు అపరిమిత అధికారాలు ఇచ్చి, పౌర హక్కులకు భంగం కలిగే అవకాశాన్ని కొత్తచట్టాలు ఇస్తున్నాయనేది మొత్తంగా మనం అర్థం చేసుకోవలసిన అంశం.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

చట్టాలను అమలుపరచండి!

ఆధునిక సమాజ గత కాలపు ఆనవాళ్లు ఆదివాసీ ప్రజలు. సమష్టి జీవన పద్ధతులు, సహజీవనం, పారదర్శకతకు నిలువెత్తు సాక్షులు వారు. బ్రెజిల్, పెరూ దేశాలలో వందకుపైగా ఆదివాసీ తెగలు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఉన్నారు. పెరూలో 50–60 వేల ఏళ్ల నుంచి అటవీ దుంపలు ప్రధాన ఆహార వనరుగా జీవిస్తూ... మొక్కజొన్న, బంగాళాదుంప సాగుకు ఈ తెగలు ఎంతో తోడ్పడ్డాయి. తాము వేటాడే జంతువులకు ఎరగా వేసే క్యూరారే మొక్క నేడు ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సకు ఔషధంగా మారింది. గత సునామీలో అండమాన్‌లో ఆదివాసీ తెగలవారు ఎవరూ చనిపోలేదు. కారణం సముద్రం వెనక్కి వెళ్లగానే వారు ఎత్తైన కొండలపైకి వేగంగా కదిలి వెళ్లారు. జారవా, సెంటినిల్ తెగల ఆదివాసీల్లో కళ్లుతెరచి సముద్రపు నీటిలో చేపలవేటను సాగించేందుకు అనువుగా 50 శాతం మంది కళ్లు రూపాంతరం చెందాయి. '...ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉంది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం, వాటిని అమలుచేయడం, తద్వారా జీవించే హక్కుతో సహా ఆధునిక మానవునికి గల అన్ని హక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నది' అని 1994 డిసెంబర్ 23న ఐక్యరాజ్య సమితి జనరల్‌అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది.

పై తీర్మానంపై 148 దేశాలు సంతకాలు చేసినా, కొంత మేరకు అమలుచేసిన దేశాలు కేవలం 60 మాత్రమే. ఈ 60లో భారతదేశం లేదు. ప్రపంచవ్యాప్తంగానే తొలుత ఈ తీర్మానాన్ని అమలు చేయాలని ప్రయత్నించిన వారు ప్రపంచస్థాయి ఎన్‌జీఓలు మాత్రమే. మనదేశంలో ఇప్పటికీ అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వాలు జరపడం లేదు. ఎన్‌జీఓలు చేసే కార్యకలాపాలకు కొన్ని రాష్ట్రాలలో కేవలం ఆర్థిక తోడ్పాటును మాత్రమే ప్రభుత్వాలు అందిస్తున్నాయి. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తింపు పొందాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. అవే 5వ, 6వ షెడ్యూళ్లు. ప్రాంతీయ, పరిమిత స్వయంపాలనా హక్కు వీటిద్వారా ఆదివాసీలకు సంక్రమించాయి. ఆచరణకు వీలుగా పీసా చట్టం (పి.ఇ.ఎస్.ఎ–1996) వచ్చింది. అయినా బూర్జువా పాలకవర్గాలు దేశంలో గిరిజన తెగలకు స్వయం పాలనా హక్కులు ఇవ్వలేదు. నేడు జరుగుతున్న ఉత్సవాలు పాలకవర్గాల అవసరాల కోసమే తప్ప ఆదివాసీలను కాపాడడానికి కాదు. నిజమైన ఆదివాసీ దినోత్సవం ఆదివాసుల 'అవసరాలు–ఆకాంక్షలు' నెరవేర్చేదిగా ఉండాలి.

– వూకె రామకృష్ణ దొర, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.పంచమి రా.11.49 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** హస్త రా.12.46 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.7.26 నుండి 9.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** రా.6.07 నుండి 7.55 వరకు, గరుడ పంచమి ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

ఆరోగ్యశ్రీ కార్డుల కోసం కమిటీ

- ఎంపిక మార్గదర్శకాల నిమిత్తం వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం!
- 3 కోట్ల మందికి ఈ పథకం వర్తించేలా ప్లాన్?

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ కార్డుల ఎంపికకు మార్గదర్శకాల తయారీ కోసం త్వరలోనే ఒక కమిటీని నియమించాలని వైద్య ఆరోగ్యశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఎవరిని అర్హులుగా ఎంపిక చేయాలి? పాత కార్డుల అప్డేట్, కొత్త పేర్ల ఎంట్రీ, సవరణలు వంటి అంశాలపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. దీంతోపాటు రేషన్ కార్డుతో లింక్ కట్ చేస్తూ అందరికీ స్కీమ్ వర్తించేలా నిబంధనలు ఎలా ఉండాలనే అంశాలపై ఈ కమిటీ స్పష్టమైన మార్గదర్శకాలను తయారు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి తర్వాత ఈ కమిటీ ఏర్పాటుపై స్పష్టత రానుంది.

రేషన్ కార్డునే పరిగణనలోకి తీసుకోకుండా..

ప్రభుత్వం హామీయిచ్చినట్లు రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకోకుండా బీపీఎల్ కుటుంబాలను ఆదాయ ధ్రువీకరణ పత్రం ద్వారా గుర్తిస్తూనే, క్షేత్రస్థాయి కమిటీ ద్వారా విచారణ చేయించనున్నారు. ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఏమిటి వంటి అంశాలపై కూడా ప్రభుత్వం ఆరా తీయనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 లక్షల పైచిలుకు మంది ఆరోగ్య శ్రీ కార్డుల కోసం ఎదురుచూస్తుండగా, మరో 11 లక్షల దరఖాస్తులు మెంబర్ అడిషన్ (అదనపు సభ్యులు చేర్పులు) కోసం పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే కార్డులు ఉన్నోళ్లకు అప్డేట్ చేస్తూనే, కొత్త కార్డులు పంపిణీ చేయనున్నారు. ఇప్పుడు 89.96 లక్షల కుటుంబాలకు మళ్లీ కొత్త కార్డులు ఇస్తూనే, ఇప్పటి వరకు అసలు పొందని వాళ్లకీ ఆరోగ్య శ్రీ కార్డులు అందజేయనున్నారు. ప్రభుత్వ అంచనా ప్రకారం దాదాపు 3 కోట్ల మందికి ఈ స్కీమ్ వర్తించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీకి ప్రతి ఏటా దాదాపు రూ.1100 కోట్లు ఖర్చు అవుతుండగా, కొత్త కార్డుల ద్వారా మరో రూ.నాలుగైదు వందల కోట్ల వరకు ఖర్చు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డులపై ఉప సంఘం ఏర్పాటు

చైర్మన్‌గా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించే ఈ ఉప సంఘంలో సభ్యులుగా మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కన్వీనర్‌గా ప్రభుత్వ కార్యదర్శి హోదాలో పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ వ్యవహరిస్తారు. కొత్త రేషన్ కార్డుల జారీకి ఎలాంటి మార్గదర్శకాలను అమలు చేయాలనే అంశంతో పాటు అర్హుల ఎంపిక ఏ ప్రాతిపదికన చేయాలనే విషయాన్ని ఈ సబ్ కమిటీ నిర్ణయిస్తుంది.

చింతమడకలో 'డబుల్' కష్టాలు



ఐదేళ్లుగా పొలం దగ్గరే...

ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇస్తామని ఉన్న ఇంటిని కూల్చివేశారు. డాబా ఇల్లు కట్టిస్తామంటే సంబరపడ్డాం. అప్పటి నుంచి పొలం దగ్గరనే గుడిసె వేసుకొని ఉంటున్నాం. వానాకాలం కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రివేళ పాములు, తేళ్లు వస్తుండటంతో భయంగా బతుకుతున్నాం.

– రాందేని రాములు, రాజవ్వ, చింతమడక

కేసీఆర్ స్వగ్రామమైన చింతమడకను మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. సీఎం హోదాలో 22 జూలై 2019న కేసీఆర్ ఆ గ్రామాన్ని సందర్శించారు. పూర్వపు చింతమడకలో (ప్రస్తుతం చింతమడక, మాచాపూర్, సీతారాంపల్లి గ్రామాలుగా విడిపోయాయి) ఉండేవారికి ఉపాధి కోసం ఒక్కో కుటుంబానికి రూ 10లక్షల నగదు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు. 1,837 డబుల్ బెడ్రూం ఇళ్లకు పరిపాలన అనుమతులు రాగా అందులో 1,215 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. కొన్ని పూర్తికాగా గృహప్రవేశాలు కూడా జరిగాయి. మిగతా ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో కొందరు పొలాల వద్ద గుడిసెలు వేసుకొని, ప్రభుత్వ పాఠశాలలో మరికొందరు నివాసం ఉంటున్నారు.

– సాక్షి, సిద్దిపేట



బావి వద్ద ఉంటున్నాం

రాములవారి గుడి నిర్మాణానికి స్థలం, బాలికల గురుకుల పాఠశాల కోసం ఎకరం భూమిని తీసుకున్నారు. ఆ సమయంలో మాకు ఇల్లు కట్టిస్తామని చెప్పారు. దీంతో అప్పటి నుంచి బావి వద్దే గుడిసె వేసుకొని ఉంటున్నాం. ప్రస్తుతం మాకు ఆరోగ్యం సహకరించడం లేదు. ఎకరం పొలానికి సంబంధించిన పరిహారానికి ఇంకా రూ. 45 వేలు రావాలి.

– బుచ్చిగారి చంద్రకళ, సత్తయ్య, చింతమడక

'డబుల్' ఇళ్లకు కావాల్సింది రూ.4వేల కోట్లు!

కేంద్రం నుంచి వచ్చే సొమ్ము రూ. 400 కోట్లే

- రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు 'ఇందిరమ్మ' పథకానికే సరి
- డబుల్ బెడ్రూం ఇళ్లకు నిధుల సర్దుబాటు ఎలాగనే సందేహాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలంటే...దాదాపు రూ. 4 వేల కోట్లు కావాలి. అయితే కేంద్రం నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వచ్చే నిధులు రూ.400 కోట్లు మాత్రమే. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డబుల్ ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు వీలైనంత త్వరలో అందజేస్తామని శాసనసభలో ప్రకటించింది. కానీ బడ్జెట్‌లో ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు ఇందిరమ్మ పథకానికే సరిపోయే పరిస్థితి. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్లకు నిధులు ఎలా సర్దుబాటు చేస్తారో చూడాలి.

లబ్ధిదారుల జాబితా అందజేసినా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్రూం పథకంలో కొన్ని ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. గత సర్కారు 2.90 లక్షల ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి టెండర్లు పిలిచింది. 2.28 లక్షల ఇళ్లకు కాంట్రాక్టర్లతో ఒప్పందాలు జరిగాయి. అందులో 1.53 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఇంకా ఒప్పందం జరగని ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.2 వేల కోట్లు మంజూరు చేసింది. అందులో తొలి విడతగా అప్పట్లోనే రూ.1,100 కోట్లు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం..లబ్ధిదారుల జాబితాను అందించాకే రెండో విడత నిధులు విడుదలవుతాయి. కానీ అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక చేపట్టలేదు. దీంతో నిధులు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా సరిపోక ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది.



ఆ ఇళ్లను పూర్తి చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చింది. దీనికోసం కేంద్రం నుంచి నిధుల కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. 69వేల మంది లబ్ధిదారుల జాబితాను కేంద్రానికి అందించగా.. మలి విడతగా రూ.500 కోట్లు ఇటీవల విడుదల అయ్యాయి. దీంతో ఇప్పటివరకు రూ.1,600 కోట్లు అందగా, మరో రూ.400 కోట్లు మాత్రమే రావాల్సి ఉంది. కానీ డబుల్ ఇళ్లన్నీ పూర్తి చేయాలంటే రూ.4 వేల కోట్లు కావాలని లెక్కలు వేశారు. ఈ నిధుల సర్దుబాటు ఎలాగన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్నే హడ్కోవంటి సంస్థల నుంచి రుణం పొంది ప్రారంభించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రూ.3 వేల కోట్ల రుణం మంజూరైంది. దీనికితోడు బడ్జెట్‌లో రూ.ఏడున్నరవేల కోట్లు ఇళ్లకు కేటాయించారు. ఇవన్నీ కూడా ఇందిరమ్మ పథకానికే సరిపోవని.. డబుల్ ఇళ్ల పూర్తి ఎలాగన్నది తేలడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పది సవరణలపై సిఫార్సు

అఖిలపక్షంతో ధరణి అధ్యయన కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: 'కౌలుదారుల గుర్తింపునకు 1971 పాస్‌బుక్ యాక్ట్‌లోని సెక్షన్ 26ను పునరుద్ధరించాలి. 2014 జూన్ రెండు వరకు పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకుపైగా ఉన్న సాదాబైనామా దరఖాస్తులను పూర్తి చేయాలి. ఏదైనా సమస్యపై అప్పీలు కోసం జిల్లా కేంద్రంలో ట్రిబ్యునల్/నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలి. 1948 జాగీరు భూముల రద్దు చట్టం తర్వాత రైతులకు అసైన్డ్ చేసిన భూములకు పాసుపుస్తకాలు జారీ చేయాలి' అని ప్రభుత్వానికి అఖిలపక్షం సూచించింది. గురువారం ఫతేమైదాన్ క్లబ్‌లో ధరణి అధ్యయన కమిటీ కన్వీనర్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో కొత్త రెవెన్యూ చట్టంపై అఖిల పక్ష సమావేశం జరిగింది. కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్‌రెడ్డి, సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి, పశ్యపద్మ, పర్యావరణవేత్త దొంతి నర్సింహారెడ్డి, మన్నె నర్సింహారెడ్డి, ధరణి సమస్యలపై పోరాటం చేస్తున్న నేతలు హాజరయ్యారు. కొత్త రెవెన్యూ చట్టం తీసుకురానున్న నేపథ్యంలో వివిధ పార్టీల నేతలు, మేధావుల నుంచి, రెవెన్యూ నిపుణుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ అఖిలపక్ష భేటీలో మొత్తం పది సవరణలు ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్టు తెలిసింది. పట్టాదార్ పాస్‌పుస్తకాల చట్టం 2020ని మార్పు చేసి, దాని స్థానంలో 2024ను తయారు చేయడాన్ని అఖిలపక్షం ఆహ్వానించింది. వారసత్వ, మ్యుటేషన్ చార్జీల నిబంధనను తొలగించడం ఆహ్వానించదగిన పరిణామంగా పేర్కొంది.

త్వరలోనే కొత్త ఆర్‌ఓఆర్ చట్టం: కోదండరెడ్డి



రాష్ట్రంలోని భూముల విధానాన్ని సమీక్షించి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, అధికార ప్రతినిధి భవానీరెడ్డితో కలసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల నిర్ణయం తీసుకునే ముందుకు వెళ్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో భూముల విషయంలో చాలా తప్పులు జరిగాయని, ఆ పార్టీ నేతలు చేసిన తప్పులను సరిదిద్దుతామని చెప్పారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఏ భూస్వామి పద్ధతి తొలగించాలని అనుకున్నారో ఆ పద్ధతినే మళ్లీ తీసుకురావాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని విమర్శించారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత రాష్ట్రాభివృద్ధికే పనిచేయాలి
- వీలైనంత త్వరగా వరంగల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపడతాం
- బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఫీజబుల్ కాదని మూడు కమిటీలు చెప్పాయి
- సీఐఐ సదస్సులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కేంద్రంతో ఘర్షణ వాతావరణం లేకుండా పనిచేస్తాం: కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలే తప్ప, ఎన్నికల తర్వాత అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధికే పనిచేయాలని ఆయన సూచించారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎంపీలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిపై చర్చ జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, రఘువీర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, వరంగల్‌లో టూరిజం, ఐటీ, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల అభివృద్ధిపై ఫోకస్ చేస్తున్నామని, వీలైనంత త్వరగా వరంగల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపడతామని తెలిపారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ వయబుల్ కాదని 3 కమిటీలు సిఫారసు చేశాయని.. ఫీజబుల్ కాదని చెప్పిన తర్వాత ప్రజల డబ్బు వృథా చేయకూడదని వ్యాఖ్యానించారు. నష్టం వస్తుందని తెలిసి ఎవరూ పరిశ్రమ పెట్టరని.. బయ్యారం ఫీజబుల్ అయితే తానే కేంద్రం నుంచి స్వయంగా నిధులు తీసుకొచ్చేవాడినని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి నడుస్తాం: మల్లు రవి

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, రాష్ట్ర అభి వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడుస్తామనీ, కేంద్రంతో ఘర్షణ వాతావరణం లేకుండా పనిచేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మహబూబ్ నగర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని కోరారు. తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులపై ఒక బుక్ తయారు చేయించామని, అది బీజేపీ ఎంపీలకు ఇస్తామని మల్లురవి చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, పెద్దపల్లిలో సీఐఐ కార్యాలయం ప్రారంభిస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, భద్రాచలం సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.50 కోట్లు సరిపోవని, ఈ మొత్తాన్ని ఇంకా పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఫీజులు 25% పెంచాల్సిందే

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ ఫీజుల పెంపు దిశగా కసరత్తు మొదలైంది. రెండేళ్ల జమా ఖర్చుల లెక్కలు సమర్పించాలని తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) ప్రైవేటు కాలేజీలను ఆదేశించింది. ఈ నెల 21 నుంచి అక్టోబర్ వరకు వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించింది. వాటి ఆధారంగా ఫీజుల పెంపును ఎఫ్ఆర్‌సీ నిర్ణయించనుంది. ఇవి వచ్చే ఏడాది (2025-26) నుంచి అమల్లోకి వస్తాయి. ఈసారి కనీసం 25 శాతం మేర ఫీజులు పెంచాలని ప్రైవేటు కాలేజీలు డిమాండ్ చేస్తున్నాయి. రెండేళ్లుగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, అనుబంధ కోర్సుల్లో సీట్లు పెరగడం వల్ల అత్యధిక వేతనాలతో ఫ్యాకల్టీని నియమించుకున్నామని చెబుతున్నాయి. అలాగే బ్రాంచీలు మారడంతో కొత్తగా లేబొరేటరీలు, లైబ్రరీల ఏర్పాటుకు ఎక్కువ వ్యయం చేశామని వివరిస్తున్నాయి. ఇందుకు అనుగుణంగానే లెక్కలు రూపొందిస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంలో ఇప్పటికే ఫీజులు పెరిగాయని, ఇక పెంచొద్దని వివిధ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఫీజుల పెంపునకు ఎఫ్ఆర్‌సీ దేన్ని ప్రాతిపదికగా తీసుకుంటుందనే విషయమై స్పష్టత లేదు. మౌలికవసతుల కల్పనకు పెట్టే ఖర్చును అంగీకరించబోమని ఎఫ్ఆర్‌సీ వర్గాలు అంటున్నాయి. కొత్త కోర్సుల ఏర్పాటు నేపథ్యంలో అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలనేది ప్రైవేటు కాలేజీల వాదన. దీన్ని పరిగణలోకి తీసుకుంటే ఇంజనీరింగ్ ఫీజులు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఫీజుల పెంపుపై డిసెంబర్ నాటికి స్పష్టత ఇవ్వాలని ఎఫ్ఆర్‌సీ భావిస్తోంది.



గురువారం హైకోర్టు ప్రాంగణంలోని బాలల సంరక్షణ సెంటర్‌లో పిల్లలు తయారు చేసిన చేనేత వస్తువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్. చిత్రంలో జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ సురేందర్, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ శరత్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి తదితరులు

జూన్ 30 వరకు 6,129 కేసులు నమోదు

షీటీమ్స్ సమీక్షలో శిఖాగోయల్ వెల్లడి




సాక్షి, హైదరాబాద్: మహిళా భద్రతకు షీటీమ్స్ భరోసాగా నిలుస్తున్నాయని మహిళా భద్రత విభాగం ఇన్‌చార్జి శిఖాగోయల్ అన్నారు. ఈ ఏడాదిలో జూన్ 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,129 కేసులు నమోదైనట్టు వెల్లడించారు. ఈ మేరకు గురువారం మహిళా భద్రత విభాగం, షీటీమ్స్ అధికారులతో శిఖాగోయల్ సమీక్ష నిర్వహించారు. కేసుల నమోదు, షీటీమ్స్ బృందాల పనితీరు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మొత్తం నమోదైన 6,129 కేసుల్లో 449 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతోపాటు మరో 2,314 పెట్టీ కేసులు బుక్ చేసినట్టు తెలిపారు. 1085 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించినట్టు తెలిపారు.

భూదాన్ యజ్ఞ బోర్డు.. రద్దు సబబే

- వందల ఎకరాలు అన్యాక్రాంతంలో బోర్డు పాత్ర
- అప్పీల్‌దారుల నియామకానికి రాసిన లేఖ నకిలీదే
- చైర్మన్, సభ్యుల అప్పీళ్లను కొట్టేస్తూ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు

సాక్షి, హైదరాబాద్: 'భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టబద్ధమే. 2015లో జారీ చేసిన జీవో 59 సమర్థనీయమే. చట్ట నిబంధనలను పరిగణనలోకి తీసుకున్నాకే తగిన కారణాలను చూపుతూ సింగిల్ జడ్జి పిటిషన్లను డిస్మిస్ చేశారు. ఆ ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి చట్టపరమైన కారణాలేవీ కనిపించట్లేదు. బోర్డు రద్దును ప్రశ్నించే చట్టపరమైన హక్కు అప్పీలెంట్ల (చైర్మన్, సభ్యుడు)కు లేదు. అప్పీలెంట్లు చట్టవిరుద్ధంగా భూములను ఇతరులకు అన్యాక్రాంతం చేశారు. దీనిపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. అన్ని అంశాలను పరిశీలించి అప్పీళ్లను కొట్టివేస్తున్నాం' అని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పులో పేర్కొంది. రాష్ట్ర విభజన తర్వాత భూదాన్ ట్రస్ట్ బోర్డును ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై చైర్మన్, ఇతరులు కోర్టును ఆశ్రయించి ఊరట పొందారు. ఆ తర్వాత ప్రభుత్వం మరోసారి బోర్డును రద్దు చేసింది. దీనిపై చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సభ్యులు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషన్లను కొట్టేస్తూ ఆదేశాలిచ్చారు. 2017 జనవరి 6న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాజేందర్‌రెడ్డి, సభ్యుడు సుబ్రహ్మణ్యం ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు ముగియడంతో తీర్పు వెలువరించింది.



ఏం జరిగిందంటే..

ఏపీ భూదాన్ అండ్ గ్రామదాన్ చట్టం-1965 ప్రకారం 2012లో ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా జి.రాజేందర్‌రెడ్డి, సభ్యుడిగా సుబ్రమణ్యంతోపాటు మరికొందరిని నాలుగేళ్ల కాలపరిమితితో ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో బోర్డు కార్యకలాపాలు చూసేందుకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శిని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో 11ను జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాజేందర్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేసి ఊరట పొందారు. అనంతరం బోర్డును ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ రాజేందర్‌రెడ్డి తదితరులకు ప్రభుత్వం 2015లో నోటీసులిచ్చింది. సమాధానం సరిగ్గా లేదంటూ బోర్డును రద్దు చేస్తూ జీవో 59 జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ రాజేందర్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో మళ్లీ పిటిషన్లు వేశారు. భూముల కేటాయింపులో అక్రమాలు జరిగాయన్న జడ్జి.. వారి పిటిషన్లను కొట్టేశారు. దీన్ని సవాల్ చేస్తూ రాజేందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం అప్పీళ్లు దాఖలు చేశారు.

తీర్పు కాపీలో కోర్టు ప్రస్తావించిన అంశాలు

ఢిల్లీలోని మహిళా చేతన కేంద్రం అధ్యక్షురాలు డాక్టర్ వీణా బెహన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసినట్లు చెబుతున్న నకిలీ లేఖ ఆధారంగా బోర్డు ఏర్పాటైంది. విచారణలో ఆ లేఖ నకిలీదని తేలింది. పదవీకాలంలో బోర్డు చైర్మన్, సభ్యులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. అనర్హులకు భూములను కేటాయించడంతో విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. బోర్డును రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కొత్త బోర్డు నియామకమయ్యే వరకు ఆ బాధ్యతలను ప్రభుత్వం అధికారికి అప్పగించవచ్చు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఓ చోట 100 ఎకరాలు, మరో చోట 50 ఎకరాలు, రైతు డెయిరీకి 35 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలోని గోపాల్ గోశాల ట్రస్టుకు 15 ఎకరాలు చట్టవిరుద్ధంగా లీజు, అక్రమంగా కేటాయించారు. ఇష్టం వచ్చిన వారికి హయత్‌నగర్ మండలం బాటసింగారం సర్వే నంబర్ 319లోని 16.32 ఎకరాలను ఇళ్ల స్థలాలకు ఇచ్చేశారు. శంషాబాద్ మండలం పాలమాకుల సర్వే నంబర్ 1 నుంచి 7లోని 32.24 ఎకరాలను ఏడుగురికి అప్పగించారు. ఈ క్రమంలో చైర్మన్, సభ్యులపై పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. దీనిపై సీఐడీ విచారణ కొనసాగుతోంది. తమపై కేసులేవీ లేవని అప్పీలెంట్లు పేర్కొనలేదు.

జేపీసీకి వక్ఫ్ (సవరణ) బిల్లు

లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు	సమాజాన్ని విచ్ఛిన్నం చేసే క్రూరమైన బిల్లు వద్దంటూ నినాదాలు
వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్	వెనక్కి తగ్గిన ప్రభుత్వం.. బిల్లును జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయం


న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టం-1995లో పలు మార్పులు తీసుకురావడంతోపాటు చట్టం పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ, డెవలప్‌మెంట్ యాక్ట్-1995'గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్(సవరణ) బిల్లు-2024ను పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, అడ్డుకొనేందుకు ప్రయత్నించాయి. సమాజంలో ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించిన ఈ క్రూరమైన బిల్లు వద్దే వద్దంటూ నినదించాయి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఈ బిల్లును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. బీజేపీ సహా అధికార ఎన్డీయే కూటమి పక్షాలు బిల్లుకు మద్దతు ప్రకటించాయి. చివరకు ప్రతిపక్షాల నిరసనతో ప్రభుత్వం దిగొచ్చింది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు బిల్లును పంపిస్తున్నట్లు ప్రకటించింది.


కిరెణ్ రిజిజు

కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు వక్ఫ్(సవరణ) బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై చర్చ ప్రారంభించారు. బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ నోటీసు ఇచ్చారు. దేశంలో మత స్వేచ్ఛను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, సమాఖ్య వ్యవస్థపై దాడి చేస్తోందని మండిపడ్డారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతూ విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, అయినప్పటికీ హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధికోసమే బిల్లును తీసుకొచ్చిందని విమర్శించారు.

హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే..

ఇప్పుడు ముస్లింలపై దాడి చేస్తున్నారని, తర్వాత క్రైస్తవులపై, జైన్‌లపై దాడి చేస్తారని ధ్వజమెత్తారు. అనంతరం విపక్ష సభ్యులు బిల్లుపై దుమ్మెత్తిపోశారు. డీఎంకే ఎంపీ కనిమొళి, తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీ బషీర్ బిల్లును వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పారు. ఎన్డీయేలోని కొన్ని పార్టీ సభ్యులు మాత్రం బిల్లుకు మద్దతు ప్రకటించారు. సభలో వాడీవేడిగా జరిగిన చర్చ తర్వాత మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. బిల్లును జేపీసీ పరిశీలనకు పంపిస్తున్నట్లు తెలిపారు. జేపీసీ ఏర్పాటు కోసం త్వరలో అన్ని పార్టీల నేతలో చర్చిస్తామని వివరించారు. ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్-1923ని రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును సైతం రిజిజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.


వేణుగోపాల్

బీజేపీ రియల్ ఎస్టేట్ కంపెనీ



''కరడుగట్టిన బీజేపీ మద్దతు దారులను సంతోషపర్చడానికి బిల్లును తీసుకొచ్చారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమిస్తారా? ఇతర మత సంస్థల విషయంలో ఇలాగే చేయగలరా? ఎన్నికల్లో లబ్ధి కోసం బిల్లు రూపొందించారు. బీజేపీ రియల్ ఎస్టేట్ కంపెనీలా పనిచేస్తోంది. ఆ పార్టీ పేరును భారతీయ జమీన్ పార్టీగా మార్చుకోవాలి. వక్ఫ్ బోర్డుల భూములను కాజేయాలని చూస్తున్నారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వక్ఫ్ బోర్డు భూములు అమ్మబోమంటూ గ్యారంటీ ఇవ్వాలి. ముస్లింల హక్కులను దోచుకుంటామంటే చూస్తూ ఊరుకోం. కచ్చితంగా అడ్డుకుంటాం''

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ

మైనార్టీలను రక్షించుకోవడం బాధ్యత



''బిల్లును మేము వ్యతిరేకిస్తున్నాం. ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకోవడం తగదు. బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతోందో చూడండి. మైనార్టీలను రక్షించుకోవడం మన నైతిక బాధ్యత. బిల్లు వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం బయటపెట్టాలి. బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. అందరితో చర్చించి పారదర్శకమైన బిల్లు రూపొందించాలి''

- సుప్రియా సూలే, ఎన్సీపీ(శరద్ పవార్)

పారదర్శకత కోసమే మద్దతు



''బిల్లుకు మద్దతిస్తున్నాం. వక్ఫ్ బోర్డుల నిర్వహణలో పారదర్శకతకు ఈ బిల్లు దోహదపడుతుంది. ముస్లిం వ్యతిరేక చర్య అనడంలో అర్థం లేదు. ఎవరికీ వ్యతిరేకం కాదు'' -చిరాగ్ పాశ్వాన్, ఎల్జేపీ చీఫ్, కేంద్ర మంత్రి

ముస్లింలను శత్రువులుగా చూస్తున్నారు



''వక్ఫ్ చట్టంలో ఇష్టారాజ్యంగా సవరణలు చేయడాన్ని ఖండిస్తున్నాం. రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి చేయడం దుర్మార్గం. ముస్లింలను శత్రువులుగా భావిస్తున్నారు. అందుకు ఈ బిల్లే నిదర్శనం. దర్గా, మసీదు, వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నారా? ఈ బిల్లు ద్వారా దేశాన్ని ముక్కలు చేద్దామనుకుంటున్నారా? ఏకం చేద్దామనుకుంటున్నారా? బిల్లుకు వ్యతిరేకంగా ఇప్పటికే రూల్ 72 కింద నోటీసు ఇచ్చాం. ప్రభుత్వం తక్షణమే బిల్లును ఉపసంహరించుకోవాలి''

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం

వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించింది. సభలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని పార్టీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి తెలిపారు. 'ముస్లిం వర్గాల్లో అనేక ఆందోళనలు ఉన్నాయి. కాబట్టి ఈ బిల్లు మరింత ముందుకు తీసుకెళ్లే క్రమంలో ముస్లిం సమాజాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుకుంటున్నాం. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ లేవనెత్తిన ఆందోళనలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాం. వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది'అని ఎంపీ మిథున్ రెడ్డి పేర్కొన్నారు.

టీడీపీ మద్దతు



లోక్‌సభలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు-2024కు టీడీపీ మద్దతు ప్రకటించింది. బిల్లును స్వాగతిస్తున్నామని టీడీపీ ఎంపీ హరీశ్ చెప్పారు. అన్ని మతాల వారు తమ మత కార్యక్రమాలకు భూములు, ఆస్తులను విరాళంగా ఇస్తుంటారని తెలిపారు. దాతల ప్రయోజనాలు కాపాడేలా సంస్కరణలు తీసుకొచ్చి ఆ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.

ముస్లింలకు వ్యతిరేకం కాదు



ఈ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదు. మతపరమైన విభజనలను ప్రోత్సహించడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. పారదర్శకత కోసమే బిల్లు రూపొందించారు. ప్రతిపక్షాలు ఈ బిల్లును ఆలయాలతో పోలుస్తున్నాయి. అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ పాలనలో వేలాది మంది సిక్కులను ఊచకోత కోశారు. ఇందిరా గాంధీ హత్యకు ఏ ట్యాక్సీ డ్రైవర్ కారణం? దీనిపై కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ సమాధానం చెప్పాలి - రాజీవ్ రంజన్ సింగ్, జేడీ(యూ) సభ్యుడు, కేంద్ర మంత్రి

రాజ్యసభలో వక్ఫ్ ఆస్తుల బిల్లు ఉపసంహరణ

వక్ఫ్ ఆస్తుల(ఆక్రమణదార్ల తొలగింపు) బిల్లు-2014ను ప్రభుత్వం గురువారం రాజ్యసభ నుంచి ఉపసంహరించుకుంది. బిల్లు ఉపసంహరణకు మూజువాణి ఓటుతో సభ్యులు ఆమోదం తెలిపారు. వక్ఫ్ ఆస్తుల్లో ఎవరైనా అనధికారికంగా తిష్టవేస్తే వారిని అక్కడి నుంచి తొలగించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా 2014 ఫిబ్రవరి 18న అప్పటి కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కె.రెహ్మాన్ ఖాన్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 2014 మార్చి 5న బిల్లును పార్లమెంట్ స్థాయీ సంఘం పరిశీలనకు పంపించారు. అప్పటినుంచి బిల్లు పెండింగ్‌లో ఉంది



మద్దతు ధర టీడీపీ, జేడీ(యూ)కేనా?

- పంటలకు కనీస మద్దతు ధర కల్పించాల్సిందే
- పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర కల్పించి, రైతన్నలకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు గురువారం పార్లమెంట్ ఆవరణలో ప్రదర్శన చేపట్టారు. తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్) తదితర పార్టీల సభ్యులు పార్లమెంట్ మకర ద్వారం మెట్లపై గుమికూడారు. ఉల్లిపాయలు, కూరగాయల దండలను మెడపై ధరించి కేంద్ర ప్రభుత్వ తీరు పట్ల నిరసన వ్యక్తం చేశారు. 'పంటలకు కనీస మద్దతు ధర కల్పించండి', 'రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోండి' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. శివసేన(ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ... ''తెలుగుదేశం పార్టీ, జేడీ(యూ)లకు బీజేపీ ప్రభుత్వం కనీస మద్దతు ధర(స్పెషల్ ప్యాకేజీ) అందించింది. అదే తరహాలో రైతులకు కూడా కనీస మద్దతు ధర అందించాలి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ సమానమేనని గుర్తించుకోవాలి. రైతులు దేశంలో ప్రధాన వాటాదార్లు. అందుకే వారికి మద్దతు ప్రకటిస్తున్నాం'' అని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి విదేశాలకు ఉల్లిపాయల ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేయాలని కేంద్రానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగేలా చూడడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

జపాన్‌ను కుదిపేసిన తీవ్ర భూకంపం

టోక్యో: జపాన్ దక్షిణ తీర ప్రాంతంలో గురువారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. క్యుషు దీవిలో ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదైంది. భూమికి సుమారు 30 కిలోమీటర్ల అడుగున భూకంప కేంద్రం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నిచినన్ నగరంతోపాటు మియజాకి ప్రిఫెక్చర్ తీవ్ర ప్రభావానికి గురైంది. భూకంప కేంద్రానికి సమీపంలోని మియజాకి విమానాశ్రయంలో భవనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. ముందు జాగ్రత్తగా అధికారులు రన్‌వేను మూసివేశారు. పొరుగునే ఉన్న కగోషియా ప్రిఫెక్చర్‌లోని ఒసాకిలో కాంక్రీట్ గోడలు ధ్వంసమయ్యాయి. క్యుషు, షికోకు దీవుల తీరం వెంబడి అలలు సుమారు 1.6 అడుగుల ఎత్తున సుమారు అరగంటసేపు ఎగిసిపడ్డాయి. దీంతో, అధికారులు ముందు జాగ్రత్తగా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీరప్రాంతాల వైపు వెళ్లరాదని ప్రజలకు సూచనలిచ్చారు. భూకంపం తాకిడితో ముగ్గురు గాయపడినట్లు అధికారులు తెలిపారు.

అక్టోబర్‌లో కశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా

కేంద్ర మంత్రి అథవాలె వెల్లడి



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు అక్టోబర్‌లో రాష్ట్ర హోదా పునరుద్ధరణతోపాటు అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలె చెప్పారు. శ్రీనగర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీలకు అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. అప్పుడే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ ప్రకటన వెలువడే అవకాశాలు కూడా ఉన్నాయి'అని మంత్రి అథవాలె వివరించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామంటూ గతంలో ఆర్టికల్ 370 రద్దు సమయంలోనే హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు జరపండి

ఈసీకి కశ్మీర్ రాజకీయ పార్టీల డిమాండ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఆ కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన రాజకీయ పార్టీలు ప్రధానంగా డిమాండ్ చేశాయి. గురువారం శ్రీనగర్‌లో ఎన్నికల కమిషన్ ఇక్కడి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలోని బృందం షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ), పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పీడీపీ), బీజేపీ, కాంగ్రెస్, జమ్మూకశ్మీర్ పాంథర్స్ పార్టీ(జేకేపీపీ) తదితర పార్టీల ప్రతినిధులతో సమావేశమైంది. సీఈసీతోపాటు కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, ఎస్ఎస్ సంధుల బృందం ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఈసీ అధికారులు మీడియాతో మాట్లాడారు. కేంద్ర పాలితప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు జరపాలన్న డిమాండ్‌ను ప్రధానంగా అన్ని రాజకీయ పార్టీలు వినిపించాయని వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు నిష్పాక్షికంగా, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించాలని కూడా పార్టీల ప్రతినిధులు కోరారన్నారు. అనంతరం ఈసీ బృందం ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లతోపాటు చీఫ్ సెక్రటరీ, పోలీస్ డైరెక్టర్ జనరల్‌తో సమీక్ష సమావేశం జరిపింది. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై వారితో చర్చించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30వ తేదీలోగా కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు.


ప్రమాణం చేస్తున్న యూనస్

బంగ్లా సారథిగా యూనుస్

- ప్రమాణం చేయించిన అధ్యక్షుడు
- 16 మందితో సలహామండలి

ఢాకా: నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనుస్(84)ను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా నియమితులయ్యారు. ఈ హోదా ప్రధానమంత్రితో సమానమైనది. గురువారం అధ్యక్ష భవనం 'బంగభవన్'లో అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ ఆయనతో ప్రమాణం చేయించారు. యూనుస్‌కు 16 మందితో కూడిన సలహాదారుల మండలి పాలనలో సహకరించనుంది. ఈ మండలికి ఎంపికైన వారిలో రిజర్వేషన్ కోటా ఉద్యమానికి నాయకత్వం వహించిన నాహిద్ ఇస్లాం, ఆసిఫ్ మహ్మూద్‌తోపాటు మహిళా హక్కుల కార్యకర్త ఫరీదా అఖ్తర్ తదితరులున్నారు. వీరితో కూడా అధ్యక్షుడు ప్రమాణం చేయించారు. పౌరులకు భద్రత కల్పించడానికి తన ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందుకు తనకు సాయపడాలని యూనుస్ ఈ సందర్భంగా అన్ని వర్గాల వారిని కోరారు.

రాజ్యసభలో తీవ్ర రగడ

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌పై అనర్హత వేటు అంశం పట్ల రాజ్యసభలో అలజడి రేగింది. ప్రతిపక్ష సభ్యులు, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. వినేశ్ ఫోగాట్ అంశంపై సభలో చర్చించేందుకు చైర్మన్ అనుమతి ఇవ్వకపోవడంపై విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ సభ నుంచి వెళ్లిపోయారు. ఎగువ సభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. వినేశ్ ఫోగాట్‌పై అనర్హత అంశంపై తక్షణమే చర్చించాలని పట్టుబట్టారు. అందుకు ధన్‌ఖడ్ అంగీకరించకపోవడంతో తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ ఆయనతో వాగ్వాదానికి దిగారు. డెరెక్ ఓబ్రెయిన్‌తోపాటు విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండడంతో సభలో గందరగోళం నెలకొంది. ఫోగాట్‌పై చర్చించేందుకు ధన్‌ఖడ్ అనుమతి ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. విపక్ష ఎంపీల తీరు పట్ల ధన్‌ఖడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ఉండలేనని చెప్పారు. భారమైన హృదయంతో సభ నుంచి నిష్క్రమిస్తున్నానని తెలిపారు.

వివాదాస్పద భూములపై...
నిర్ణయాధికారం కలెక్టర్లకే

- వక్ఫ్ ట్రిబ్యునల్ నుంచి ఈ అధికారం తొలగింపు
- కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో, రాష్ట్రాల బోర్డుల్లో ఇద్దరేసి మహిళలు
- ముస్లిమేతరులకూ చోటు
- వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే బోర్డుల అధికారం రద్దు

కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ (సవరణ) బిల్లు తేనెతుట్టెను కదిపింది. విపక్షాలు, ముస్లిం సంస్థలు దీనిపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సెంట్రల్ పోర్టల్ ద్వారా క్రమబద్ధీకరించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. వక్ఫ్ భూముల యాజమాన్య హక్కులపై వివాదం తలెత్తితే ఇప్పటిదాకా వక్ఫ్ ట్రిబ్యునల్‌కు నిర్ణయాధికారం ఉండేది. కొత్త బిల్లు ఈ అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెడుతోంది. వక్ఫ్ చట్టం-1995ను ఇకపై యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్‌గా మారుస్తోంది. మొత్తం 44 సవరణలను ప్రతిపాదిస్తోంది.

వక్ఫ్ అంటే ఏమిటి?

ఇస్లామిక్ చట్టం కింద మతపరమైన, ధార్మిక కార్యక్రమాల నిమిత్తం అంకితం చేసిన ఆస్తిని వక్ఫ్‌గా పేర్కొంటారు. ఒకసారి వక్ఫ్ ఆస్తిగా ప్రకటిస్తే.. ఇక అది అంతిమం. దాన్ని తిరగదోడటానికి ఉండదు. ఈ అంశంపై దృష్టి సారించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.

9 లక్షల ఎకరాలు

దేశంలోని 30 వక్ఫ్ బోర్డులు 9 లక్షల పైచిలుకు ఎకరాలను నియంత్రిస్తున్నాయి. వీటి విలువ రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. భారత్‌లో పెద్ద మొత్తంలో భూములు కలిగి ఉన్న వాటిల్లో రైల్వేలు, రక్షణ శాఖ తర్వాత వక్ఫ్ బోర్డులు మూడోస్థానంలో ఉన్నాయి.

బిల్లులోని కీలకాంశాలు

- ఏదైనా ఒక ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అధికారాన్ని వక్ఫ్ బోర్డులకు కట్టబెట్టింది వక్ఫ్ చట్టం- 1995. అందులోని సెక్షన్- 40 ఇందుకు వీలు కల్పించింది. కొత్త బిల్లులో ఈ సెక్షన్- 40 రద్దుకు ప్రతిపాదించారు. ఇలా చేయడం ద్వారా వక్ఫ్ బోర్డుల చేతుల్లో నుంచి కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని లాగేసుకుంటోందని తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దుమారం రేగుతోంది.
- కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ ఏర్పాటు. కౌన్సిల్‌లో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరేసి ముస్లిం మహిళలకు చోటు. ముస్లిమేతరులకూ స్థానం. ఇద్దరు లోక్‌సభ, ఒక రాజ్యసభ ఎంపీకి కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో చోటు కల్పించాలి. ఈ ముగ్గురు ఎంపీలు ముస్లింలే అయ్యుండాలనే నిబంధనేమీ లేదు. పాత చట్టం ప్రకారం తప్పనిసరిగా ముస్లిం ఎంపీలకే కౌన్సిల్‌లో చోటు ఉండేది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పును మార్చే అధికారాన్ని కూడా బిల్లు కేంద్రానికి కట్టబెడుతోంది.
- ఒక ఆస్తి వక్ఫ్‌కు చెందినదా, ప్రభుత్వానిదా అనే వివాదం తలెత్తితే ఇక కలెక్టర్లదే నిర్ణయాధికారం. వక్ఫ్ చట్టం-1995 సెక్షన్- 6 ప్రకారం ఇలాంటి వివాదాల్లో వక్ఫ్ ట్రిబ్యునళ్లు తీర్పు చెప్పేవి. వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటున్న దేన్నైనా కలెక్టర్ ప్రభుత్వ భూమిగా తేల్చితే ఆ మేరకు రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పించొచ్చు. అక్రమంగా ఆస్తులు దక్కించుకోవడానికి స్వార్థపరులు ట్రిబ్యునళ్లను అడ్డం పెట్టుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఏదైనా ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా నమోదు చేసే ముందు సంబంధిత పక్షాలన్నిటికీ నోటీసులు ఇవ్వడం. రెవెన్యూ చట్టాల ప్రకారం నిర్దిష్ట ప్రక్రియను అనుసరించి మ్యూటేషన్ చేయడానికి మార్గదర్శకాలను రూపొందించడం.
- కాగ్ నియమించిన ఆడిటర్ ద్వారా ఏదేని వక్ఫ్ బోర్డు ఆస్తుల తనిఖీకి ఆదేశించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఈ బిల్లు దఖలు పరుస్తుంది.
- బోరాలు, అగాఖానీల కోసం ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డును ఏర్పాటు చేస్తారు. వక్ఫ్ బోర్డుల్లో షియాలు, సున్నీలు, బోరాలు, ఆగాఖానీలు, ముస్లింలోని ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూస్తుంది.
- తన ఆస్తిని దానంగా ఇవ్వడానికి ఒక వ్యక్తి సిద్ధపడినపుడు.. అతను రాసిన చెల్లుబాటయ్యే అంగీకారపత్రాన్ని (వక్ఫ్‌నామా)ను కొత్త బిల్లు తప్పనిసరి చేస్తోంది. ప్రస్తుతం ఒక వ్యక్తి మౌఖికంగా కూడా తన ఆస్తిని వక్ఫ్‌కు ఇవ్వొచ్చు.
- ఐదేళ్లుగా ఇస్లాంను ఆచరిస్తూ.. ఆస్తిపై యాజమాన్య హక్కులున్నపుడే వక్ఫ్ ఇవ్వొచ్చు.
- వక్ఫ్ బోర్డులకు వచ్చే డబ్బును వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథల సంక్షేమం కోసం వినియోగించాలి. అదీ ప్రభుత్వం సూచించిన పద్ధతుల్లో.

- నేషనల్ డెస్క్, సాక్షి

రేపు వయనాడ్‌కు ప్రధాని మోదీ



తిరువనంతపురం: కేరళలోని వయనాడ్‌లో ఈనెల 10న ప్రధాని మోదీ పర్యటించనున్నారని సీఎం పినరయి విజయన్ చెప్పారు. జిల్లాలో ఇటీవల భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి వందలాదిమంది చనిపోవడం తెల్సిందే. బాధిత ప్రాంతాల్లో ప్రధాని పర్యటిస్తారని విజయన్ వివరించారు. ఈ దుర్ఘటనలో బాధితులకు పునరావాసం కల్పించే విషయంలో ప్రధాని మోదీ సానుకూలంగా ఉన్నారని సీఎం విజయన్ చెప్పారు. తమ వినతి మేరకు 9 మంది నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ అంగీకరించిందన్నారు. ఈ కమిటీ విపత్తు తీవ్రతను అంచనా వేసి, నివేదిక ఇస్తుందన్నారు. ఈ దుర్ఘటనలో 131 మంది వరకు గల్లంతైనట్లు గుర్తించామన్నారు. వీరి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు. కాగా, కొండచరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలంటూ డిమాండ్లు వినిపిస్తున్న వేళ ప్రధాని మోదీ వయనాడ్‌లో పర్యటనకు రానుండటం గమనార్హం.

టేలర్ స్విఫ్ట్ కచేరీపై ఉగ్రదాడికి కుట్ర

భగ్నం చేసిన ఆస్ట్రియా అధికారులు



వియన్నా: ఆస్ట్రియా భద్రతాధికారులు సకాలంలో స్పందించి పెనుముప్పు నివారించగలిగారు. అమెరికా గాయని టేలర్ స్విఫ్ట్ గురువారం రాజధాని వియన్నాలో తలపెట్టిన కచేరీలో నరమేధానికి ఉగ్రవాదులు పన్నిన కుట్రను భగ్నం చేశారు. 19 ఏళ్ల ప్రధాన సూత్రధారి సహా 17 ఏళ్ల మరో యువకుడిని అరెస్ట్ చేశారు. 15 ఏళ్ల మరో అనుమానితుడిని ప్రశ్నిస్తున్నారు. ఎర్నెస్ట్ హాపెల్ స్టేడియానికి వచ్చే వారిని పేలుడు పదార్థాలు వాడి లేదా కత్తులతో పొడిచి సాధ్యమైనంత ఎక్కువమందిని చంపాలని పథకం వేసినట్లు తేలింది. వీరికి ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించారు. ఈ పరిణామం నేపథ్యంలో టేలర్ పాల్గొనాల్సిన మొత్తం మూడు కచేరీలను రద్దు చేశారు.

బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత

- శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ తుదిశ్వాస
- నేడు అంతిమయాత్ర... మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత
- డీవైఎఫ్‌ఐ కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదిగిన బుద్ధదేవ్

కోల్‌కతా: సీపీఎం సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూశారు. 80 ఏళ్ల బుద్ధదేవ్ గురువారం ఉదయం 8.20 గంటలకు మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. శ్వాసకోస వ్యాధితో దీర్ఘకాలంగా బాధపడుతున్న ఆయన కోల్‌కతాలోని పామ్ అవెన్యూలో ఉన్న తన ఫ్లాట్‌లో తుదిశ్వాస విడిచారు. గతేడాదే ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత కోలుకున్నారు. మళ్లీ ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. ఆయనకు భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. ప్రజల సందర్శనార్థం భట్టాచార్య భౌతికకాయాన్ని శుక్రవారం తొలుత బెంగాల్ అసెంబ్లీ, తర్వాత సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి, డీవైఎఫ్ఐ కార్యాలయానికి తరలిస్తారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించి, మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తారు.

కార్యకర్త నుంచి ముఖ్యమంత్రిగా..

సీపీఎం అత్యున్నత నిర్ణాయక విభాగమైన పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు అయిన భట్టాచార్య 1944 మార్చి 1న కోల్‌కతాలో జన్మించారు. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కళాశాల నుండి బెంగాలీలో బీఏ ఆనర్స్ చేశారు. 1966లో పార్టీలో చేరారు. సీపీఎం యువజన విభాగమైన డీవైఎఫ్‌ఐలో చేరారు. రాజకీయాల్లోకి రాకముందు పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సేవలందించిన ఆయన 2000లో జ్యోతిబసు సీఎం పదవి నుంచి వైదొలగక ముందు ఉపముఖ్యమంత్రిగా పదోన్నతి పొందారు. జ్యోతిబసు తరువాత సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2000 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. జ్యోతిబసు పాలనతో పోలిస్తే భట్టాచార్య హయాంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం పారిశ్రామిక వర్గాల పట్ల సానుకూలంగా వ్యవహరించింది. విచిత్రమేమిటంటే పారిశ్రామికీకరణకు సంబంధించిన సీపీఎం విధానాలే 2011 ఎన్నికల్లో వామపక్షాల పరాజయానికి బాటలు వేశాయి.

'పద్మభూషణ్' తిరస్కరణ

కేంద్రం 2021లో బుద్ధదేవ్‌కు పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. ఆ అవార్డును ఆయన తిరస్కరించారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

బుద్ధదేవ్ మరణం పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. బెంగాల్ అభివృద్ధికి కృషి చేశారని, ప్రజలకు విశిష్టమైన సేవలు అందించారని బుద్ధదేవ్‌ను మోదీ కొనియాడారు. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులు సంతాపం తెలిపారు.





సాక్షి హైదరాబాద్


శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



'ఎలా'రెస్..?

ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. సిబ్బంది కొరతకు సాంకేతిక సమస్యలు తోడవుతున్నాయి.

-8లో



బైక్ బుకింగే ఆమెకు శాపమైంది!

బైక్ ట్యాక్సీ బుకింగ్‌లో చేసిన చిన్న పొరపాటు ఓ యువతికి శాపమైంది. ఐదేళ్లుగా మానసిక వేధింపులకు కారణమైంది.

-8లో

గరిష్టం/కనిష్టం
28.0/23.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం పడవచ్చు. గరిష్టంగా 28, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



నృత్యోత్సవం..

నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

కోటలో పంద్రాగస్టు రిహార్సల్స్



గోల్కొండ: పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట సిద్ధమవుతోంది. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగరవేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం పోలీసులు బ్యాండ్ రిహార్సల్స్‌తో పాటు పరేడ్ ప్రాక్టీస్ చేశారు. గోల్కొండ కోట మెయిన్ గేటు ఆనుకుని ఉన్న గ్రీన్ గ్రౌండ్‌లో రిహార్సల్స్ కొనసాగుతున్నాయి.

కొత్తకోట @ 6

డీజీపీగా పదోన్నతి పొందిన శ్రీనివాసరెడ్డి

కొత్వాల్‌గా కొనసాగిస్తూ సర్కారు ఉత్తర్వులు



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో మరోసారి అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) హోదాలో ఉన్న అధికారి కొత్వాల్ పోస్టులో నగర పోలీసు విభాగానికి నేతృత్వం వహించనున్నారు. పద్దెనిమిదేళ్లకు పూర్వం పేర్వారం రాములు, పదేళ్లకు ముందు అనురాగ్ శర్మ, ఏడేళ్ల క్రితం ఎం.మహేందర్‌రెడ్డి, 2021, 2023ల్లో అంజనీకుమార్, ఆనంద్ ఇలానే వ్యవహరించారు. ఇప్పుడు కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డికి గురువారం డీజీపీగా పదోన్నతి రావడంతో పాటు నగర కొత్వాల్‌గానే కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇలా పని చేసిన వారిలో ఈయన ఆరో అధికారిగా రికార్డులకు ఎక్కారు. నగర పోలీసు కమిషనరేట్‌కు అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) హోదాలో ఉన్న అధికారి కమిషనర్‌గా ఉంటారు. ఇప్పటి వరకు పని చేసిన అందరూ ఆ హోదా వాళ్లే. సాధారణంగా ఇక్కడ నుంచి బదిలీ అయిన తర్వాత డీజీగా పదోన్నతి రావడం లేదా పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లడం ఆనవాయితీ. అయితే ఆరుగురూ మాత్రం డీజీపీ హోదాలో ఉండి, కొత్వాల్‌గా పని చేశారు... చేస్తున్నారు. పేర్వారం రాములు, అనురాగ్ శర్మ, ఎం.మహేందర్‌రెడ్డి, సీవీ ఆనంద్ పదోన్నతి పొందినప్పుడు నగర పోలీసు కమిషనర్ పోస్టును అదనపు డీజీ నుంచి డీజీపీ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. అంజనీకుమార్‌కు డీజీ హోదాలో కేవలం ఐదు రోజులే కొత్వాల్‌గా పని చేయడంతో ఆ అవసరం రాలేదు. కొత్తకోట శ్రీనివాసరెడ్డికి సంబంధించి త్వరలోనే ఆ ఉత్తర్వులు వెలువడతాయి. సదరు అధికారులు బదిలీ తర్వాత మళ్లీ అదనపు డీజీ స్థాయికి తగ్గిస్తారు. తాజా పదోన్నతి నేపథ్యంలో కొత్తకోట శ్రీనివాసరెడ్డి సిటీ పోలీసు కమిషనర్‌గా మరోసారి బాధ్యతలు తీసుకోవడం అనివార్యం. కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. గత ఏడాది డిసెంబర్ 12న నగర కొత్వాల్‌గా నియమితులయ్యారు. ఆ మరుసటి రోజే బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి ఏపీలో తీరప్రాంత రక్షణ కోసం కోస్టల్ సెక్యూరిటీ సిస్టం ప్రవేశపెట్టిన ఘనత కూడా ఈయనకే దక్కుతుంది. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లోనూ ఆయన మార్క్ ఉంది. శ్రీనివాసరెడ్డికి 2010లో ఐపీఎం, 2019లో పీపీఎం, 2023లో అతి ఉత్కృష్ట సేవా పతకం లభించాయి.

సదా మీ సేవలో..

నాణ్యమైన పౌరసేవల కోసమే జీఐఎస్ సర్వే

భవనాలు, ప్రభుత్వ ఆస్తుల కచ్చితత్వం కోసమే..

- ఆస్తిపన్ను పెంపు కోసం కాదు..
- ఆధార్, పాన్ వివరాలను అడగం
- విద్యుత్, నల్లా బిల్లుల వివరాలు మీ ఇష్టం
- యూనిక్ ఐడీ నంబర్‌తో వివిధ సేవలు నేరుగా ఇంటికే
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో:

గ్రేటర్ ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు సేవలు మెరుగ్గా పొందేందుకు.. మెరుగైన పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణ కోసమే డిజిటల్ మ్యాపింగ్ కోసం సమగ్ర జీఐఎస్ సర్వే నిర్వహిస్తున్నామని, ఆస్తిపన్ను పెంపు వంటి ఆలోచనలతో ప్రజలు భయాందోళన చెందవద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి స్పష్టం చేశారు. ప్రజల భయాలు తమ దృష్టికి రావడంతో సర్వేలోని అంశాలను చాలావరకు తగ్గించి కొన్ని అంశాలకే పరిమితం చేశామని తెలిపారు. సర్వేలో భాగంగా ప్రైవేటు భవనాలు, ప్రభుత్వ ఆస్తులు, యుటిలిటీస్ జియో ఫెన్సింగ్ అవుతాయన్నారు. సర్వే సిబ్బంది ఆధార్, పాన్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలు అడగరని, విద్యుత్, నల్లా బిల్లుల వంటివి ఇవ్వాలా.. వద్దా? అనేది ప్రజల ఇష్టమేనన్నారు. ఆస్తిపన్ను పెంపు ప్రసక్తే లేదన్నారు. యూపీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో, లక్నో, ప్రయాగ్‌రాజ్ వంటి చిన్న పట్టణాల్లోనూ జీఐఎస్ సర్వే చేశారని తెలిపారు. హైదరాబాద్ వంటి గ్రేటర్ సిటీలో ఇంతవరకు ఇలాంటి సర్వే జరగలేదని, ఇక్కడ జరిగే సర్వేతో ఎన్నో స్టార్టప్‌లు వస్తాయన్నారు. ఈ సర్వేలో భాగంగా శాటిలైట్, డ్రోన్, ఇంటింటి క్షేత్ర స్థాయి వివరాల మ్యాపింగ్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయని పేర్కొన్నారు. చెరువులు, పార్కుల వంటి ప్రభుత్వ ఆస్తుల్ని కబ్జాల చెర నుంచి కాపాడవచ్చన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి ఆమ్రపాలి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రతి ఇంటికీ యూనిక్ ఐడీ నంబర్..

సర్వేతో ప్రతి ఇంటికీ యూనిక్ ఐడీ నంబర్ (డిజిటల్ అడ్రస్) జనరేట్ అవుతుందని ఆమ్రపాలి చెప్పారు. సదరు బోర్డులు ఇళ్ల వద్ద అమర్చుతామని, తద్వారా ప్రజలు వివిధ సేవల్ని ఇంటివద్దనుంచే పొందవచ్చన్నారు. ఆస్తి పన్ను రివిజన్లు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు తదితర డాక్యుమెంట్లు సరైన చిరునామాతో ఇంటికే చేరతాయన్నారు. వీధిదీపాల వంటి సమస్యలతో పాటు విపత్తుల సమయాల్లో అంబులెన్సులు, ఫైర్‌సర్వీసెస్ వంటివి త్వరితంగా అందుతాయని స్పష్టంచేశారు.

సర్వేలో భవనాల వివరాలు, పీటీఐఎన్ వివరాలు మాత్రమే సేకరిస్తారని, ఆ వివరాలు కేవలం సంబంధిత ప్రజలకు, జీహెచ్ఎంసీకి మాత్రమే తెలుస్తాయన్నారు. సర్వేలో పొందుపర్చే వివరాలను ప్రజలు సవరించుకోవచ్చన్నారు. ఓనర్‌షిప్ వంటి వివరాలు పట్టించుకోబోమన్నారు. అందరి సహకారంతో పాతబస్తీలోనూ సర్వేకు ప్రయత్నిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆమె చెప్పారు. బేగంపేట ఎయిర్‌పోర్టు, కంటోన్మెంట్ వంటి భద్రతాపరమైన ప్రాంతాల్లో భవనాలకు డ్రోన్ సర్వే చేయరని తెలిపారు. సర్వేలో వాటిని రెడ్‌జోన్‌గా గుర్తిస్తారన్నారు.

సర్వేలో ఇవి సేకరిస్తారు..

సర్వేలో భాగంగా భవనానికి సంబంధించి వ్యక్తిగతం, వాణిజ్య భవనం, మిక్స్‌డ్, అపార్ట్‌మెంట్, గ్రూప్ హౌసింగ్, ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ ప్లాట్, కార్యాలయం, కేంద్ర ప్రభుత్వ ప్లాట్, కార్యాలయం, వేకెంట్ ల్యాండ్, నిర్మాణంలోని భవనం, జీహెచ్ఎంసీ ఆస్తులు (కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు).

- భవనం లేదా ప్లాట్ ఫొటోలు. భవనానికి పేరుంటే పేరు, ఇంటిముందు రోడ్డు వెడల్పు, ప్లింత్ ఏరియా, ఎన్ని అంతస్తులు, ఎన్ని ఫ్లాట్స్, ఎన్ని లిఫ్టులు, పార్కింగ్ ఏరియా ఎంత, ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్ల వివరాలు.
- అత్యవసర సమయాల్లో సేవలందించేందుకు, భవిష్యత్ అవసరాల కోసం ఇంకుడు గుంతలు, సివరేజి కనెక్షన్, సోలార్ ప్యానెల్ వంటివి ఉన్నదీ, లేనిదీ. ఆస్తి (భవనం)కి సంబంధించి డోర్‌నంబర్, లొకేషన్, పీటీఐఎన్. భవనం పర్మిషన్‌నంబర్, పర్మిషన్ సర్టిఫికెట్ ఫొటో ఉంటే ఇవ్వవచ్చు. లేకుంటే లేదు.

ప్రాజెక్టు వ్యయం రూ. 22 కోట్లు

ఇప్పటి వరకు 158 కిలోమీటర్ల మేర డ్రోన్‌సర్వే పూర్తయింది. 1,14,020 ఇళ్ల డిజిటలైజేషన్ జరిగింది. ప్రస్తుతం హైదర్‌నగర్, మియాపూర్, చందానగర్, కేపీహెచ్‌బీకాలనీ, ఉప్పల్, హయత్‌నగర్‌లలో సర్వే జరుగుతోంది. త్వరలో మాదాపూర్, శేరిలింగంపల్లి, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్‌కాలనీ, గాజుల రామారం, సుభాష్‌నగర్, నాగోల్, ఆర్‌సీపురం ప్రాంతాల్లో సర్వే జరగనుంది. సర్వేను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలనేది లక్ష్యం.

వాణిజ్య భవనాలపై దృష్టి



ఆస్తిపన్ను రివిజన్ చేయాలా.. తక్కువ ఆస్తిపన్ను ఉన్న వాటికి అసలైన ఆస్తిపన్ను ఎప్పటి నుంచి వసూలు చేయాలా అనే వాటి గురించి తాము పట్టించుకోమని, వాటికి సంబంధించి ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుదని ఆమ్రపాలి అన్నారు. రెసిడెన్షియల్ నివాసాల్లో వ్యత్యాసాలున్నా వంద రూపాయల వ్యత్యాసంతో జీహెచ్ఎంసీకి పెద్దగా వచ్చే నష్టమేమీ లేదని, వాణిజ్య భవనాలపైనే దృష్టి పెడతామన్నారు. ఒక్క వాణిజ్య భవనం వందల నివాస భవనాలకు సమానమని, అలాంటి వాటివల్ల జీహెచ్ఎంసీ ఆదాయం పెరుగుతుందన్నారు. జీహెచ్ఎంసీలో 19.3 లక్షల ఆస్తులుండగా, వాటిలో 2.7 లక్షల వాణిజ్య భవనాలున్నాయని పేర్కొన్నారు.

ఆ ఇబ్బందులుండవు

'చెత్త సేకరించే వారు రోజూ మీ ఇంటికొచ్చి చెత్త సేకరించాలి. కానీ రావడం లేదు. అది మీకూ తెలుసు. నాకూ తెలుసు. మీకే కాదు.. మా ఇంటికి కూడా అప్పుడప్పుడు రావడం లేదు. మేమూ సఫర్ అవుతున్నాం. అదే ఇంటికి యూనిక్ కోడ్ ఉంటే చెత్త సేకరించే వారికి ఒక ఫోన్ ఇస్తాం. చెత్త సేకరించిన ఇళ్ల స్కాన్ చేయాల్సిందిగా చెబుతాం. అప్పుడు కచ్చితంగా ఎన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరించింది తెలుస్తుంది'

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో నిరాటంకంగా సేవలు

మంత్రి దామోదర్ రాజనర్సింహ

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో రోగులకు నిరాటంకంగా సేవలు అందుతున్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలికంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న 40 శాతం మంది ఉద్యోగులను గుర్తించి బదిలీలు చేశామని పేర్కొన్నారు. ఆస్పత్రి పని తీరుకు, రోగుల సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పారదర్శకంగా విధంగా ఆటంకం కలగకుండా బదిలీలు చేపట్టామని వివరించారు. జీఓ నంబర్ 80 ప్రకారం సూపర్ స్పెషాలిటీ సేవల్లో అత్యవసరాన్ని పరిగణనలోకి తీసుకొని సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చామని చెప్పారు. వైద్యులు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కాంట్రాక్టు పద్ధతిన ఈ ఏడాది మార్చిలో నియమించామని, ఇంకొంతమంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకేనేందుకు ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

నేడు పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై శుక్రవారం పలువురు కార్పొరేటర్లు అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. పీర్జాదిగూడలో మొత్తం 26 మంది కార్పొరేటర్లు. వీరిలో కాంగ్రెస్ పార్టీ పక్షాన 22 మంది ఉన్నారు. వారు గత నెలలో మేయర్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసును కలెక్టర్‌కు ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డిని నియమించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది కార్పొరేటర్లు ప్రస్తుతం క్యాంప్‌లో ఉన్నారు. కార్పొరేటర్లు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో పాల్గొననున్నారు. మరోవైపు అవిశ్వాసం తీర్మానాన్ని నిలుపుదల చేయాలంటూ మేయర్ వెంకట్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దానిని కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో శుక్రవారం అవిశ్వాస తీర్మానం యథావిధిగా జరగనుంది.



ఈ రోడ్లపై వెళ్లతరమా!

ఇటీవల కురుస్తున్న వర్షాలతో నగరంలోని రహదారులు గుంతలమయంగా మారాయి. వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఎల్‌బీ నగర్ బండ్లగూడలోని ఆనంద్ నగర్ నుంచి ఓఆర్ఆర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల కష్టాలను తీర్చాలని వేడుకుంటున్నారు. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు



ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న శివయ్య

సుల్తాన్‌బజార్: ఉస్మానియా మెడికల్ కళాశాలకు 'ఐఎస్ఓ' గుర్తింపు దక్కింది. గుర్తింపు పత్రాన్ని గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్‌కు సంస్థ ప్రతినిధి శివయ్య అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. ఉస్మానియా మెడికల్ కళాశాలకు రెండోసారి ఐఎస్ఓ గుర్తింపు దక్కడం గర్వకారణమన్నారు. తమ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యాప్రమాణాలు, కళాశాలలోని పచ్చదనం, పర్యావరణం, మంచి బోధన, అన్ని స్థాయిల ఉద్యోగుల కృషితోనే ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, డాక్టర్ పద్మావతి, ఏడీ డాక్టర్ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రక్షాళన

హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగంలో మార్పులు

నాలుగు నుంచి ఆరుకు పెరిగిన జోన్‌లు

- మేడ్చల్, శంకర్‌పల్లి జోన్‌ల విభజన
- యథావిధిగా ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్‌లు
- ప్లానింగ్, సహాయ ప్లానింగ్ అధికారుల బదిలీలు
- జోన్‌ల పెంపుతో సకాలంలో ఫైళ్ల పరిష్కారం

hmda Growing Global

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రణాళిక విభాగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. జోన్‌ల పరిధిని పెంచడంతో పాటు పూర్తిస్థాయిలో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఏళ్లతరబడి ఒకేచోట పని చేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. అన్ని రకాల నిర్మాణ అనుమతులు, లే అవుట్‌లు, ఎల్ఆర్ఎస్‌లు, భవనాల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు వంటి వివిధ రకాల సేవలను అందజేయడంలో కీలకమైన ప్లానింగ్ విభాగంపై కొంతకాలంగా పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన అడ్డగోలు అనుమతుల నేపథ్యంలో ఏసీబీ దాడులు సైతం జరిగాయి. అప్పట్లో డైరెక్టర్‌గా వ్యవహరించిన శివబాలకృష్ణ లక్ష్యంగా ఏసీబీ సోదాలు హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో ప్రకంపనలు పుట్టించాయి. మరోవైపు పలువురు అధికారులపై కూడా ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని అధికారులు అప్పుడే గుర్తించారు. ఇటీవల అన్ని ప్రభుత్వ విభాగాల్లో బదిలీలకు ప్రభుత్వం అనుమతినివ్వడంతో హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో ప్రక్షాళనకు మార్గం సుగమమైంది. దీంతో ఆన్‌డిప్యుటేషన్‌పై హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో విధులు నిర్వహించిన పలువురు అధికారులను మొదట బదిలీ చేశారు. తాజాగా అంతర్గత బదిలీలు చేపట్టారు. అన్ని జోన్‌లలోనూ అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి.

జోన్‌ల విస్తరణ...

మరోవైపు ప్లానింగ్ జోన్‌లను పెంచారు. సుమారు 7200 చదరపు కిలోమీటర్‌ల పరిధిలో హెచ్ఎండీఏ విస్తరించి ఉంది. ఇప్పటి వరకు ఉన్న శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్‌కేసర్, మేడ్చల్ నాలుగు జోన్‌లను ప్రస్తుతం 6 జోన్‌లుగా విస్తరించారు. మేడ్చల్ జోన్ విభజించి మేడ్చల్-1, మేడ్చల్-2 గా రెండు జోన్‌లు చేశారు. శంకర్‌పల్లి జోన్ సైతం శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2 జోన్‌లుగా చేశారు. ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్‌లు మాత్రం యథావిధిగా ఉన్నాయి. మేడ్చల్ జోన్-1 పరిధిలో బాచుపల్లి, గుండ్లపోచంపల్లి,నర్సాపూర్, శామీర్‌పేట్, శివంపేట్, తూప్రాన్, మనోహరాబాద్ తదితర ప్రాంతాలు, మేడ్చల్ జోన్-2 పరిధిలో కొంపల్లి, మేడ్చల్, పీఎఫ్‌యా, గ్రిడ్‌రోడ్, ఉప్పల్ భగాయత్, దుండిగల్, గండిమైసమ్మ, మర్కూక్, ములుగు, వర్గల్, కాప్రా తదితర ప్రాంతాలు రానున్నాయి. శంకర్‌పల్లి జోన్-1 పరిధిలో గండిపేట్, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి-2 పరిధిలో అమీన్‌పూర్, పటాన్‌చెరు, శంకర్‌పల్లి, సంగారెడ్డి, కంది, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర్ తదితర ప్రాంతాలు ఉంటాయి. ఘట్‌కేసర్ జోన్‌లో ఘట్కేసర్, భువనగిరి, బొమ్మలరామారం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్, పోచంపల్లి, బీబీనగర్, మేడిపల్లి, కీసర తదితర ప్రాంతాలు. శంషాబాద్ జోన్‌లో బాలాపూర్, ఇబ్రహీంపట్నం, యాచారం, కందుకూరు, మంచాల్ (పార్ట్), మహేశ్వరం, శంషాబాద్, ఫరూక్‌నగర్, షాద్‌నగర్, కొత్తూర్, నందిగామ తదితర ప్రాంతాలు ఉంటాయి.

ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష...

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఫైళ్లను వేగిరం పరిష్కరించేందుకు ఒకటి రెండు రోజుల్లో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ప్లానింగ్ విభాగంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. కొత్తగా జోన్‌లను పెంచడంతో పాటు, సీపీఓలు, పీఓలు, ఏపీలు పూర్తిస్థాయిలో బదిలీ అయిన నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ఫైళ్ల పరిధిపైనా కసరత్తు జరగనుంది. కొన్ని జోన్‌లు, మండలాల పరిధిలో వేల సంఖ్యలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా మరికొన్ని జోన్‌లలో వందల్లో ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు పనిభారంతో ఎక్కువ ఒత్తిడికి గురి అవుతుండగా, మరికొందరు సత్వరమే తమ లక్ష్యాలను పూర్తి చేసుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎల్ఆర్ఎస్ ఫైళ్లను జోన్‌లు, మండలాల మధ్య సమంగా పంపిణీ చేసి పరిష్కరించాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్తగా ఆరుగురు ప్రణాళిక అధికారులు..

జోన్‌లను పెంచడంతో పాటు అన్ని జోన్‌లకు ప్లానింగ్ అధికారులను నియమించారు. వివిధ విభాగాల నుంచి బదిలీపై హెచ్ఎండీఏకు వచ్చిన వారితో పాటు ప్లానింగ్ విభాగంలోనూ పూర్తిస్థాయిలో అంతర్గత బదిలీలు చేపట్టారు. కొత్తగా ఏర్పాటైన మేడ్చల్ జోన్-1 ప్లానింగ్ అధికారిగా గోపికా రమ్య, మేడ్చల్-2 ప్లానింగ్ అధికారిగా కె.శాలిని బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మేడ్చల్ చీఫ్ ప్లానింగ్ అధికారిగా పని చేసిన యశ్వంత్‌రావు ఘట్‌కేసర్‌కు బదిలీ అయ్యారు. శంకర్‌పల్లి జోన్ ప్లానింగ్ అధికారి యాదగిరిరావు మాస్టర్‌ప్లాన్ యూనిట్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి- 1కు చీఫ్ ప్లానింగ్ అధికారి బి.ప్రసాద్‌రావు, శంక్‌పల్లి జోన్-2 కు సీపీఓ మల్లికార్జునరావు నియమితులయ్యారు. శంషాబాద్ జోన్ సీపీఓగా రవీందర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. మాస్టర్‌ప్లాన్ యూనిట్,గ్రిడ్‌రోడ్ డీమార్కేషన్‌కు సీపీఓగా సత్యనారాయణమూర్తి, మాస్టర్‌ప్లాన్ యూనిట్ సీపీఓగా రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు.అలాగే వివిధ జోన్‌లలో సహాయ ప్లానింగ్ అధికారులుగా పని చేస్తున్న ఏపీఓలు సైతం బదిలీ అయ్యారు. కొందరు కొత్త జోన్‌లకు బదిలీ కాగా, మరికొందరు అదే జోన్‌లో ఇతర మండలాలకు బదిలీ అయ్యారు.

బైక్ బుకింగే ఆమెకు శాపమైంది!

- 2019లో సిటీకి వచ్చిన ఢిల్లీ యువతి
- అప్పట్లో యాప్ ద్వారా ఓ బైక్ ట్యాక్సీ బుకింగ్
- నాటి నుంచి వేధింపులు మొదలెట్టిన డ్రైవర్
- తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



సాక్షి, సిటీబ్యూరో: బైక్ ట్యాక్సీ బుకింగ్‌లో చేసిన చిన్న పొరపాటు ఓ యువతికి శాపమైంది. ఐదేళ్లుగా మానసిక వేధింపులకు కారణమైంది. సోషల్ మీడియాలో సదరు బైక్ ట్యాక్సీ డ్రైవర్ వేధింపులకు గురి చేస్తుండటంతో తాళలేక తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. ఢిల్లీకి చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. 2019లో నగరానికి వచ్చినప్పుడు యాప్ ద్వారా బైక్ ట్యాక్సీ బుక్ చేసుకుంది. బైక్ ట్యాక్సీ డ్రైవర్ తన పేరు రవి అని పరిచయం చేసుకున్నాడు. బైక్ ట్యాక్సీలు, క్యాబ్‌లు సహా ఆన్‌లైన్ సేవలు పొందేటప్పుడు వినియోగదారుల వ్యక్తిగత ఫోన్ నెంబర్ ఆ డ్రైవర్‌కు, సేవలు అందించడానికి వచ్చినవారికి చేరదు. కేవలం కంపెనీ నుంచి వచ్చే వర్చువల్ నెంబర్ ద్వారానే వీరి మధ్య సంప్రదింపులు జరుగుతాయి. ఈ విషయం తెలిసినప్పటికీ సదరు యువతి చిన్న పొరపాటు చేసింది. రైడ్ ముగిసిన తర్వాత కార్యాలయ రికార్డుల కోసమంటూ రవికి సదరు యువతి తన ఫోన్ నెంబర్ ఇచ్చింది. బైక్ దిగిన కొద్దిసేపటికే ఆమెకు రవి నుంచి రెండు సందేశాలు రాగా ఆమె పట్టించుకోలేదు. కొన్ని రోజులకు రవి తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపగా ఆమె అంగీకరించింది. ఇక అప్పటి నుంచి రకరకాలైన సందేశాలను ఆమెకు పంపడం మొదలెట్టాడు. దీంతో విసిగిపోయిన యువతి అతడి ఫోన్ నెంబర్‌తోపాటు సోషల్‌మీడియా ఖాతాను బ్లాక్ చేసింది. రవి వ్యవహారాన్ని అతడు పనిచేస్తున్న కంపెనీకి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. అయినా అతడి వేధింపులు ఆగలేదు.

విసిగివేసారి ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు...

ఆ యువతిని మరింత వేధించేందుకు రవి పలు నకిలీ పేర్లతో ఇన్‌స్టాగామ్‌లో ఖాతాలు తెరిచాడు. యువతి ఖాతా నుంచి ఆమె ఫొటోలు సంగ్రహించి మార్ఫింగ్ చేసి, అభ్యంతరకర, అశ్లీల సందేశాలూ పంపాడు. దాదాపు ఐదేళ్లుగా ఈ వేధింపులు భరించిన బాధితురాలు ఎట్టకేలకు ఈ నెల 3న ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం సాంకేతిక ఆధారాలను బట్టి నిందితుడు హైదరాబాద్‌లోనే ఉన్నట్లు గుర్తించింది. ఢిల్లీలో ఉన్న పోలీసులు ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ డిటెయిల్డ్ రికార్డు(ఐపీడీఆర్) సహా ఇతర వివరాలు సంగ్రహిస్తోంది. మరో బృందం హైదరాబాద్ చేరుకుని రవిని వేటాడే పనిలో పడింది. దీనికోసం గతంలో అతడు పని చేసిన కంపెనీని సంప్రదించింది.

రైలుబోగీల మధ్య చిక్కిన మృతుడి ముఖభాగం

సికింద్రాబాద్: ప్రమాదం ఎక్కడ జరిగిందో, ఎలా జరిగిందో తెలియదు కానీ ఓ మృతుడి ముఖభాగం మాత్రం రైలుబోగీతోపాటు మౌలాలి సమీపంలోని రైల్వేట్రాక్‌కు చేరుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... గురువారం మధ్యాహ్నం దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలోని ఎన్‌ఎఫ్‌సీ యార్డు వద్దకు చేరుకుంది. అయితే అందులోని హెచ్1, 2 ఏసీ బోగీల మధ్య జాయింట్ స్ప్రింగ్‌కు ఒక మృతదేహానికి చెందిన ముఖభాగం చిక్కుకొని ఉండటాన్ని ప్రయాణికులు గుర్తించారు. ఈ విషయమై ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడి ముఖభాగాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. వేగంగా నడుస్తున్న రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉంటారని, మృతదేహం మొండెం వేరుపడి, ముఖభాగం బోగీల మధ్య చిక్కుకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఎలారెస్..?

- లే అవుట్ల క్రమబద్ధీకరణకు అన్నీ అడ్డంకులే!
- అర్బన్‌లో 2.28 లక్షలు, రూరల్‌లో 61 వేల దరఖాస్తులు
- సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్య
- క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లే అవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియకు అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. సిబ్బంది కొరతకు సాంకేతిక సమస్యలు తోడవుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన పోర్టల్ సర్వర్ తరచూ మొరాయిస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది పోర్టల్‌లో లాగిన్ అయి అన్ని వివరాలను నమోదు చేసి, తీరా సబ్మిట్ మీట నొక్కగానే సాంకేతిక సమస్య తలెత్తి స్తంభించిపోతోంది. దీంతో వివరాల నమోదు ప్రక్రియ మళ్లీ మొదటికొస్తోంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో అర్థంకాక ఆయా పురపాలికల అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే అక్రమ నిర్మాణాల గుర్తింపు, నియంత్రణ చర్యల్లో భాగంగా వాటి కూలివేతలు, కొత్త భవనాలకు అనుమతుల జారీ, ఇంటి పన్ను నిర్ధారణ, వసూళ్ల వంటి ప్రక్రియతో టౌన్‌ప్లానింగ్ అధికారులు బిజీగా ఉండగా, వేలల్లో పేరుకుపోయిన ఈ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వీరికి పెద్ద సవాల్‌గా మారింది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ ఈ సమస్య నెలకొంది.



తరచూ మొరాయిస్తున్న సర్వర్

ఖాళీ ప్లాట్లు/ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.పది వేలు, ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వేయి ఫీజుగా నిర్ణయించింది. ఆ మేరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్లలో 3,58,464 దరఖాస్తులు రాగా, రంగారెడ్డి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధి నుంచి అత్యధికంగా 2,28,143 దరఖాస్తులు అందాయి. ఇప్పటివరకు 787 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. మిగిలిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. తాజాగా ప్రభుత్వం ఈ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసింది. మూడు నెలల్లో వీటిని పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించింది. అయితే జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ సరిపడా సిబ్బంది లేరు. మరోవైపు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, చెరువులు, కుంటలు, బఫర్‌జోన్లలో ఉన్న ప్లాట్లు, లే అవుట్లకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలనలో అధికారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా భవిష్యత్తులో చిక్కులు తప్పవు. టౌన్‌ప్లానింగ్, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తే కానీ, ఆయా దరఖాస్తులకు పరిష్కార మార్గం లభించని పరిస్థితి. అంతేకాదు 111 జీఓ పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల నుంచి అందిన దరఖాస్తుల విషయంలోనూ తలనొప్పులు తప్పకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలోని మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల పరిధిలో అందిన దరఖాస్తులు ఇలా..

మున్సిపాలిటీలు/ కార్పొరేషన్లు	దరఖాస్తులు
తుర్కయాంజాల్	49,759
బడంగ్‌పేట్	47,793
పెద్ద అంబర్‌పేట్	43,740
షాద్‌నగర్	16,450
ఆదిబట్ల	14,889
ఇబ్రహీంపట్నం	13,142
జల్‌పల్లి	10,892
బండ్లగూడ	7,240
శంషాబాద్	6,672
ఆమనగల్	3,447
నార్సింగి	3,354
శంకర్‌పల్లి	3,300
మీర్‌పేట్	3,087
కొత్తూరు	2,767
తుక్కుగూడ	2,544
మణికొండ	2,421

నగరంలో నేడు

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని కుమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఉదయం 11 గంటలకు ఉత్సవం జరుగుతుంది. ఈ వేడుకలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పాల్గొంటారు.
- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ట్రైబలోగ్రఫీ పేరిట ఛాయాచిత్ర ప్రదర్శన జరుగుతుంది.
- తూరీగ ఆధ్వర్యంలో నాల్గొవ కలెక్టివ్ ఎగ్జిబిట్‌ను మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.రమణారెడ్డి ప్రారంభిస్తారు. రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- అంగార శ్రీనివాసబాబు వేసిన చిత్రాలతో కూడిన అన్‌డిసిఫెర్డ్ చిత్ర ప్రదర్శన మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుంది.
- దీపాంజలి ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని రవీంద్రభారతిలో సాయంత్రం 5.45 గంటలకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత దీపికారెడ్డి ఆధ్వర్యంలో కూచిపూడి రంగప్రవేశ కార్యక్రమం జరుగుతుంది.
- బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో స్కూల్ రాపిడో వర్క్‌షాపు జరుగుతుంది. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనున్నారు.
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌పై ఉన్న కుమురం భీమ్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది.
- ఆచార్య ఏల్చూరి మురళీధర్‌రావు రచించిన 'వాఙ్మయచరిత్రలో కొన్ని వ్యాసఘట్టాలు, విశేషాంశాలు 'పుస్తకావిష్కరణ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశమందిరం, మొదటి అంతస్తు, కిన్నెర ఆర్ట్ థియేటర్, అజో-విభో కందాళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ నిర్వహణ.

ఇంగ్లిష్‌తో అంతర్జాతీయ అవకాశాలు ఈజీ

డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్ మార్కెటింగ్ హెడ్ తారాకపూర్

గచ్చిబౌలి: ప్రతి విద్యార్థికి గ్లోబల్ ఎడ్యుకేషన్ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో అబ్రాడ్ స్టడీ టెస్ట్ నిర్వహిస్తున్నామని డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్ మార్కెటింగ్ హెడ్ తారాకపూర్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని లీ మెరీడియన్ హోటల్‌లో అబ్రాడ్ స్టడీ టెస్ట్ నిర్వహించారు.



డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్ సందర్భంగా మాట్లాడుతున్న తారాకపూర్



మస్కట్‌తో నటుడు అడవి శేష్, దర్శకుడు శైలేష్



డ్యులింగో టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

టెస్ట్‌కు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తారా కపూర్ మాట్లాడుతూ డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్ అంతర్జాతీయ విద్యకు, యూఎస్‌లో చదివేందుకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. దేశంలో డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్(డీఈటీ) రాసే విద్యార్థుల సంఖ్య హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఆంగ్ల భాషకు శక్తి ఉందని నమ్ముతున్నట్లు చెప్పారు. ప్రముఖ సినీనటుడు అడవి శేష్ మాట్లాడుతూ శాన్‌ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీలో విద్యార్థిగా తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఇప్పుడు యూఎస్‌కు వెళ్లాల్సి వస్తే డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్‌లో పాల్గొనడానికి ఇష్టపడతానని చెప్పారు. కార్యక్రమంలో దర్శకుడు శైలేష్ కొలను, పారిశ్రామిక వేత్త బొల్లాంట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ బొల్లా పాల్గొన్నారు.

విద్యార్థుల బాహాబాహీ

– ఈసీఐఎల్ బస్ టెర్మినల్ ప్రాంతంలో ఘటన



కుషాయిగూడ: విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు కళాశాలలకు వస్తున్న విద్యార్థులు చిన్న, చిన్న గొడవలకే గ్యాంగులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. తాజాగా గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఈసీఐఎల్ బస్ టెర్మినల్ ఎదురుగా ఉన్న వీధిలో విద్యార్థులు బాహాబాహీకి తలపడ్డారు. దీంతో ఆ ప్రాంతం యుద్ధరంగాన్ని తలపించింది. ఒకరినొకరు దూషించుకుంటూ పిడిగుద్దులతో దాడులు చేసుకున్నారు. విద్యార్థుల ఫైటింగ్ సీన్ సినిమాను తలపించేలా ఉండటంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ పరిసరాల్లో నిత్యం ఇలాంటి గొడవలు చోటు చేసుకుంటున్నాయంటూ ఇదివరకే 'సాక్షి' కథనాలు ప్రచురించినా పోలీసులుగానీ, కళాశాలల యాజమాన్యాలుగానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా విద్యార్థులకు కౌన్సెలింగ్‌తోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

అల్వాల్: మెరుగైన వైద్య సేవలందించినప్పుడే గుర్తింపు వస్తుందని ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మీనా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన స్థానిక కార్పొరేటర్ విజయశాంతితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోగులు చికిత్స పొందడం సులభతరమైందన్నారు. అస్తవ్యస్తమైన జీవనశైలి కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

కాచిగూడ-అబ్దుల్లాపూర్‌మెట్ రూట్‌లో సిటీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుకొనే విద్యార్థుల సౌకర్యం కోసం కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు కొత్త రూట్ (205)లో 4 బస్సులను ప్రవేశపెట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి వస్తాయి.ఈ బస్సులు కాచిగూడ నుంచి జైల్‌గార్డెన్, సూపర్‌బజార్, దిల్‌సుఖ్‌నగర్,ఎల్‌బీనగర్, పనామా,హయత్‌నగర్, ఆర్‌ఆర్ పాలెం, పెద్ద అంబర్‌పేట్, ఔటర్‌రింగ్‌రోడ్డు మీదుగా అబ్దుల్లాపూర్‌మెట్‌కు రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ నుంచి మొదటి బస్సు ఉదయం 6.10 గంటలకు ,చివరి బస్సు రాత్రి 8.40 గంటలకు బయలుదేరుతుంది. అలాగే తిరుగు ప్రయాణంలో అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి మొదటి బస్సు ఉదయం 7.20 గంటలకు, చివరి బస్సు రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది.

న్యాయం జరిగే వరకు పోరు ఆగదు

సిటీ కోర్టులు: న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై జనగామ సీఐ, ఎస్సై, ఇతర సిబ్బంది దాడులను ఖండిస్తూ న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. గురువారం నాంపల్లి కోర్టుతోపాటు, సిటీ సివిల్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు, సికింద్రాబాద్ కోర్టు, మల్కాజిగిరి కోర్టు, కూకట్‌పల్లి కోర్టులలో న్యాయవాదులు విధులను స్వచ్ఛందంగా బహిష్కరించారు. రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయా కోర్టులలో బార్ అసోసియేషన్ల అధ్యక్షుల ఆధ్వర్యంలో సభ్యులు, ఇతర న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. న్యాయవాదులకు న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ రాష్ట్రంలో తరచూ న్యాయవాదులపై దాడులు జరగడం ఆందోళనకరంగా ఉన్నదని పేర్కొన్నారు. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్, సంయుక్త కార్యదర్శి ఎం.రమేశ్, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ కొండారెడ్డి, టీపీసీసీ లీగల్ సెల్ కార్యదర్శి తిరుపతి వర్మ, బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ కార్యదర్శి జక్కుల లక్ష్మణ్, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి, న్యాయవాదులు చింతల కృష్ణ, గంపా వెంకటేశం, ఈశ్వర్‌కుమార్, బాల్‌రాజు, శ్రీను, శ్రీధర్, సాంబశివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో న్యాయవాది మృతి



ముజఫర్ అలీ బేగ్

యాకుత్‌పురా: న్యాయవాదుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఓ న్యాయవాది గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు... జనగామలో న్యాయవాద దంపతులపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం పురానీహవేలీలోని సిటి సివిల్ కోర్టులో న్యాయవాదులు నిరసన చేపట్టారు. నిరసనలో పాల్గొన్న యాకుత్‌పురా బడాబజార్ ప్రాంతానికి చెందిన న్యాయవాది ముజఫర్ అలీ బేగ్ (57)కి ఒక్కసారిగా గుండెపోటుతో స్పృహ తప్పి కింద పడిపోయాడు. వెంటనే అక్కడున్న న్యాయవాదులు అంబులెన్స్ సహాయంతో ఆయనను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

భవిష్యత్‌లో పదివేల మెగావాట్లు అవసరం

- విద్యుత్ ఇంజనీర్లకు త్వరలో పదోన్నతులు
- గ్రేటర్ ఇంజనీర్లతో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, సిటీబ్యూరో: 'హైదరాబాద్ నగరం పెట్టుబడులకు తలమానికం. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సంస్థలు ముందుకు వస్తున్నాయి. నగరంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పుడు 4352 మెగావాట్ల వినియోగం నమోదవుతోంది. భవిష్యత్తులో అది పదివేల మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఆ మేరకు వచ్చే ఐదేళ్లలో సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త సబ్‌స్టేషన్లు, లైన్ల విస్తరణ పనులు చేపట్టాలి' అని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు గురువారం మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో గ్రేటర్ సర్కిళ్ల పరిధిలోని ఇంజనీర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు.

'108'తరహాలో సర్వీసులు

1912 హెల్ప్‌లైన్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని, '108' తరహాలో విద్యుత్ సంస్థ హెల్ప్‌లైన్ సేవలను విస్తృతం చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. గాలి పీల్చుకోవడం ఒక నిమిషం ఆగిపోతే ఎంత ప్రమాదమో, విద్యుత్ స్తంభిస్తే అంతే ప్రమాదమని ప్రజలు భావిస్తున్నారని, మారిన కాలానికి అనుగుణంగా సిబ్బంది సేవలను అందించాలని అన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.

మాకు బేషజాలు లేవు

ఏ సమస్యను అయినా వినడానికి సిద్ధంగా ఉన్నామని, తమకు ఎలాంటి బేషజాలు లేవని భట్టి అన్నారు. విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన కార్యాచరణ వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే క్రమంలో తరచూ స్థల సమస్య తలెత్తుతోందని చెప్పారు. బహుళ అంతస్తుల నిర్మాణాలకు/ ఇళ్లకు అనుమతి ఇచ్చే సమయంలోనే విద్యుత్ శాఖకు అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు లేఖ రాస్తానని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఫిర్యాదులను పాజిటివ్‌గా తీసుకొని పరిష్కరించాలని, వారు కొన్ని వేలు, లక్షల మందికి ప్రతినిధులనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నాణ్యమైన విద్యుత్తు అందిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, జీడీపీ పెరుగుతుందని భట్టి చెప్పారు. సమావేశంలో సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, సీజీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు పాల్గొన్నారు.

రాణించిన కెప్టెన్ వంశీకుమార్

లీగ్ చాంపియన్‌షిప్ క్రికెట్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన



సాక్షి, సిటీ బ్యూరో: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏ 2 డివిజన్ రెండురోజుల లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మణికుమార్ టీం 267 పరుగుల భారీ తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. హర్షిత క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో 'మణికుమార్', 'శ్రీ శ్యామ్' జట్లు పోటీ పడ్డాయి. మొదటగా బ్యాటింగ్‌కు దిగిన మణికుమార్ జట్టు 333 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి జట్టుకు నిర్దేశించింది. ఇందులో బ్యాట్స్‌మన్ వంశీ కుమార్ 176 పరుగులతో అత్యుత్తమ ప్రదర్శన చేశారు. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీ శ్యామ్ జట్టు బ్యాటర్లు కేవలం 66 పరుగులకే ఆలౌటయ్యారు. అయితే బౌలింగ్‌లోనూ రాణించిన వంశీ కుమార్ ఆరు ఓవర్లలో 5 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బ తీశారు. ఈ లీగ్ చాంపియన్‌షిప్‌లో మణికుమార్ జట్టు కెప్టెన్ వంశీ కుమార్ ఆల్‌రౌండ్ ప్రతిభతో భారీ విజయాన్ని అందుకుంది.

డ్రగ్స్‌ను అంతమొందించాలి: సీతక్క

– తరగతి గదిలోనే క్రమశిక్షణ నేర్చుకోవాలని పిలుపు



బాలోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను అంతమొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆ దిశగా కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మఒడి తొలిబడి అయితే మలి ఒడి మనబడి అని, ఆ బడిలోనే విద్యార్థులకు విలువలు గల విద్యను బోధించాలని సీతక్క సూచించారు. పాఠశాలలకు కూడా డ్రగ్స్ మహమ్మారి పాకుతోందని, దానిని అడ్డుకోవాలని అన్నారు. మన ఆరోగ్యంతో పాటు తల్లిదండ్రుల గౌరవాన్ని కూడా కాపాడాలని పేర్కొన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణం బడిలోనే జరుగుతుందని, ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. తెలంగాణలో మంచి విద్యావ్యవస్థ ఉందని, దానిని మరింత పటిష్టం చేస్తామన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఈవో రోహిణి, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ విద్యావేత్త ఆకెళ్ల రాఘవేంద్ర, బాలోత్సవం కార్యదర్శి సోమయ్య, ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

బాలికల సాధికారతతోనే ప్రగతిశీల సమాజం

బంజారాహిల్స్: ప్రగతిశీల సమాజానికి బాలికల సాధికారత అవసరం ఉందని బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బీబీజీ) ఎంపీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని దేవనార్ బ్లైండ్ స్కూల్‌లో గురువారం 'ప్రేరణ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమ సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారని చెప్పారు. సరైన అవకాశాలు, వనరులు అందించినప్పుడే ఇంకా రాణిస్తారని తెలిపారు. దేశంలో అనేక ప్రాంతాల్లో బాలికలకు విద్యపై హక్కు ఉన్నప్పటికీ, ఇప్పటికీ వారికి విద్య అందుబాటులో లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా బీబీజీ బంగారు తల్లి గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విద్య ద్వారా బాలికలకు సాధికారత కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. బంగారు తల్లి లక్ష్యం ప్రతిష్టాత్మకమైందన్నారు. 2040 నాటికి రెండు మిలియన్ల బాలికలకు విద్య ద్వారా సాధికారత కల్పించనున్నామని చెప్పారు. ప్రేరణ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దృఢ సంకల్పం, స్థితి స్థాపకతను పెంపొందించడం, అంచెలంచెలమైన దృష్టి, శక్తితో సవాళ్లను ఎదుర్కొనేలా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బాలికా సాధికారతను ప్రోత్సహించడానికి రూపొందించిన ఈ కార్యక్రమం విశ్వాసం, ఆత్మగౌరవం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టిసారించినట్లు వివరించారు.

రేపు రాష్ట్ర రా రైస్‌మిల్లర్స్ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న గణపతి రెడ్డి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర రా రైస్‌మిల్లర్స్ అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన ఘట్‌కేసర్‌లోని జె.కె కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు అడ్‌హాక్ కమిటీ అధ్యక్షులు పాడి గణపతిరెడ్డి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు కిష్టయ్య, గోవిందరావులతో కలిసి ఆయన మాట్లాడుతూ గతంలో తాము రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో కలిసి ఉండే వారిమని, తెలంగాణ ఏర్పడ్డ పది సంవత్సరాల్లో తమ ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలోని 2,500 రా రైస్‌మిల్లర్స్ అందరితో ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తమ పరిశ్రమను కాపాడుకునేందుకు ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతన అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని సమస్యలపై చర్చించి నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రికి, పౌరసరఫరాల కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రా రైస్ మిల్లర్స్ ఓనర్స్ సురేష్, సతీష్, రాజమౌళి, ప్రవీణ్, ఉపేందర్, ఐలయ్య, జితేందర్, జనార్దన్, రాంచందర్, నిరంజన్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల దయనీయ స్థితి


సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్

పంజగుట్ట: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అనిశ్చితి కారణంగా అక్కడి మైనార్టీలు అయిన హిందువులపై హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దేవాలయాల ధ్వంసాలతో దయనీయంగా మారిందని విశ్వహిందూ పరిషత్ ఆవేదన వ్యక్తం చేసింది. భారత ప్రభుత్వం వెంటనే సరైన చర్యలు తీసుకుని అక్కడి హిందువులను కాపాడాలని వారు సూచించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ మూర్తి, జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామిలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల కోసం ప్రారంభమైన ఉద్యమం, అక్కడి సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఉద్యమం కాస్తా యాంటీ ఇండియా, యాంటీ ఇజ్రాయెల్‌గా మారిందన్నారు. అక్కడి మౌల్వీలు చిట్టచివరి హిందువును కూడా వదలమంటూ అనడం చూస్తుంటే వారు జిహాదీలుగా తయారయ్యారని అర్థమౌతుందన్నారు. ఈ క్లిష్టపరిస్థితిని సద్వినియోగం చేసుకుని జిహాదీలు సరిహద్దులు దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయ త్నం చేసే అవకాశం ఉందని భారత భద్రతాదళం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో భజరంగ్‌దళ్ నాయకుడు సుభాష్ చందర్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



స్వచ్ఛదనం-పచ్చదనం అవగాహన కార్యక్రమంలో నేతలు


శ్రీనగర్‌కాలనీ: చుట్టూ పక్కల పరిసరాలను మనమే పరిశుభ్రపరిచి, పచ్చదనాన్ని పెంచాలని కాంగ్రెస్ నేత వనం శ్రీనివాసయాదవ్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్‌కాలనీ, శాలివాహనగర్‌లలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని కోరారు. మట్టికుప్పలు, చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బంది సహకారంతో తొలగించి బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్యామ్, శ్రీనివాస్, శానిటేషన్ సిబ్బంది, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలతోనే ఇమ్యూనిటీ


తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

ఖైరతాబాద్: పుట్టిన పిల్లలకు తల్లిపాలు పట్టిస్తే మంచి ఆరోగ్యంతోపాటు, ఇమ్యూనిటీ శాతం పెరుగుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజెఆర్‌నగర్ కమ్యూనిటీహాల్ అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయారెడ్డి పాల్గొని మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టాలని, ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే పట్టాలన్నారు. ఆరు నెలలు నిండిన తరువాత అంగన్‌వాడీలో లభించే బాలామృతం ఇవ్వాలన్నారు. ఎ.ఎన్.ఎం, ఆశ, అంగన్‌వాడీ టీచర్లందరూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ సెక్టార్ సీడీపీఓ పుష్పలత, సూపర్‌వైజర్ షీలావతి, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, పద్మావతి, సత్యమని, వీణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులతో నైపుణ్యత పెంపు


చెక్కులను అందచేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తదితరులు

ఖైరతాబాద్: కేంద్ర బడ్జెట్‌పై టాలెంట్ టెస్టులు నిర్వహించడం వల్ల నైపుణ్యత పెరిగి, విద్యార్థుల్లో దేశ ఆర్థిక స్థితిగతులపై అవగాహన కలుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ అన్నారు. ఐఐఎంసీ కళాశాలలో గురువారం బడ్జెట్ నాలెడ్జ్ టెస్ట్‌లో నగరంలోని 50 కళాశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నాలెడ్జ్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ప్రతీ సంవత్సరం కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై పరీక్షను నిర్వహిస్తు వస్తున్నామని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిగత ఆర్థికపరమైన విషయాలపై అవగాహన కల్పించడం కూడా ముఖ్యఉద్దేశమని తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, అనలాగ్ ఐఏఎస్ అకాడమీ,, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్తంగా నిర్వహించిన టెస్ట్‌లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

మరింత సుందరంగా కేబీఆర్ వాక్‌వే

- మోడల్ వాక్‌వేగా రూపొందించాలి
- వాకర్లు, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు
- నీటి వసతి, టాయిలెట్ల ఏర్పాటు
- వినూత్నంగా ఉండేలా బెంచీల ఏర్పాటు
- ఫ్లవరింగ్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఆదేశం
- వివిధ విభాల అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్ష


ఇంజినీరింగ్, వివిధ విభాగాల అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమిషనర్



బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలోను మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో మోడల్ వాక్‌వే పార్కుగా తీర్చిదిద్దాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వాక్‌వేలో పర్యటించి పలు విభాగం అధికారులతో ఆయన చేయాల్సిన, చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గత ఆరు నెలల కాలంగా కేబీఆర్‌పార్కు చుట్టు ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో పదికిపైగా థీమ్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రధాన జంక్షన్లతో పాటు ఫుట్‌పాత్‌లు పార్కులను ప్రభుత్వం మరింత సుందరంగా చేయాలని నిశ్చయించిందని ఇందులో భాగంగా పార్కు వాక్‌వేను ఇంకా సుందరంగా చేయడంతోపాటు సందర్శకులకు ఆహ్లాదాన్ని పెంచేలా చేయాలని అన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాదిగా వచ్చే వాకర్లు కూర్చొని సేద తీరేందుకు ఎక్కడా కూడా బెంచీలు లేవని వాక్‌వలో ప్రతీ 100 మీటర్లకు కానీ గుర్తించిన చోట కానీ విభిన్న ఆకృతుల్లో ఉండే బెంచీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే వాక్‌వేలో ఒక ఓపెన్ జిమ్ ఉండగా దాన్ని బాగు చేయడంతో పాటు మరో చోట ఇంకో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా వాక్‌వేలో రెండు, మూడు చోట్ల నీటి వసతిని ఏర్పాటు చేయాలని సూచించారు. వాక్‌వేలో మరో చోట పూర్తిగా కేవలం పూలు మాత్రమే వచ్చేలా మొక్కలు నాటాలని ఫ్లవరింగ్ గార్డెన్‌గా నామకరణం చేయాలని సూచించారు. ప్రతీ మొక్కకు నేమ్ ప్లేట్స్ పాటు డిస్టెన్స్‌ను సూచించే డిస్టెన్స్ బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. కొన్ని చోట్ల విభిన్న రకాలుగా ఉండే దీపాలను ఏర్పాటు చేయాలని వీధి దీపాల విభాగం అధికారులకు సూచించారు. వర్షం వచ్చినప్పుడు సందర్శకులు, వాకర్లు తడవకుండే ఉండే ఏర్పాట్లు చేయాలని అన్నారు. వాక్‌వేలో నడుస్తున్న వారితోపాటు రోడ్డు వైపు వెళ్తున్న వారికి ఆహ్లాదాన్ని కలిగించేలా పెయింటింగ్‌లు, నమూనాలను ఏర్పాటు చేయాలని అన్నారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న బస్టాప్ పక్కన ఉన్న టాయ్‌లెట్ల నుంచి మురుగు వాక్‌వేలోకి వస్తున్నదని దాన్ని రాకుండా నియంత్రించి వేరే వైపునకు మళ్లించాలని సూచించారు. వాక్‌వేలో వీధి కుక్కల సంఖ్య పెరిగినట్లు వాకర్లు ఫిర్యాదులు చేస్తున్నారని వాటి నియంత్రణతో పాటు వాటికి జరుగుతున్న ఫీడింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సర్కిల్-18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, వీధి దీపాల విభాగం ఈఈ ఇంద్రజిత్, వెటర్నరీ అధికారులు చక్రపాణి, వివేకానంద, పార్కుల విభాగం అధికారి బాలయ్య, ఆర్కిటెక్చర్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


వినాయకనగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో పర్వతాంజనేయస్వామి గుడి పక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. గుడిపక్కన ప్రభుత్వ స్థలంలో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిని కూల్చివేయాలంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఫిర్యాదు మేరకు స్పందించిన షేక్‌పేట తహశీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో కలిసి వీటిని నేలమట్టం చేశారు.

దోమల నివారణకు చర్యలు


పార్కులో నాలా సిల్ట్‌ను తొలగిస్తున్న సిబ్బంది

వెంగళరావునగర్: నాలాలను పరిశుభ్రం చేస్తూ దోమల నివారణ చర్యలను చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజ్‌కుమార్ తెలియజేశారు. యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్క్‌లో గత కొన్ని నెలలుగా వరదనీటి కాల్వలో సిల్ట్ పేరుకుపోయి ఉందని ప్రజల నుంచి కార్పొరేటర్‌కు ఫిర్యాదులు రాగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలియజేసి వారి సమక్షంలో నాలాలోని సిల్ట్‌ను సిబ్బంది ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తొలగించిన సిల్ట్‌ను ఎండిపోగానే తక్షణమే పార్కు నుంచి ఎత్తివేయాలని సూచించారు. పార్కుకు వచ్చిన సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు తెలియజేశారు. సాయంత్రం వరకు కొనసాగిన సిల్ట్ తొలగింపు పనుల కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, హెల్త్, అర్బన్ పారెస్ట్రీ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బోనాలకు నగదు ఇవ్వకపోతే...

మీ అంతుచూస్తా

వెంగళరావునగర్ : బోనాలుకు డబ్బులివ్వకపోతే మీ అంతు చూస్తానంటూ ఓ వ్యక్తి పలువురిని బెదిరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... యాదగిరినగర్‌లో నివాసం ఉండే బిల్లా పవన్ ఇటీవల రెండుమార్లు బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు చేశాడు. ఈ వేడుకల కోసం రహమత్‌నగర్‌లో వ్యాపారం చేసుకునే ఎం.సురేష్‌కుమార్‌కు ఫోన్ చేసి నగదు ఇవ్వాలని, లేనిపక్షంలో నీ అంతు చూస్తానంటూ బెదిరించాడు. సురేష్‌కుమార్ భయంతో రూ.10 వేలు పంపాడు. అదేవిధంగా శాంతివిద్యానికేతన్ ప్రిన్సిపాల్ సాయిమోహిత్ ముకుల్‌కు కూడా ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. తన మనుషులను స్కూల్‌కు పంపి బెదిరించాడు. ముకుల్ భయపడి రూ.5 వేలు ఇచ్చాడు. అదే విధంగా వీడియోగల్లీలో ప్రైవేట్ వ్యాపారం చేసుకునే ఎం.వినయ్‌కుమార్‌కు కూడా ఫోన్ చేసి బెదిరించాడు. భయపడి అతను కూడా రూ.7500 పంపాడు. ఈ ముగ్గురు బాధితులు బిల్లాపవన్‌పై చర్యలు తీసుకోవాలంటూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన సేవలు



హోం శాంపిల్ కలెక్షన్ సేవలను ప్రారంభిస్తున్న డాక్టర్లు నీలం రమణారెడ్డి, లోకేశ్వర్‌రావు

బంజారాహిల్స్: శస్త్ర చికిత్స పూర్తి చేసుకున్న రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు స్టార్ ఆస్పత్రి నిరంతరం కృషి చేస్తున్నదని స్టార్ ఆస్పత్రి కార్డియోథొరాసిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ లోకేశ్వర్‌రావు అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని స్టార్‌ఆస్పత్రిలో ఆయన ఇంటి వద్దే శాంపిల్ కలెక్షన్స్ చేసే మొబైల్ టీమ్ సేవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాహిల్స్‌తో పాటు నానక్‌రాంగూడలో స్టార్ ఆస్పత్రుల పరిధిలో ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. తమ రోగులు ఆస్పత్రికి వచ్చి శాంపిల్స్ ఇవ్వాల్సిన అవసరం లేదని వారి ఇంటి వద్దకే ఈ కలెక్షన్ టీమ్‌లు వెళ్ళి శాంపిల్స్‌ను సేకరిస్తాయని వారు తెలిపారు. ఖచ్చితమైన ఫలితాలను కూడా తాము అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ నీలం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌నగర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం


చెత్త తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్‌లో గురువారం చెత్త తరలింపు ప్రక్రియను చేపట్టారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హాజరై పనులను పర్యవేక్షించారు. రాబోయే బోనాలు సందర్భంగా దేవాలయ ప్రాంతంలో అవసరమైన లైట్లను కూడా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ రవి, సూపర్‌వైజర్ అమిత్‌కుమార్, ఎస్‌ఎఫ్ఏ సూపర్‌వైజర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంజగుట్టలో...

పంజగుట్ట: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ 17 డిప్యూటీ కమిషనర్ జగన్ తుమ్మలబస్తీలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తుమ్మలబస్తీలోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ రోడ్డుపై ఉన్న మట్టికుప్పలను తొలగించారు. గంగపుత్ర సంఘం వరకు రోడ్డుపై ఉన్న అన్ని మట్టికుప్పలు, చెత్తను తొలగించి జీహెచ్‌ఎంసీ యుబిడి మేనేజర్ జ్యోత్స్నతో కలిసి మొక్కలు నాటారు. వీరికి స్థానిక సమైక్యభారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. నాగేశ్వరరావు పూర్తి సహకారం అందించగా ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఎంటమాలజీ సిబ్బంది సుమన్, అయూబ్ ఖాన్, అబ్దుల్ సత్తార్, అసద్ అలీ, కోటేశ్వరావు, వార్డ్‌మెంబర్ మున్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

లిబర్టీ: వ్యవసాయ కూలీల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు చేసిన తరహాలో నిరుపేద వ్యవసాయ కూలీలకు చేసి ప్రభుత్వం వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రిమల్లు భట్టి విక్రయమార్కకు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు దఫాల్లో దాదాపు రూ. 12 వేలకోట్లకు పైగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని అదే తరహాలో ఉపాధి లేక వ్యవసాయ రంగంలో వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్న వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునేందుకు రుణమాఫీ చేయాలని విన్నవించారు. రైతు కూలీలకు గ్రామస్థాయిలో గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ. 12 వేలు వెంటనే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్ - స్థానిక సంస్థల ఎన్నికలు - బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు' అనే అంశంపై ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం హిమాయత్ నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీ మేధావులు, ప్రజాస్వామిక వాదులు, బీసీ సంఘాల నేతలు, మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొని కామారెడ్డి డిక్లరేషన్‌పై చర్చిస్తారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డాక్టర్ వివిఎల్.రాజు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని తెలిసినప్పటికీ వర్గీకరణ చేసుకునే అధికారాన్ని రాష్ట్రాలకు అప్పగిస్తు కోర్టు తీర్పు చెప్పిందని ఆయన పేర్కొన్నారు. వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఈ నెల 21న భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశావ్యప్తంగా వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్ని రాష్ట్రాలకు విస్తరింపచేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిస్తున్న క్రమంలోని భారత్‌బంద్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

హైకోర్టు ఏజీపీగా రాంశంకర్‌శర్మ



బంజారాహిల్స్: తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని ఆనంద్‌నగర్‌కాలనీకి చెందిన రాంశంకర్‌శర్మ నియమితులయ్యారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు, సీనియర్ అడ్వొకేట్లు, సహచరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే ఏఐసీసీ కో-ఆర్డినేటర్ బి.నర్సింహారెడ్డితో పాటు యువజన కాంగ్రెస్ నేతలు, కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో వెళ్లి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని కమలానగర్ నివాసులకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి సికింద్రాబాద్ ఆర్డీఓకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ కమలానగర్ బస్తీకిచెందిన 44 మందికి ఇప్పటికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయించకపోవడంతో వారంతా ఉన్న ఇళ్లను కోల్పోయి అద్దె గృహాల్లో నివాసముంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను చేసిన విజ్ఞప్తిపై ఆర్డీఓ సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు.

'గతి' స్కూల్ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న గతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని గతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురువారం పాఠశాల పరిసరాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడుకుందాం..పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం..అంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి బస్తీవాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్తీల్లో కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ గురువారం పర్యటించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన బస్తీలో పర్యటించి మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలకు స్థానికులకు వివరించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి, జీహెచ్‌ఎంసీ సిబ్బందిని సన్మానించారు.

పార్కుకు వెళ్లి వస్తానని చెప్పి..

తల్లీ పిల్లలు అదృశ్యం

వెంగళరావునగర్: పార్కుకు వెళ్ళివస్తానని చెప్పిన తల్లీ తన పిల్లలతో అదృశ్యమైన సంఘటన మధురానగర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్ ఎస్‌ఎస్‌సీబీనగర్‌కు చెందిన శ్యామ్యూల్‌రాజ్ టైలరింగ్ చేస్తుంటాడు. అతనికి 2012 మే నెలలో వివాహమైంది. వారికి 8 ఏళ్ళ పాప, 6 ఏళ్ళ బాబు ఉన్నారు. ఆమె ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరింది. సోమవారం ఉదయం యథావిధిగా శ్యామ్యూల్‌రాజ్ తన విధులకు వెళ్ళిపోయాడు. భార్య పిల్లలు స్కూల్‌కు వెళ్ళలేదు. భర్త శ్యామ్యూల్‌రాజ్‌కు ఫోన్ చేసి పార్కుకు వెళ్తున్నట్లు తెలిపింది. మధ్యాహ్నం అతను భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో హుటాహుటిన ఇంటికి వెళ్ళి చూడగా ఇంట్లో భార్య పిల్లలు కనిపించలేదు. ఇంట్లో దాచిన రూ.35 వేలు నగదు, 5 తులాల బంగారం మాయమయ్యాయి. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఫలితం లేదు. కాగా జీహెచ్‌ఎంసీలో కార్మికునిగా విధులు నిర్వహించే ఎం.హరి అనే యువకుడు తన భార్యతో మాట్లాడేవాడని, అతనిపై అనుమానం ఉన్నట్టుగా బాధితుడు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగదు కాజేసిన వాచ్‌మెన్

వెంగళరావునగర్: లాకర్‌లో దాచి ఉంచిన నగదును వాచ్‌మెన్ తస్కరించాడని ఓ వ్యాపారి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లో నివాసం ఉండే డి.అనంత్‌నాగ్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయన నివాసం ఉండే గ్రౌండ్‌ఫ్లోర్‌లో వ్యాపార లావాదేవీలు నడుస్తుంటాయి. నగదు కూడా ఆ గదిలోనే ఉంచేవాడు. అప్పుడప్పుడు నగదు మాయం అవుతుండేది. దీంతో భయపడి సీసీ టీవీని అమర్చాడు. ఈనెల 1వ తేదీన వాచ్‌మెన్ నాగేందర్ తన ఆఫీస్ తాళాలను ఒరిజినల్ కీని ఉపయోగించి తెరిచి లాకర్‌లో ఉంచిన నగదు తస్కరించాడు. గతంలో కూడా రెండు కార్లలో ఉంచిన నగదును దొంగిలించాడు. ఇప్పటి వరకు రూ.5.85 లక్షలు కాజేసినట్టు బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శుక్రవారం, 9, ఆగస్టు, 2024

కేశాల లేమి పరిష్కారం కోసం ఆరాటం



నగరంలో 25 నుంచి 35శాతం వరకూ వృద్ధి చెందిన మార్కెట్

ట్రీట్‌మెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకుంటే సమస్యలే..

హెయిర్.. కేర్..

బట్టతలను దాటి విస్తరించిన హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

చిన్న వయస్సులోనే జుట్టు రాలడం, బట్టతల మాత్రమే కాదు.. ఇప్పుడు శరీరంలో పలు అవసరమైన చోట్ల కేశాలను కోల్పోవడం/లేకపోవడం కూడా సమస్యలుగానే భావిస్తున్నారు. ఆధునికుల్లో సౌందర్య పోషణ పట్ల పెరిగిన ప్రాముఖ్యత నేపథ్యంలో అవసరమైన చోట కేశాల లేమి సమస్యలకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను అనేకమంది పరిష్కారంగా ఎంచుకుంటున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో



ప్రస్తుతం హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను పొందుతున్న వినియోగదారుల్లో 25–45 ఏళ్ల మధ్య వయస్కులే ఎక్కువ. ముంబై, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల్లో ఈ మార్కెట్ 25–30శాతం వార్షిక వృద్ధి నమోదు చేస్తోంది. బట్టతలకు మాత్రమే కాకుండా కనుబొమలు, మీసాలు, గెడ్డం కోసం కూడా మగవారు అలాగే నుదుటి భాగంలో జుట్టు పలచబడటం (ఫిమేల్ ప్యాటర్న్ బాల్డ్‌నెస్) వంటి కారణాలతో మహిళలు ఈ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆశ్రయిస్తుండటంతో ఈ మార్కెట్ రోజురోజుకూ విస్తరిస్తోంది.

యూనిట్ వారీగా వ్యయం..

ఒకచోట నుంచి హెయిర్ స్ట్రిప్ కట్ చేసి చేసే ఎఫ్‌యుటి, స్ట్రిప్‌తో సంబంధం లేకుండా చేసేది ఎఫ్‌యుఇ పేరిట రెండు రకాల ట్రాన్స్‌ప్లాంటేషన్ పద్ధతులున్నాయి. కేశాలనేవి ఒకటిగా కాకుండా 3, 4 చొప్పున మొలుస్తాయి కాబట్టి వాటిని ఫాలిక్యులర్ యూనిట్‌గా పిలుస్తారు. ఒక్కో యూనిట్‌ను పర్మనెంట్ హెయిర్ ఉన్న చోట నుంచి తీసి అవసరమైన చోట అమర్చడానికి యూనిట్‌కు రూ.50 నుంచి రూ70 వరకూ వ్యయం అవుతుంది. ఈ లెక్కన చూసుకుంటే బట్టతల సమస్య పరిష్కారానికి కనీసం రూ.70వేల నుంచి రూ.లక్ష వరకూ ఖర్చుపెట్టాలి. కనుబొమలు తదితర చిన్నచిన్న ట్రాన్స్‌ప్లాంటేషన్ తక్కువ వ్యయంతో రూ.10, రూ.15వేల వ్యయంతో గంట, రెండు గంటల్లోనే పూర్తవుతుంది. అయితే తలభాగం మీద పూర్తిస్థాయిలో చేయాలంటే ఒక పూట నుంచి ఒక రోజు మొత్తం క్లినిక్‌లో ఉండాల్సి రావొచ్చు. ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం కొంత కాలం అధిక టెంపరేచర్‌కు గురికాకుండా జాగ్రత్తపడటం వంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

అర్హత లేమితో అనర్థాలు...

తక్కువ రెమ్యునరేషన్‌తో సరిపుచ్చడానికి.. పలు క్లినిక్‌లు అర్హత లేని వ్యక్తుల ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు చేస్తున్నాయి. దీంతో శరీరంపై మచ్చలు పడటం, బేసి వెంట్రుకలు, జుట్టు అపసవ్యంగా పెరగడం దగ్గర నుంచీ తీవ్రమైన ఇన్‌ఫెక్షన్, జుట్టురాలడం వరకు ఏ పరిస్థితినైనా ఎదుర్కోవాల్సి రావొచ్చు. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో డెర్మటాలజిస్ట్‌లకు సైతం అత్యవసరంగా శిక్షణ ఇస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం సరైన నిపుణుల పర్యవేక్షణలో జరిగే చికిత్సలు ఖచ్చితంగా సురక్షితమే.





అరకొర శిక్షణతో.. నో..

హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి క్లిష్టమైన సౌందర్య ప్రక్రియలను నిర్వహించడానికి యూట్యూబ్ లేదా ఇతర ప్లాట్ ఫారమ్‌లలో శిక్షణ వీడియోలను చూస్తే సరిపోదని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) తేల్చి చెప్పింది. సర్జికల్ అసిస్టెంట్/టెక్నీషియన్లు (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) పర్యవేక్షణలో ఇవి చేయాలని సూచించింది. సౌందర్య ప్రక్రియలేవీ అత్యవసర శస్త్రచికిత్స కిందకు రావు. శిక్షణ లేని వ్యక్తి చేయడానికి అనుమతి లేదని స్పష్టం చేసింది.

వైద్యంతో పరిష్కారం కాకపోతేనే..

వంశపారంపర్యంగా వచ్చే బట్టతల విషయంలో ఎలా ఉన్నా మిగిలిన చోట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు వెళ్లే ముందు తప్పకుండా వైద్య పరమైన పరిష్కారం అన్వేషించాలి. ఉదాహరణకు కనుబొమ్మలు కోల్పోతే.. అల్ట్రా వయెలెంట్ లైట్ వినియోగించి మాగ్నిఫైయింగ్ లెన్స్‌లను వినియోగించి దానికి కారణాన్ని గుర్తించాలి. చికిత్సకు అవకాశం ఉంటే చేయాలి. లేని పక్షంలోనే ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎంచుకోవాలి. అవకాశం ఉంటే కొన్ని మందులు అప్లై చేసి చూస్తాం. స్టిరాయిడ్ క్రీమ్స్ కూడా వినియోగిస్తాం.. ఎల్ఎల్ఎల్‌టి, లో లెవల్ లేజర్ థెరపీతో కూడా వెంట్రుకలు పెరిగే అవకాశం ఉంటుంది. ఏదేమైనా.. సమస్యను సరైన విధంగా నిర్ధారించి అవసరం మేరకు చికిత్స చేసే అర్హత కలిగిన వైద్యుడి దగ్గరే చేయించుకోవాలి. లేకపోతే ఇతరత్రా ఆరోగ్య సమస్యలకూ కారణం కావొచ్చు.



- డా.జాన్ వాట్స్, డెర్మటాలజిస్ట్, సీనియర్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్

చిరుధాన్యాలే.. ప్రీతిపాత్రమై..



నా హృదయంలో హైదరాబాద్‌కు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. నా సినిమా కెరీర్‌కు బీజం పడింది ఇక్కడే.. అంటూ తన అభిమానాన్ని తరచూ చాటుకుంటారు బహుభాషా నటి రకుల్ ప్రీతిసింగ్. అందుకే ప్రస్తుతం ఆమె టాలీవుడ్‌కు దూరంగా ఉన్నా, నగరానికి మాత్రం దగ్గరగానే ఉంటున్నారు. ఇటీవలే కొండాపూర్‌లో తన 2వ మిల్లెట్ రెస్టారెంట్ 'ఆరంభం'ను ఆమె ప్రారంభించారు. మే నెలలో మాదాపూర్‌లో తొలి రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసిన ఆమె కేవలం 2నెలల్లోనే మరొకటి సిటిజనులకు అందుబాటులోకి తేవడం గమనార్హం. తెలుగు సినిమాల్లో అడపాదడపా మాత్రమే కనిపిస్తూ బాలీవుడ్ ప్రముఖుడ్ని పెళ్లాడి ముంబైలో నివసిస్తున్న రకుల్ ప్రీతిసింగ్.. నగరంతో తన అనుబంధాన్ని మాత్రం కొనసాగిస్తున్నారు. ఫిట్‌నెస్ లవర్ రకుల్.. గతంలో నగరంలో ఎఫ్–45 పేరిట జిమ్స్ నెలకొల్పిన సంగతి తెలిసిందే. ఇప్పటిదాకా నగరంలో అనేక మంది సినీ ప్రముఖులు రెస్టారెంట్స్, పబ్స్ ఏర్పాటు చేసినప్పటికీ.. ఆరోగ్యాభిలాషుల్ని దృష్టిలో ఉంచుకుని ఫిట్‌నెస్ సెంటర్లూ, మిల్లెట్ రెస్టారెంట్లూ నెలకొల్పిన క్రెడిట్ మాత్రం రకుల్ దక్కించుకున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో

సెల్ఫ్ లాండ్రీ మెషిన్స్ @ఐఐటీ హైదరాబాద్



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు అత్యాధునిక సేవల్ని దగ్గర చేయడంతో పాటు వారి సమయాన్ని సద్వినియోగం చేసేందుకు వీలుగా సెల్ఫ్ లాండ్రీ మెషిన్లను ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసినట్లు ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు తెలిపారు. తమ లాండ్రీ క్రూ యాప్‌ను వినియోగించి పూర్తి ఆటోమోటివ్ మోడ్‌లో దుస్తులు స్వీకరించడం నుంచి బిల్లింగ్ దాకా అన్నీ ఒకేచోట పూర్తయే విధంగా సేవలు అందించే 5 మెషిన్లు ఐఐటీ హైదరాబాద్‌కు అందించడం జరిగిందని, దాదాపుగా 500 మంది విద్యార్థులకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు.

బ్యూటీ.. తనివి'టీరా'..



గచ్చిబౌలి: కొరియన్ బ్యూటీ సెన్సేషన్, ఈట్యూడ్ తన మొదటి ఈవెంట్ కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్‌లోని అత్యాధునిక టీరా స్టోర్‌లో గురువారం నిర్వహించారు. అందం, ఆవిష్కరణల ఉత్సాహభరితమైన వేడుకగా దీన్ని నిర్వహించారు. అసమానమైన నైపుణ్యంతో సందర్శకులను మంత్రముగ్ధులను చేసిన ప్రఖ్యాత మేకప్ ఆర్టిస్ రిహన్నా నిర్వహించిన ప్రత్యేకమైన మాస్టర్ క్లాస్ ఈవెంట్‌గా దీన్ని నిర్వహించారు. రిహన్నా అద్భుతమైన మేకప్ రూపాన్ని సృష్టించింది. అది అప్రయత్నంగా పగలు నుంచి రాత్రికి మారుతుంది. ఈ సందర్భంగా మేకప్ చేసే పనులు అందరినీ ఆకట్టుకున్నాయి.

కదిలిన కావ్యం

సేవా కార్యక్రమాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- వారాంతాల్లో పేదలకు అండగా..
- 'చార్వ్య' పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ఉద్యోగం.. ఆకర్షణీయమైన వేతనం.. ఆర్థికంగా అన్ని విధాలా స్థిరపడిన కుటుంబం.. ఇలాంటి సమయంలో యువత ఏం ఆలోచిస్తుంది.. మహా అయితే చర్మ సౌందర్యం.. బ్రాండెడ్ దుస్తులు, కార్లు, సెలవు రోజుల్లో రిలాక్స్ కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులతో ప్రత్యేకంగా వీకెండ్ ప్లాన్స్ చేసుకుంటారు. దానికితోడు విలాసవంతమైన జీవితం కోరుకోవడం సహజం. అయితే హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావ్య మాత్రం పేద పిల్లలను చదివిస్తూ, ఆకలితో ఉన్నవారికి పట్టెడు అన్నం పెట్టి ఆకలి తీరుస్తూ, నాణ్యమైన దుస్తులు అందిస్తున్నారు. వారం రోజులు పనిదినాల్లో ఉద్యోగ బాధ్యతలతో బిజీగా ఉండే ఆమె సెలవు రోజుల్లో సేవా కార్యక్రమాలపై దృష్టిసారిస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో


ఆమె ఆలోచనలకు కుటుంబ సభ్యులు ఆమోదం తెలుపుతుండగా, సహచర ఉద్యోగులు సైతం సహకరిస్తున్నారు. 2019లో ప్రముఖ సంస్థలో ఆమె సాఫ్ట్‌వేర్ సంస్థలో చేరారు. కరోనా సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి 200లకుపైగా కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అక్కడి నుంచి సేవా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇదే క్రమంలో 2020లో చారిటీ విజిట్స్ యు ఆల్వేజ్ (చార్వ్య) పేరిట స్వచ్ఛంద సంస్థ స్థాపించారు. సెలవు దినాల్లో కార్యక్రమాలు నడిపిస్తున్నారు.

మురికివాడలే లక్ష్యంగా..

నగర పరిధిలోని మురికి వాడలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, వలస కార్మికులు ఉండే ప్రాంతాలే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. ముందుగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో సుమారు ఎంత మంది జనం సాయం కోసం ఎదురు చూస్తున్నారు? వాళ్ల అవసరాలు తెలుసుకొని, అందుకు అనుగుణంగా సిద్ధమవుతున్నారు. ఆహారం, దుస్తులు, దుప్పట్లు, స్వెటర్లు, నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కుటుంబసభ్యులు, స్నేహితులు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ఆ ఆనందం వెలకట్టలేనిది..

ఆకలితో ఉన్న వారికి భోజనం పెట్టడం, దుస్తులు, ఇతర సరుకులు అందించడం సంతోషంగా ఉంది. ఆ ఆనందం వెలకట్టలేనిది. ఇతరులు మంచి జీవితాన్ని పొందడానికి నా వంతు సాయం అందిస్తున్నా. నాకున్న అవకాశాల్లో ఒక మార్గం ఎంచుకొని ముందుకెళ్తున్నా.. కుటుంబ సభ్యులు సరే నీ ఇష్టం అన్నారు. నా వేతనం మొత్తాన్నీ చారిటీకే వెచ్చిస్తున్నాను. మరింత మందికి సాయం చేసే అవకాశం కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.
- కావ్య, చార్వ్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు



హోప్ ఇన్ ఎ కప్ కేఫ్ @ మైండ్‌స్పేస్



మాదాపూర్: ఎల్‌జీబీటీ కమ్యూనిటీకి మద్దతుగా మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌లో గురువారం హోప్ ఇన్ ఎ కప్ కేఫ్‌ను ఓపెన్ టెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ నాగ్‌పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఫ్‌లో పని చేసే కమ్యూనిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఇదంతా సీఎస్ఆర్‌లో భాగమన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మయూర్ పట్నాల మాట్లాడుతూ కమ్యూనిటీని శక్తివంతం చేయడం, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.



ఇనార్బిట్‌మాల్‌లో.. నైట్ అవుట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సైబరాబాద్‌లో ఉన్న ఇనార్బిట్ మాల్ నైట్ అవుట్ పేరిట రాత్రి 12.30గంటల వరకూ విభిన్న రకాల వినోద కార్యక్రమాలను సందర్శకుల కోసం సమర్పిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన ప్రముఖ స్టాండప్ కమెడియన్ రోహిత్ స్వైన్ షో నిర్వహిస్తున్నట్లు మాల్ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా ఈనెల 10న బాలీవుడ్ రాక్‌బ్యాండ్ బ్యాండ్ పనాహ్ సంగీత ప్రదర్శన, 11న ప్రఖ్యాత సితార్ వాద్యకారుడు స్వయం సిద్ధ, ప్రియదర్శి మధ్య ఆసక్తికరమైన మ్యూజికల్ ఫ్యూజన్.. వగైరా ఈవెంట్లు ఉంటాయని, రాత్రి 9గంటల సమయంలో ఇవి ప్రారంభం అవుతాయని వివరించారు. షాపర్స్‌స్టాప్, లైఫ్‌స్టైల్, మార్క్స్ అండ్ స్పెన్సర్, రేర్ రాబిట్, ట్రూ రిలిజియన్, పాంటలూన్స్, మ్యాక్స్, అమెరికన్ ఈగిల్, లెవీస్, వెరో మోడా, టామీ హిల్‌ఫిగర్, రోస్సో బ్రూనెల్లో వంటి ప్రముఖ బ్రాండ్‌ల ప్రత్యేక ఆఫర్లు అందుకోవచ్చన్నారు.

ఇంట్లోనే.. రిలీఫ్..

డయాబెటిస్‌పై పోరుకు మెడిసినల్ ప్లాంట్స్ సాయం
ఇంట్లోనే స్వయంగా పెంచుకుంటున్న నగరవాసి




ఇన్సులిన్ మొక్క

డయాబెటిస్, బీపీ తదితర దీర్ఘకాలిక వ్యాధులు నగరవాసులకు వీడని నీడలుగా మారుతున్నాయి. వైద్యసాయం తీసుకుంటున్నా, మందులు వాడుతున్నా.. తగ్గేదెలే.. అన్నట్టుగా వదలకుండా వెంటాడుతున్న వ్యాధుల విషయంలో కొందరు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా ఇంట్లోనే మెడిసినల్ ప్లాంట్స్‌ను సైతం పెంచుకుంటున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో

రక్తంలో చక్కెర స్థాయిలు, మధుమేహాన్ని నియంత్రించడానికి, ఇన్సులిన్ సహా అనేక రకాల మందులు చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అయితే కారణాలేవైనా.. కొందరు ప్రత్యామ్నాయ విధానాలను ప్రయత్నిస్తున్నారు. మధుమేహంతో పోరాడేందుకు ఔషధ మొక్కలను పెంచుతున్నారు మాజీ సాఫ్ట్‌వేర్ నిపుణుడు మొట్టమర్రి సందీప్.

టెర్రస్‌లో.. ట్రీట్‌మెంట్

ఇన్సులిన్ మొక్క ఆకులు మధుమేహం నిర్వహణలో ఉపయోగపడతాయని, ఇన్సులిన్ మొక్కల ప్రయోజనాలను గుర్తించి, వాటిని మొహిదీపట్నంలోని తన ఇంటి టెర్రస్‌పై సేంద్రీయంగా పెంచడం ప్రారంభించారు సందీప్. తన మధుమేహం చికిత్స కోసం ఈ సహజమైన విధానాన్ని ఆయన అనుసరించాడు. తన టెర్రస్‌ను ఆరోగ్యానికి తోటగా మార్చాడు. మందులు, ఇంజెక్షన్లకు బదులు ఇన్సులిన్ ఆకులను తీసుకోవడం ద్వారా, ఏడు సంవత్సరాలుగా తన మధుమేహాన్ని అదుపులో ఉంచుకోగలిగానని ఆయన అంటున్నారు. 'నేను మందులు మానేసి ఏడేళ్లుగా ఇన్సులిన్ మొక్క ఆకులను తీసుకుంటున్నాను. దాంతో ఈ ఏడేళ్లలో డాక్టర్‌ను కలవాల్సిన అవసరం రాలేదు' అని ఆయన చెప్పారు. ఆయన చెబుతున్న ప్రకారం.. ఇన్సులిన్ ప్లాంట్ తగిన స్థాయిలో పరిపక్వానికి చేరేందుకు దాదాపు నాలుగు నెలల సమయం పడుతుంది.



మొట్టమర్రి సందీప్

పెంపకం.. పంపకం..

ఇన్సులిన్ మొక్కలతో పాటు అతను కొన్ని కూరగాయలతో పాటు రణపాల వివిధ రకాల తులసి వంటి ఇతర ఔషధ మొక్కలను కూడా ఆయన పెంచుతున్నారు. ఆయన దగ్గర ఉన్న మెడిసినల్ ఇన్సులిన్ ప్లాంట్ల గురించి ఆ నోటా.. ఈ నోటా విని సుదూర ప్రాంతాల నుంచీ కాల్స్ వస్తుంటాయన్నారాయన. ఓపికగా మొక్క ప్రయోజనాలను వివరిస్తానని, మొక్కలను తీసుకెళ్లడానికి వచ్చే వ్యక్తులకు నామమాత్రపు ధరకు వాటిని అందిస్తూనే, మొక్కలను పెంచే చిట్కాలను చెప్తానన్నారు. 'ఆకులను క్రమం తప్పకుండా తీసుకున్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు క్షీణించడాన్ని గమనించినట్లు చాలా మంది సంతోషం వ్యక్తం చేశారు' అని ఆయన చెప్పారు. అయితే ఒక రోజులో 2 కంటే ఎక్కువ ఆకులను వాడొద్దని ఆయన సలహా ఇస్తారు. అధిక మోతాదు కారణంగా సంభవించే ప్రమాదాలను నివారించడానికి ఉదయం ఒక ఆకు సాయంత్రం మరో ఆకును తీసుకోవాలని సూచిస్తున్నారు.



పుదీనా

క్లుప్తంగా...

డెంగీతో విద్యార్థిని మృతి



నర్సంపేట రూరల్ : డెంగీతో ఓ విద్యార్థిని మృతి చెందింది. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని 23వ వార్డుకు చెందిన గండికోట వెంకట్– స్వరూప దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె నందిని (12) మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఓ ప్రభుత్వ గురుకుల హాస్టల్‌లో 7వ తరగతి చదువుతోంది. ఈనెల 2వ తేదీన జ్వరం రాగా ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం అర్ధరాత్రి ఎంజీఎం నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

జ్వరంతో వివాహిత

మంగపేట : ములుగు జిల్లా మంగపేట మండలంలోని రమణక్కపేటకు చెందిన తెల్ల ప్రవళిక(25) జ్వరంతో మృతి చెందింది. వారం రోజుల క్రితం ప్రవళికకు జ్వరం రాగా, ఆర్‌ఎంపీ వద్ద చూపించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

డీఏ విడుదలకు వినతి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దామాషా పద్ధతిలో కరువు భత్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పర్వత్ రెడ్డి, సదానందంగౌడ్ కోరారు. సంఘ నేతలు గురువారం భట్టిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జూలై 2022 నుండి 14.56 శాతం మేర నాలుగు విడతల డీఏ మంజూరు చేయాల్సి ఉన్నా.. ఇంతవరకూ విడుదల చేయలేదని వివరించారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో కరుణాకర్ రెడ్డి, దాసరి శ్రీధర్ ఉన్నారు.

ఒంగోలులో ఈవీఎంల మాక్ పోలింగ్‌కు ఈసీ గ్రీన్‌సిగ్నల్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గంలో ఓటింగ్ సరళి, ఈవీఎంల పనితీరులో అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం తదితర అంశాలపై వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈవీ ఎంల పనితీరును తిరిగి పరిశీలించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. నియోజక వర్గంలోని 12 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల మాక్ పోలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 6, 26, 42, 59, 75, 76, 123, 184, 192, 199, 245, 256 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను పరిశీలించనున్నారు. మాక్ పోలింగ్ నిర్వహణ కోసం బాలినేని రూ. 5,66,400 ఫీజు కూడా చెల్లించారు. అయితే, ఎన్నికల సంఘం అధికారులు ఫిర్యాదును వెనక్కి తీసుకుంటే డబ్బు తిరిగి ఇస్తామని ఒత్తిడి తీసుకొచ్చినా.. బాలినేని మాత్రం ఈవీఎంల మాక్ పోలింగ్ జరగాల్సిందేనంటూ పట్టుబట్టారు. దీంతో మాక్ పోలింగ్‌కు ఈసీ ఆమోదం తెలిపింది. ఈవీఎంల మాక్ పోలింగ్ పరిశీలనకు ఈ నెల 19 నుంచి 24వ తేదీ మధ్య అధికారికంగా ఒక తేదీని ఎన్నికల సంఘం ఖరారు చేసే అవకాశముందని, మరో రెండు రోజుల్లో ఈ తేదీ ఖరారు అవు తుందని ఎలక్షన్ విభాగం అధికారులు తెలిపారు.

రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం

అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై చీకట్లో పచ్చమూకల దాడి

సాక్షి ప్రతినిధి, విజయవాడ : సామాజిక అభ్యున్నతి ద్వారానే దళిత వర్గాల తలరాత మారుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నినదించి గురువారం నాటికి సరిగ్గా 95 ఏళ్లు. అణగారిన వర్గాలకు మద్దతుగా నాగ్‌పూర్‌లో 1930 ఆగస్టు 8న ఏర్పాటైన మహాసభకు దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ అధ్యక్షత వహించిన రోజే ఆ మహనీయుడి విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికి తలమానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై తెలుగుదేశం మూకలు ఉన్మాదంతో పేట్రేగిపోవడం దేశవ్యాప్తంగా యావత్ దళిత సమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది. స్వయంగా ప్రభుత్వమే పూనుకుని రాజ్యాంగ నిర్మాతపై దాడికి ఉన్మత్త మూకలను ప్రేరేపించడం దేశచరిత్రలో కనీవినీ ఎరుగని దారుణం. గురువారం రాత్రి కుట్రపూరితంగా అంబేడ్కర్ మహాశిల్పం చుట్టుపక్కల విద్యుత్ సరఫరా నిలిపివేయించి, సిబ్బందిని బయటకు తరలించి.. తెలుగుదేశం మూకలు భీంరావ్ అంబేడ్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడ్డాయి. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కొందరు అధికారులు, పోలీసుల సమక్షంలో ఈ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు బరితెగించారు. వీరి మాటలను బట్టిచూస్తే ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతోనే ఎంపిక చేసిన కొందరు అధికారుల సమక్షంలో ఇదంతా జరిగినట్లు స్పష్టమవుతోంది. నిజానికి.. గత సీఎం వైఎస్ జగన్ దీనిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి రూ.404.35 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన చేతుల మీదుగా ఈ ఏడాది జనవరి 19న జాతికి అంకితం చేశారు. అధికారంలోకి వచ్చింది మొదలు 'పచ్చ'మూకలు దీనిపై కన్నేశారు. ఇందులో భాగంగానే పై నుంచి వచ్చిన ఆదేశాలతో గురువారం రాత్రి 9 గంటల తర్వాత పచ్చబ్యాచ్ రంగప్రవేశం చేసింది. అక్కడున్న వారందరినీ బలవంతంగా బయటకు పంపేశారు. అందులో పనిచేసే కొందరి సిబ్బంది ఫోన్లను లాకున్నారు. మరికొందరిని ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోమని బెదిరించారు. ఈ తతంగానికి పోలీసులే కాపాలా కాశారు. విగ్రహం నలుమూ లలా పహారా కాసి, చుట్టూ గేట్లు వేసి అనుకున్న పని మొదలుపెట్టారు. ఇంతలో ఈ సమాచారం బయటకు పొక్కింది. ప్రజలు, మీడియా, అంబేద్కర్ ఆలోచనాపరులు రావడంతో వారంతా పరారయ్యారు. అధికారుల పర్యవేక్షణలోనే ఈ దారుణానికి తెగబడడం గమనార్హం.

పట్టించుకోని సీపీ..

ఈ విషయాన్ని సీపీకి తెలిపేందుకు మీడియా ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. ఘటనా స్థలికి ఆయన హుటాహుటిన చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం దుర్మార్గం అని ఆయన మండిపడ్డారు. ఇలాంటి చర్యలు మంచివి కాదన్నారు. అలాగే, ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో మండిపడుతున్నారు. మరోవైపు.. పచ్చమూకల దాడిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గుర్తుగా అక్కడ ఏర్పాటుచేసిన బోర్డులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న స్టీల్ మెటల్ అక్షరాలు ధ్వంసమయ్యాయి. వీటిని సుత్తులతో కొట్టి మరీ ధ్వంసం చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

చంద్రబాబుకు ఎలాంటి విలువలు లేవు

న్యాయం, ధర్మం పాటించని వ్యక్తి ■ అందుకే మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ

నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్

- తన స్వార్థం కోసం చంద్రబాబు ఏమైనా చెబుతాడు.. ఏదైనా చేస్తాడు
- అలాంటి దుర్మార్గ వ్యక్తితో మనం యుద్ధం చేస్తున్నాం



> అధికార, ధనబలంతో చంద్రబాబు చేస్తున్న ప్రతి పనీ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి చేయాల్సినది కాదు. నాయకుడు అనేవాడు ఇంత అధ్వానంగా ఉంటాడా.. అన్న స్థాయిలో ఆయన పని చేస్తున్నాడు. ఇలాంటి వ్యక్తులతో మనం యుద్ధం చేస్తున్నాం. కష్టకాలంలో తోడుగా నిలబడ్డ ప్రతికార్యకర్తకు కచ్చితమైన గుర్తింపు వస్తుంది. నేను కోరేది ఒక్కటే. ప్రజలకు మనం దగ్గరగా, తోడుగా ఉంటే వారే చంద్రబాబును నామరూపాల్లేకుండా చేసే పరిస్థితి వస్తుంది. ప్రజలే దండలు వేసి మనల్ని పిలిచే రోజు వస్తుంది.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

> ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఆ వ్యక్తికి ధర్మం, న్యాయం అనే పదాలకు అర్థం తెలిసి ఉండాలి. ఆ స్థాయి వ్యక్తి అడుగులు వేసేటప్పుడు సమాజం చూస్తూ ఉంటుంది కాబట్టి, మనం ఏం చేస్తున్నాం అన్నది ఆలోచించాలి. కానీ చంద్రబాబునాయుడికి న్యాయం, ధర్మం ఏవీ లేవు. దురదృష్టవశాత్తు మనం ఈ దుర్మార్గుడితో యుద్ధం చేస్తున్నాం. తన స్వార్థం కోసం ఏమైనా చెబుతాడు.. ఏదైనా చేస్తాడు.

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ టీడీపీ పోటీ చేస్తోందంటే దానర్థం ప్రజా ప్రతినిధుల కొనుగోలుకు సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లేనని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విలువలు, విశ్వసనీయతే మన బలమని, మనమంతా కలిసికట్టుగా ఒక్కటిగా ఉండే పార్టీ మనదని అందరికీ తెలిసిందేనని చెప్పారు. న్యాయం, ధర్మం తెలియని చంద్రబాబు అనే దుర్మార్గుడితో మనం యుద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ యుద్ధంలో మన అభ్యర్థి బొత్స సత్యనారాయణను మంచి మెజార్టీతో గెలిపించి, మన ప్రతిష్టను పెంపొందించేలా సహాయ సహకారాలు అందించాలని నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో తొలుత నర్సీపట్నం.. ఆ తర్వాత పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే..

టీడీపీకి మెజార్టీ లేకున్నా పోటీ

ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజారిటీ ఉంది. మన పార్టీ నుంచి 600కు పైగా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఉంటే.. అదే టీడీపీ నుంచి గెలిచిన వారు 200కు పైబడి మాత్రమే ఉన్నారు. వాళ్లకు, మనకు మధ్య 387 స్థానాల తేడా ఉంది. అంత తేడా ఉన్నప్పుడు మామూలుగా సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అక్కడ పార్టీ నుంచి అభ్యర్థిని పెట్టకూడదు. కానీ, అక్కడ టీడీపీ పోటీ చేస్తోందంటే దానర్థం.. ప్రజా ప్రతినిధుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే.

అన్నీ మోసపూరిత హామీలు

గత ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి ముఖ్యమంత్రి అయ్యాడు. సూపర్ సిక్స్ అన్నాడు. ఇప్పుడు అవి కూడా అమలు చేయకుండా మోసం చేస్తున్నాడు. నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు అని ఇంటింటా ప్రచారం చేశాడు. ఇప్పుడు అవేవీ అమలు చేయకుండా మోసం చేస్తున్నాడు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబులా మనం కూడా హామీలు ఇవ్వాలని నాపై ఒత్తిడి తెచ్చారు. మన పార్టీ గెలుపు కోసమే వారు నాకు ఆ సలహాలిచ్చారు. కానీ, అబద్ధాలు చెప్పి గెల్చి, ఆ కిరీటాన్ని నెత్తిన పెట్టుకుంటే ఏం సంతృప్తి ఉంటుంది? అమలుకు సాధ్యం కాకపోయినా హామీలు ఇస్తే గెలుస్తాం. ముఖ్యమంత్రి అవుతాం. కానీ ఆ తర్వాత కార్యకర్తలు మొదలు ఎమ్మెల్యేల వరకు గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉంటుందా? 'జగన్ మాట ఇచ్చి, అమలు చేయలేదు' అనే మాట అనిపించుకోకూడదు. మన పార్టీ పేరు చెబితే కార్యకర్తలు, నాయకులు కాలర్ ఎగరేసుకునేలా ఉండాలి. దాని కోసమే నేను తాపత్రయపడ్డాను. అందుకే ఏనాడూ మోసపూరిత హామీలు ఇవ్వలేదు. 2014లో కూడా చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చి, మాట తప్పాడు. రైతులు రుణాల మాఫీ, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రుణాల మాఫీ, ఇంటింటికీ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అని రకరకాలుగా చెప్పాడు. ఆ రోజుల్లో రుణమాఫీ చేద్దామని చెప్పాలంటూ నామీద కూడా ఒత్తిడి వచ్చింది. చేయలేనిది చెప్పలేమని చెప్పాను. ఆ తర్వాత ఎన్నికలు అయిపోయి, చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన అన్ని రకాలుగా మోసం చేశాడని ప్రజలకు అర్థం అయింది. అందుకే 2019లో ఆయన డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ప్రజలే మనకు శ్రీరామరక్ష

2019లో మనం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టాం. మన పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పథకాన్ని ఏటా, కేలండర్ ప్రకటించి మరీ అమలు చేశాం. అందుకే ఈ రోజు కూడా మనం ధైర్యంగా చెప్పగలం. ఏం చేశామో చెప్పుకోగలిగాం. రాజకీయాల్లో ఎవరైనా, ఎప్పుడైనా ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. కష్టకాలంలో మనం ఎలా ఉంటున్నామనేది ప్రజలు చూస్తారు. ఆ ప్రజలే మనకు శ్రీరామరక్షగా ఉంటారు. విలువలు కోల్పోయిన రోజు మనకు ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతతో మనం అడుగులేశాం. కష్టాలు లేకుండా ఏదీ ఉండదు. చీకటి వచ్చిన తర్వాత కచ్చితంగా వెలుగు రాక మానదు. కష్టాల్లో ఉన్నప్పుడు కూడా.. ఫలానా వాడు మన నాయకుడు అని చెప్పుకునే రీతిలో మనం ఉండాలి. అప్పుడు మనం కచ్చితంగా పై స్థానానికి ఎదుగుతాం.

ఏమిటీ చుక్కెదురు?

విశాఖ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల గురించి 'ఈనాడు'లో అదేదో ఘన కార్యం చేసినట్లు 'వైఎస్సార్‌సీపీకి చుక్కెదురు' అని పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు. ఏం చుక్కెదురు? చంద్రబాబుకు మెజార్టీ లేని చోట కొనుగోలు చేసి, స్టాండింగ్ కమిటీలో నువ్వు గెలిస్తే.. అదో ఘనకార్యం అన్నట్టు వైఎస్సార్‌సీపీకి చుక్కెదురా? చంద్రబాబు బ్రహ్మాండం అని రాస్తావు.. ఎందుకు? ప్రలోభాలు పెట్టినందుకా? పోలీసుల్ని పెట్టి, భయపెట్టి, దుర్వినియోగం చేసి కార్పొరేటర్ల ఓట్లు వేయించుకున్నందుకా? ఎందుకు బ్రహ్మాండం? ఇదా ఘన కార్యం? దొంగతనం, హత్యలు చేస్తే ఘనకార్యం అని రాసేట్టు ఉన్నారు. అదీ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబునాయుడి పరిస్థితి. ఒక అబద్ధం చెప్పడం.. అదే అబద్ధాన్ని మళ్లీ, మళ్లీ పెద్దది చేసే చెత్త కార్యక్రమం. అన్యాయం చేస్తూ.. అదేదో ఘనకార్యం చేసినట్లు పెద్ద పెద్ద అక్షరాలతో రాస్తున్నారు.

బీఆర్‌ఎస్ నేతలు నిరాశతో విషం కక్కుతున్నారు: సంపత్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఒడిపోయిన నైరాశ్యంలో ఏం మా ట్లాడుతున్నారో అర్థంకాని స్థితిలో బీఆర్‌ఎస్ నాయకు లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై విషం కక్కుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన పై బీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, క్రిశాంక్ చేసిన విమర్శలను తిప్పి కొట్టారు. తెలంగాణలో ఉద్యోగాల కల్పన కోసం చేస్తున్న కృషిలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లారనిసంపత్ అన్నారు. అది ఓర్వలేక సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులపై బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం జరిగినప్పుడు కాంగ్రెస్ ఇన్‌చార్జిగా తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారని, కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను ఆయనే చూస్తున్నారని వివరించారు. రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ఆస్ట్రేలియా టూర్ అధికారిక పర్యటన కాదని స్పష్టం చేశారు. అలాగే మరో సోదరుడికి అమెరికాలో 'స్వచ్ఛ్ బయో'అనే కంపెనీ ఉందని, దాని మీద పెట్టుబడులు పెడతానన్నారని తెలిపారు. వీటిపై రాజకీయం చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కావాలని కేటీఆర్ కోరుకుంటే, బాల్క సుమన్, క్రిశాంక్‌లు అందుకు విరుద్ధంగా మాట్లాడడం చూస్తుంటే, కేటీఆర్‌కు వాళ్లకు మధ్య చెడినట్లుందని ఎద్దేవా చేశారు.

ఢిల్లీకి వస్తే విలీనం చేసినట్లా?

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: తమ పార్టీ నేతలు ఢిల్లీ వస్తే బీఆర్‌ఎస్‌ను బీజేపీలోకి విలీనం చేస్తున్నట్లా? ఇది అసలు నమ్మేలా ఉందా? ఈరకమైన అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఆయన గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేల అనర్హత అంశంపై న్యాయ కోవిదులను కలిసేందుకు తమ పార్టీ నేతలు ఢిల్లీ వస్తున్నారే తప్పా.. పార్టీ విలీనానికి కాదని స్పష్టం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో రెండు పార్లమెంటు సీట్లు సాధించిన బీజేపీ, 10–15 ఎమ్మెల్యే సీట్లు కలిగిన కాంగ్రెస్‌ల పని అయిపోయిందా?, అంచెలంచెలుగా వాళ్లు ఎదగలేదా? అని ప్రశ్నించారు. ప్రజలు పదేళ్లు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చారని.. ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని.. రాబోయే రోజుల్లో మళ్లీ తమ కు అవకాశం ఇస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. ప్రజలు అవకాశం ఇస్తే అభివృద్ధి కోసం పాటుపడతామని, ఇవ్వకపోతే ప్రతిపక్షంలో ఉండి ప్రజల గొంతుగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

ఒకటో తేదీన అందరికీ అందని వేతనాలు

బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, అందరికీ అందడం లేదని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కొన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు మినహా మిగతావారికి ప్రతీ నెలా 9 నుంచి 15వ తేదీ నడుమ వేతనాలు ఇస్తున్నారన్నారు. తెలంగాణభవన్‌లో రాకేశ్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు లేవని, మోడల్ స్కూల్ టీచర్లకు నెలల తరబడి వేతనాలు అందడం లేదని చెప్పారు. మరోవైపు జూనియర్, డిగ్రీ కాలేజీల గెస్ట్ లెక్చరర్లు వేతనాల పెంపు కోసం ఆందోళన, ఆశ వర్కర్లు ధర్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వేతన సవరణ, హెల్త్ స్కీమ్‌పై ప్రభుత్వం మౌనం వీడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని రాకేశ్‌రెడ్డి తెలిపారు.


నీట మునిగిన సుంకిశాల పంప్‌హౌస్

కృష్ణా వరద తాకిడికి కూలిన కాంక్రీట్ రిటైనింగ్ వాల్

- క్షణాల్లో 42 అడుగులు మునిగిన ఇన్‌టేక్ వెల్
- కూలీలు షిఫ్టు మారే సమయంలో ఘటన.. లేదంటే భారీగా ప్రాణనష్టం
- వారం రోజులైనా బయటకు పొక్కనీయని అధికారులు



కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ కూలుతున్న దృశ్యాలు



నీట మునిగిన సుంకిశాల పంప్‌హౌస్

సాక్షి, హైదరాబాద్ /పెద్దవూర : సుంకిశాల వద్ద నిర్మిస్తున్న భారీ ఇన్‌టేక్ వెల్ పంపింగ్ స్టేషన్ నీటమునిగింది. సొరంగంలోకి నీరు రాకుండా రక్షణగా నిర్మించిన కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ ఒక్కసారిగా కుప్పకూలడంతోనే ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే అదృష్టవశాత్తు కూలీలు షిఫ్టు మారే సమయంలో ప్రమాదం జరగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటన ఈనెల ఒకటో తేదీన ఉదయం 6.30 గంటలకు జరిగినా అధికారులు బయటకు పొక్కనీయలేదు.

కృష్ణానదికి వరద వస్తుందని అంచనా వేయకపోవడంతోనే...

డెడ్ స్టోరేజీలో ఉన్న నాగార్జునసాగర్ జలాశయంలోకి వరద నీరు ఇప్పట్లో రాదనే ఆలోచనతోనే రెండో దశ సొరంగం పూర్తిస్థాయిలో ఓపెన్ చేసి పనులు చేపట్టినట్టు తెలిసింది. ఇంజనీర్ల అంచనాలోపంతో ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. సాగర్ జలాశయానికి లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్న ఈ సమయంలో సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేయకుండా ఉండాల్సిందని నిపుణులు పేర్కొంటున్నారు. సొరంగంలోకి నీరు రాకుండా ఏర్పాటు చేసిన రిటైనింగ్ వాల్, సొరంగంలో చేపడుతున్న బ్లాస్టింగ్‌కు దెబ్బతినడంతో పగుళ్లు వచ్చి వరద తాకిడికి ఒక్కసారిగా కూలిపోయిందంటున్నారు. మరోవైపు రెండోదశ టన్నెల్‌లో రక్షణ గోడ వెనుక గేటు అమర్చిన అధికారులు పంప్‌హౌస్ స్లాబ్ పూర్తయిన తర్వాత దాని నుంచి గేటుకు టైబీమ్స్ నిర్మించాల్సి ఉందని, ఆ పనులు పూర్తయిన తర్వాత సొరంగాన్ని ఓపెన్ చేస్తే ఈ ప్రమాదం జరిగేది కాదని మరికొందరు అంటున్నారు.

ఘటనపై గోప్యత ఎందుకు?

ఘటన జరిగి వారంరోజులు గడిచినా విషయం బయటకు పొక్కకుండా అధికారులు ఎందుకు గోప్యత పాటించారనే ప్రశ్న తలెత్తుతోంది. మూడు షిఫ్టుల వారీగా కూలీలచే పనులు చేయించాల్సి ఉన్నా, రెండు షిఫ్టుల్లోనే పనులు చేపడుతున్నారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఒక షిఫ్టు, సాయంత్రం ఆరు నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు వరకు మరో షిఫ్టు చేయిస్తున్నారు. షిఫ్టు మారే సమయంలో కూలీలు అంతా బయటకు వెళుతున్న వేళ నీటి ఉధృతికి రక్షణ గోడ కూలిపోయి, గేట్లు అమర్చేందుకు సుమారు 40 అడుగులకుపైగా ఎత్తులో చేపట్టిన నిర్మాణం అంతా కూలిపోయింది. దీంతో మరో షిఫ్టులో పనికి రావాల్సిన కూలీలు ఇది చూస్తూ భయంతో కేకలు వేసినట్టు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

పనుల నాణ్యతపై అనుమానాలు

పనులు పూర్తికాకముందే కాంక్రీట్ పిల్లర్లతో కూడిన నిర్మాణం పేకమేడలా కూలిపోయింది. అదే నిర్మాణం పూర్తయి మోటార్లు బిగించిన తర్వాత కూలిపోతే రూ.కోట్లలో నష్టం వాటిల్లేదని నిపుణులు పేర్కొంటున్నారు. జలాశయ నీటిమట్టం 450 అడుగుల లోతుకు సమాన లోతులో తీసిన బావిచుట్టూ పెద్దరాయి ఉంది. నిర్మాణం చేసే సమయంలో కింది నుంచి పక్కనున్న రాయికి రంధ్రాలు చేసి కడ్డీలతో పిల్లర్లను జాయింట్ చేస్తూ నిర్మిస్తున్నారు. అయినా పనుల్లో నాణ్యత లేకపోవడంతోనే అంత ఎత్తులో ఉన్న నిర్మాణం వరద తాకిడికి కుప్పకూలిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వారమైతే పనులు పూర్తయ్యేవి : ప్రాజెక్టు మేనేజర్

వారం రోజులైతే పనులు పూర్తయ్యేవని ప్రాజెక్టు మేనేజర్ నర్సిరెడ్డి తెలిపారు. జలాశయంలో నాలుగైదు మీటర్ల లోతు నీటిమట్టం తగ్గగానే రక్షణగోడ నిర్మించి పంప్‌హౌస్‌లో చేరిన నీటిని తొలగించే పనులు చేపడతామని చెప్పారు.

విచారణకు కమిటీ ఏర్పాటు

రిటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జలమండలిస్థాయిలో ఉన్నత ఇంజినీర్లతో ఒక విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. సభ్యులుగా జలమండలి ఈడీ, రెవెన్యూ డైరెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ ఉంటారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది.

ఇదీ ప్రాజెక్టు ఉద్దేశం..

నాగార్జునసాగర్ జలాశయం డెడ్ స్టోరేజీలో ఉన్నా జంట నగరాలకు భవిష్యత్ తాగునీటి అవసరాల దృష్ట్యా రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పనులకు 2022 మే 14వ తేదీన నాటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు శంకుస్థాపన చేశారు. నగర విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2035 నాటికి 47.71 టీఎంసీలు, 2050 నాటికి 58.98 టీఎంసీలు, 2065నాటికి 67.71 టీఎంసీలు, సరిగ్గా 50 ఏళ్ల నాటికి 2072లో 70.97 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని అంచనాతో సుంకిశాల ఇన్‌టేక్ వెల్ పంపింగ్ స్టేషన్‌ను ఎమర్జెన్సీ పంపింగ్ అనే సమస్య లేకుండా నిర్మిస్తున్నారు..

సుంకిశాల పాపం బీఆర్‌ఎస్‌దే: భట్టి విక్రమార్క

'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంసహా కృష్ణా ప్రాజెక్టును వదల్లేదు. మేడిగడ్డ మాదిరే సుంకిశాలను మార్చేసింది. తను చేసిన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తుంది. కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తుంది' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. గురువారం మింట్ కాంపౌండ్‌లో మీడియాతో మాట్లాడారు. 'నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. జూలై 2023న టన్నెల్ సైడ్‌వాల్ పూర్తి చేసింది. ఇప్పటివరకు కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల మాత్రమే నాసిరకం అని అనుకున్నాం. మిగిలినవి బాగా ఉన్నాయని భావించాం. తీరా సుంకిశాలను చూస్తే అన్నీ నాసిరకమైనవేనని అర్థమైంది. వారు గోదావరిని మాత్రమే కాదు కృష్ణాను కూడా వదిలిపెట్టలేదు. సుంకిశాల పాపం పూర్తిగా నాటి బీఆర్‌ఎస్‌దే. సైడ్ వాల్ కూలిన ఘటనపై అధికారులు విచారణ చేస్తున్నారు. దోషులు ఎవరో త్వరలోనే తేలుస్తాం' అని డిప్యూటీ సీఎం అన్నారు.

సుంకిశాల అవసరం లేదని ఆనాడే కేటీఆర్‌కు చెప్పా : గుత్తా

హైదరాబాద్ జంట నగరాలకు నీరిచ్చేందుకు చేపట్టిన 1.5 టీఎంసీ సామర్థ్యం కలిగిన సుంకిశాల ప్రాజెక్టు అవసరం లేదని తాను ఆనాడే అనధికారికంగా కేటీఆర్‌కు చెప్పానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

● అభిప్రాయం



'అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలాహ్యారిస్ గెలుస్తుంది. ఆమె గెలుపు మహిళాశక్తిని నిరూపిస్తుంది' అంటున్నారు **లత మంగిపూడి.** అమెరికాలోని న్యూహ్యాంప్‌షైర్‌కు డెమోక్రటిక్ పార్టీ లెజిస్లేటర్‌గా ఉన్న లత ప్రస్తుతం కమలా హ్యారిస్ గెలుపు కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు. అమెరికా మహిళల గురించి స్త్రీలకు ఉండాల్సిన దృక్పథం గురించి ఆమె తన అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

హ్యారిస్ గెలిచి మహిళాశక్తిని గెలిపిస్తుంది

'ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలో ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. అమెరికన్స్ మరోసారి ట్రంప్ నియంతృత్వ పాలనను అంగీకరించేందుకు ఏ మాత్రం సిద్ధంగా లేరు. కమలా హ్యారిస్ గెలిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ. అందుకే 'సేవ్ అవర్ డెమోక్రసీ' అనే నినాదంతో మేం ప్రజల్లోకి వెళ్తున్నాం. కమలా హ్యారిస్ అమెరికా మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడతారని బలంగా నమ్ముతున్నాను' అన్నారు లత మంగిపూడి.

మైసూరుకు చెందిన లత రాజమండ్రికి చెందిన కృష్ణ మంగిపూడిని వివాహం చేసుకోవడంతో ఆంధ్రప్రదేశ్ వాసి అయ్యారు. 1985లో యూఎస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అనంతరం యూఎస్ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ న్యూహ్యాంప్‌షైర్ చాప్టర్‌కు 2006 నుంచి 2013 వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగారు. అలా ఆమె రాజకీయ జీవితం మొదలైంది. అప్పటి అధ్యక్షుడు ఒబామా, హిల్లరి క్లింటన్ వంటి ప్రముఖులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత 2013 నుంచి ఇప్పటివరకు నాషువా నుంచి లెజిస్లేటర్‌గా గెలుపొందుతూనే ఉన్నారు. కమలాహ్యారిస్ గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తూ పర్యటనలు చేస్తున్నారు.


కమలా హ్యారిస్‌తో లత మంగిపూడి

స్త్రీల హక్కులకు విఘాతం

'ప్రపంచంలో ఏ మహిళకైనా తన శరీరంపై తనకు పూర్తి హక్కు ఉండాలి. ఆమె తన ఆరోగ్యాన్ని కాపాడుకొనే అవకాశం ఉండాలి కదా. కానీ అమెరికాలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల్ని కనాలా, వద్దా అనే అత్యంత కీలకమైన అంశంపైన మహిళలు తమ హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గర్భం దాల్చిన తరువాత తప్పనిసరిగా బిడ్డను కనాల్సిందే. కానీ బిడ్డను కనేందుకు ఆమె మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యరీత్యా సంసిద్ధంగా ఉండాలి. ఇది బిడ్డను కనాల్సిన తల్లి, డాక్టర్ నిర్ణయించవలసిన విషయం. ఇందులో ప్రభుత్వ జోక్యం అవసరం లేదు. కానీ బలవంతంగానైనా పిల్లలను కనాల్సిందేననడం సరి కాదు. అత్యాచారానికి గురైన వారు, లైంగిక దాడుల వల్ల గర్భవతులైన వాళ్లు కూడా బిడ్డల్ని కనాలంటే ఎలా? అమెరికా మహిళలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న ఈ అంశంపై డెమోక్రటిక్ పార్టీ స్పష్టమైన వైఖరిని కలిగి ఉంది. మా పార్టీ గెలిస్తేనే మహిళల హక్కులకు రక్షణ లభిస్తుంది' అన్నారామె.

ఇంకా వివక్షేనా....

'విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు లభించడం లేదు. స్త్రీలు తీవ్ర నిర్లక్ష్యానికి, వివక్షకు గురవుతున్నారు. చివరకు కొన్నిచోట్ల ఓటు హక్కును కూడా వినియోగించుకోలేని పరిస్థితి. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకొనే వాతావరణానికి రిపబ్లికన్ పార్టీ విఘాతం కలిగిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఓటుహక్కును పొందిన వాళ్లు, ఇమ్మిగ్రెంట్స్, కొన్నిచోట్ల మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకొనే అవకాశం లేదు. ఆ పార్టీ మరో సారి గెలిస్తే ఓటుహక్కు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ఈసారి మహిళా గెలుపు ప్రజాస్వామిక గెలుపు' అని ముగించారామె.

- పగిడిపాల ఆంజనేయులు
సాక్షి, హైదరాబాద్

మీరూ మీ వార్డ్రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్రోబ్ శీర్షికన ప్రచురిస్తాం. మా చిరునామా: మై వార్డ్‌రోబ్ , సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. sakshifamily3@gmail.com

మై వార్డ్‌రోబ్


ప్రతిమ రాపర్తి

ధోతీ కట్టు మూడు రంగుల్లో ముగ్గు

హస్త కళలపై ఇష్టంతో చిత్రలేఖనం, బ్లాక్ ప్రింటింగ్ నేర్చుకుంది. చదివింది ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్. చేనేత కారులకు అండగా ఉండాలని చర్ఖా సంస్థను ప్రారంభించింది. మువ్వన్నెల జెండా రంగులు... మధ్యన మన సంస్కృతికి చిహ్నమైన ముగ్గును చిత్రించి, చేనేత వస్త్రంతో కండువాను డిజైన్ చేసింది. పేటెంట్ హక్కునూ పొందింది. తన హ్యాండ్లూమ్ చీరలను ధోతీ కట్టులా డిజైన్ చేసి, వాటినే తన రోజువారీ డ్రెస్‌గా మార్చుకుంది. సికింద్రాబాద్ మారేడుపల్లిలో ఉంటున్న **ప్రతిమ రాపర్తి** తన వార్డ్‌రోబ్‌ను సరికొత్తగా మార్చుకుంది.

'ప్రపంచానికి కాటన్ దుస్తులను మన దేశమే పరిచయం చేసింది. మనదైన సంస్కృతిని మనమే పరిచయం చేసుకోవాలి. అలాగే మనల్ని అందరూ గుర్తించాలి. ఈ ఆలోచనే చేనేతలకు దగ్గరగా ఉండేలా చేసింది. 2018లో 'చర్ఖా' పేరుతో చేనేతలకు మద్దతుగా నిలవాలని సంస్థను ప్రారంభించాను.

ట్రై కలర్స్‌లో ముగ్గు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ట్రై కలర్స్ డ్రెస్ ధరించి వెళ్లడానికి చాలా కష్టపడేదాన్ని. ఆరెంజ్, బ్లూ, గ్రీన్ కలర్స్ ఉండేలా డ్రెస్సింగ్ చేసుకునేదాన్ని. అలా కాకుండా ఆ రోజుకి ఏదైనా ప్రత్యేకమైన యునిఫామ్ ఉంటే బాగుంటుంది అనుకున్నాను. చేనేత క్లాత్‌ను ఎంపిక చేసుకొని, అంచుగా వాటికి నేచురల్ కలర్స్‌ని జత చేశాను. మూడు రంగుల మధ్యలో ఉండే ధర్మచక్ర మన అడ్మినిస్ట్రేషన్‌కి, విజడమ్‌కి ప్రతీక. ధర్మచక్రను మన డ్రెస్సుల్లో వాడకూడదని, దాని బదులుగా ముగ్గు డిజైన్ చేశాను. ముగ్గు అనేది మన సంస్కృతికి, స్త్రీల కళా హృదయానికి ప్రతీక.

25 చుక్కలు...

మధ్య చుక్క ఈ డ్రెస్ ఎవరు ధరిస్తారో వారికి ప్రతీక. మిగతా 24 చుక్కలు మన పూర్వీకులు, కాలానికి ప్రతీకగా అనుకోవచ్చు. అలాగే, ఆ చుక్కలన్నీ కలుపుతూ వెళితే మన సమాజ వృద్ధికి, రాబోయే తరానికి సూచికగానూ ఉంటాయి. ఈ డిజైన్‌ని కండువా, శారీ, ధోతీ, ఘాఘ్రా చోళీకి తీసుకున్నాను. దీనికి పేటెంట్ రైట్ కూడా తీసుకున్నాను. ఈ డిజైన్ కండువాను ఎవరైనా ధరించవచ్చు.

చేనేత చీరలతో ధోతీ కట్టు

నా దగ్గర ఎక్కువగా ఉన్న హ్యాండ్లూమ్ చీరలని ప్రత్యేక కట్టుగా మార్చుకోవాలనుకున్నాను. సౌకర్యంగా ఉండేలా చీరలను ధోతీగా కన్వర్ట్ చేసుకున్నాను. సెల్, మనీ, కార్డ్స్ పెట్టుకోవడానికి ఈ ధోతీకి పాకెట్స్ కూడా ఉంటాయి. పూర్వం రోజుల్లో గోచీకట్టు చీరలను వాడేవారు. ఆ డిజైన్ ప్రతిఫలించేలా నాకు నేను కొత్తగా డిజైన్ చేసుకున్న డ్రెస్సులివి. టూర్లకు, బయటకు ఎక్కడకు వెళ్లినా ఇలాంటి డ్రెస్‌తోనే వెళతాను. నాకు నేను ప్రత్యేకంగా ఉండాలనుకుంటాను. వీవర్స్, టైలర్స్, బ్లాక్‌ప్రింట్, హ్యాండ్‌క్రాఫ్ట్స్ వారితో కలిసి వర్క్ చేస్తాను. ఇకో ఫ్రెండ్లీ హ్యాండీ క్రాఫ్ట్, టైలరింగ్, పెయింటింగ్... వంటివి గృహిణులకు నేర్పిస్తుంటాను'' అని వివరించారు ప్రతిమ.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి


● ఒలింపిక్ లెజెండ్

సింహం మెడలో మేక...

విమర్శలకు చాలా మంది కుంగిపోతుంటారు. ఆమెరికన్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్ అయిన సిమోన్ అరియన్నే బైల్స్ ఓవెన్స్ మాత్రం విమర్శలనే సవాల్‌గా తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇటీవల జరిగిన ఆల్‌రౌండ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. దీంతో తొమ్మిది ఒలింపిక్ పతకాలు, 30 ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు ఆమె ఖాతాలో చేరి, ప్రపంచంలోనే అత్యధిక ఒలింపిక్ పతకాలు సాధించిన ఐదవ మహిళా ఒలింపిక్ జిమ్నాస్ట్‌గా పేరొందిందామె. 27 ఏళ్ల సిమోన్ విజయం సాధించిన వెంటనే తన మెడలో మేక లాకెట్టుతో ఉన్న చైన్‌ను బయటకు తీసి అందరికీ చూపించింది. 'చాలా మంది నన్ను 'గోట్' అని పిలుస్తుంటారు. నేను దానిని నెగిటివ్‌గా తీసుకోలేదు. ఈ గోట్‌లో కూడా ప్రత్యేకత ఉంది, అది ప్రపంచానికి చూపించాలనుకున్నాను. అందుకే 'స్టఫ్డ్ గోట్'ను హారంగా మెడలో ధరించాను' అంటూ గోట్ లాకెట్‌ను చేత్తో పట్టుకొని చూపిస్తూ అంది సిమోన్ బైల్స్.

తొమ్మిదవ ఒలింపిక్ పతకాన్ని, ఆరవ స్వర్ణాన్ని సంపాదించినందుకు సిమోన్ ప్రదర్శనలో అభినందనలు దక్కాయి. అయితే, 2021లో జరిగిన టోక్యో గేమ్స్ నుండి చివరి నిమిషంలో వైదొలగడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె చేష్టల కారణంగా మరొక క్రీడాకారిణికి అవకాశం లేకుండా పోయిందని, జాత్యహంకారం, సెక్సిస్ట్, ట్రాన్స్‌ఫోబిక్, డ్రగ్ చీట్... అని ఎంతో మంది చేత నాడు విమర్శలను ఎదుర్కొంది. దీంతో కుటుంబంలో వచ్చిన సమస్యలు, మానసిక సమస్యలతో పోటీల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. అయినా ఆమెపైన విమర్శలు ఆగలేదు. ఆ సందర్భంలో ఆమెను 'గోట్' అంటూ హేళన చేశారు. అదే ఆమె ఇప్పుడు తన బలంగా మార్చుకుని, దాంతోనే పతకాన్ని సాధించ గలిగింది.


యారోస్లావా మహుచిక్
ఫీనిక్స్

యుద్ధం ఆమెకు సలాం చేసింది

ఉక్రయిన్ పై రష్యా బాంబుల వర్షం కురిపిస్తూనే ఉంది. కాని ఆ దేశం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు పతకాలు గెలిచి యుద్ధాన్ని చిన్నబుచ్చుతూనే ఉన్నారు. హైజంప్‌లో బంగారు పతకం సాధించిన యారోస్లావా ఏ క్షణంలో ఏ వార్త వినవలసి వస్తుందో అన్న ఆందోళనలో కూడా లక్ష్యాన్ని తప్పలేదు. యుద్ధం ఆమెకు సలాం చేసింది.

యుద్ధం చేసిన గాయంతో ఇంకా ఆ దేశం కన్నీరు కారుస్తూనే ఉంది. బాంబులు, బుల్లెట్లు చిందించిన రక్తంతోనే అక్కడి ప్రజలు ఇప్పటికీ సూర్యోదయాన్ని చూస్తున్నారు. రష్యా దురాక్రమణతో ఉక్రెయిన్ ధ్వంసమయ్యి రెండేళ్లు దాటింది. కాని ఆ దేశ క్రీడాకారుల మనోబలాన్ని మాత్రం యుద్ధం దెబ్బతీయలేకపోయింది. మీరు మాపై తుపాకులు ఎక్కుపెట్టి యుద్ధం చేస్తే.. మేం బంగారు పతకాలతో శాంతి సందేశాన్ని అందిస్తామంటూ ప్రపంచానికి సగర్వంగా చాటి చెబుతున్నారు ఉక్రెయిన్ క్రీడాకారులు. హై జంప్‌లో బంగారు పతకం సాధించిన 22 ఏళ్ల యారోస్లావా మహుచిక్ వారిలో ఒకరు.

నిలువనీడ లేకపోయినా...

ప్రశాంతంగా సాగుతున్న యారోస్లావా జీవితాన్ని యుద్ధం ఆందోళనలో పడేసింది. నిత్యం దూసుకొచ్చే క్షిపణులు ఆమెకు రెండున్నరేళ్లుగా నిలువ నీడలేకుండా చేశాయి. తూర్పు ఉక్రెయిన్‌లోని సొంతూరు నిప్రో నుంచి బయటపడి వివిధ దేశాల్లో తలదాచుకుంది. తల్లితండ్రి అక్క అప్పుడప్పుడూ తనను కలిసేందుకు వచ్చేవారు. వారిని చూశాక ఆమె మనసు మరింత కకావికలమయ్యేది. వారు వెళ్లిపోయాక ఏ క్షణాన ఏ వార్త వినాల్సిందోనన్న భయం ఆమెను వెంటాడేది. ఇంట్లో ఉన్నపుడు పక్కన బాంబులు పడుతుంటే 'నాన్నా బేస్‌మెంట్‌లోకి వెళ్దామా అంటే.. ఇంకా భయపడి పారిపోవడంలో అర్థం లేదు. నాలాగే ఎంతోమంది ప్రాణాల మీద ఆశలు వదిలేసుకునే బతుకుతున్నారు తల్లీ' అన్న తండ్రి మాటలు వద్దంటున్నా గుర్తుకువచ్చేవి. యుద్ధం ఆమెను వెంటాడుతూనే ఉండేది. నేలకొరుగుతున్న దేశ సైనికులు..రోడ్డున పడుతున్న ఉక్రెయిన్ ప్రజలు కళ్ల ముందు కదులుతూనే ఉన్నారు. వాటి మధ్యే ఆమె శిక్షణ కొనసాగిస్తూ వచ్చింది.

విషాదగీతాలు మరిచేలా...

స్లీపింగ్ బ్యాగ్, యోగా మ్యాట్‌ను ఎప్పుడూ తనతో తెచ్చుకునే మహుచిక్ ఆట విరామ సమయంలో స్టేడియంలో విశ్రాంతి తీసుకుంటూ ఆకాశంలోకి చూస్తూ దేశం గురించే ఆలోచించేది. యుద్ధ విషాద గీతాలు మరుగున పడేలా ప్రజల్లో చైతన్యం నింపేలా దేశానికి పతకం అందించాలని కలలు కనేది. హైజంప్ మ్యాచ్‌లో ప్రత్యర్థితో తలపడే సమయంలోనూ ఆమె మనసు నిండా యుద్ధ దృశ్యాలే. చివరకు ఆమె పోరాట స్ఫూర్తి గెలిచింది. ఎంతటి భీకర యుద్ధమైనా ఆశలను, ఆశయాలను తుడిచిపెట్టేయలేదని నిరూపించింది. వ్యక్తిగత హోదాలో దేశానికి ఆమె సాధించిపెట్టిన తొలి గోల్డ్‌మెడల్ ఉక్రెయిన్ ప్రజల భవిష్యత్తుకు నిజంగా ఓ ఆశా కిరణమే.



యారోస్లావా మహుచిక్ ఒక్కరే కాదు.. పారిస్ ఒలంపిక్స్‌లో పతకాలు సాధిస్తున్న ఇతర ఉక్రెయిన్ క్రీడాకారులు యుద్ధం కారణంగా నిస్సత్తువగా మారిన ఆ దేశ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఇంతకాలం యుద్ధం కారణంగా రక్తంతో తడిసిన దేశంలో పతకాల సుమాలు పూయిస్తున్నారు.

ఒలింపిక్స్ జరుగుతున్నా...

''ఒలింపిక్ క్రీడలు శాంతి సందేశాలు. కానీ రష్యా ఇలాంటి క్రీడలు జరుగుతున్న సమయంలోనూ మా దేశంపై దాడులు ఆపకపోగా మరింత ఉధృతం చేసింది. చిన్నపిల్లల ఆసుపత్రిపై క్షిపణులు కురిపించడంలోని క్రౌర్యం మాటలకందనిది'' అంది యారోస్లావా మహుచిక్.

ఒలింపిక్స్ క్రీడాకారులు ఏం తినాలి! ఎంత తినాలి!!


హెల్దీ డైట్

వంద గ్రాములు... మనదేశానికి ఒక బంగారు పతకాన్ని దూరం చేసింది. బంగారు పతకంతో పాటు బంగారంలాంటి క్రీడాకారిణి మనోధైర్యాన్ని దెబ్బతీసింది. బరువు లెక్కలు ఇంత కచ్చితంగా పాటించే ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తీసుకునే ఆహారం ఎలా ఉండాలనే వివరాలను అందించారు న్యూట్రిషనిస్ట్, వెల్‌నెస్ కోచ్ డాక్టర్ కరుణ.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒలింపిక్స్ క్రీడాకారుల ఆహారం చాలా నిశితమైన పరిశీలనతో డిజైన్ చేస్తారు. వాళ్ల ఆరోగ్యం, సంబంధిత క్రీడకు అవసరమైన మోతాదులో పోషకాలు సమృద్ధిగా అందేలా ఆహారం ఉంటుంది. కేలరీలు, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫ్యాట్స్ వంటి మ్యాక్రో న్యూట్రియెంట్స్, ఐరన్, క్యాల్షియం, విటమిన్ డీ, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్స్ (సోడియం, పొటాషియం, క్లోరైడ్) వంటి మైక్రో న్యూట్రియెంట్లు అందాలి. క్రీడాకారుల డైట్‌లో దేహానికి ఒక రోజుకు అవసరమైన కేలరీలలో 55–65 శాతం కార్బోహైడ్రేట్ల రూపంలోనే ఉంటుంది. శ్రమను బట్టి రోజుకు 2 వేల నుంచి 10 వేల కేలరీల వరకు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రొటీన్లు దేహం బరువును బట్టి కేజీకి 1.2 నుంచి 2 గ్రాములు అందాలి. ఆరోగ్యకరమైన ఫ్యాట్ శక్తినివ్వడంతో పాటు హార్మోన్ ఉత్పత్తికి దోహదం చేస్తుంది. దేహానికి అందాల్సిన కేలరీల్లో 20 నుంచి 30 శాతం ఫ్యాట్ రూపంలో ఉండాలి. మారథాన్, స్విమ్మింగ్‌కి శిక్షణ నిడివి ఎక్కువ ఉంటుంది. క్రీడను బట్టి కూడా పోషకాల అవసరం మారుతుంది.

హార్మోన్ల సమతుల్యత!

వీటన్నింటితోపాటు నిద్ర, ఒత్తిడి చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. క్రీడాకారిణులకు ఎనిమిది గంటల మంచి నిద్ర తప్పనిసరి. నిద్రలేనప్పుడు హార్మోన్ల సమతుల్యత లోపించడం, ఒత్తిడి, బరువు మీద ప్రభావం చూపిస్తుంది. ఒత్తిడిని ఎదుర్కోవడంలో మగవాళ్లకు మహిళలకు మధ్య తేడా ఉంటుంది. మానసికమైన ఒత్తిడి, భావోద్వేగాలు వారి సమర్థమైన ప్రదర్శన మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికి మెడిటేషన్, బ్రీత్ ఎక్సర్‌సైజ్, కృతజ్ఞత, క్షమ, పరిస్థితిని యథాతథంగా స్వీకరించడం వంటివి సాధన చేయాలి.

ఎప్పుడు తినాలి? ఎలా తినాలి?

ఆహారంతోపాటు హైడ్రేషన్, మీల్ టైమింగ్, వర్కవుట్‌కు రెండు – మూడు గంటల ముందు తీసుకోవాల్సిన ఆహారం, వర్కవుట్ సమయం గంటకు మించినప్పుడు మధ్యలో తీసుకోవాల్సిన తక్షణ శక్తినిచ్చే ఆహారం, వర్కవుట్ తర్వాత కండరాల పునర్నిర్మాణం కోసం తీసుకోవాల్సిన ఆహారం మోతాదులు స్పష్టంగా నిర్దేశితమై ఉంటాయి. అయితే బాడీ కంపోజిషన్, మెటబాలిక్ రెస్పాన్స్, ఫుడ్ ఇన్‌టాలరెన్స్ వ్యక్తికీ వ్యక్తికీ మారుతుంటాయి. కాబట్టి సాధారణ నియమావళిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క స్పోర్ట్స్‌పర్సన్‌కి వ్యక్తిగత డైట్ ప్లాన్ సిద్ధం చేయాలి. అలాగే వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్, వీగన్ వంటి వారి వ్యక్తిగత ఆహార విశ్వాసాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఐరన్: రెడ్ మీట్, ఆకు కూరలు, ధాన్యాల ద్వారా శక్తితోపాటు దేహభాగాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది.
క్యాల్షియమ్: వెన్న తీయని పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు ఎముకల పటుత్వానికి దోహదం చేస్తాయి.
విటమిన్–డి: కొవ్వుతో కూడిన చేపలు, తృణధాన్యాలు, సూర్యరశ్మి ద్వారా ఎముకల పటుత్వంతోపాటు వ్యాధినిరోధకత మెరుగవుతుంది.
మెగ్నీషియం: నట్స్, సీడ్స్, పొట్టుతీయని ధాన్యాలు, ఆకుకూరలు శక్తిని పెంచడంతోపాటు కండరాల సంకోచవ్యాకోచాలను సులువు చేస్తాయి.
ఎలక్ట్రోలైట్స్: పండ్లు, కూరగాయలు, పాలు, పాల ఉత్పత్తులు, స్పోర్ట్స్ డ్రింక్‌లు దేహంలో ద్రవాల స్థాయిలను క్రమబద్ధీకరించడంతోపాటు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మోటారు పాఠం.. జపాన్ చేర్చుతోంది!

● సకుర సైన్స్ ఫెస్టివల్‌లో కరీంనగర్ బాలికకు చోటు

బోటనీ పాఠమంటే.. బోరు..బోరు.. హిస్టరీ రొస్టు కంటే రెస్ట్ మేలు.. అని పాడుకుంటే పొరపాటే.. పాఠం సరిగా వింటే విదేశీయానం, విమానమెక్కే యోగం దక్కుతుందని నిరూపించింది కరీంనగర్ జిల్లా శంకరపట్నంకు చెందిన నబా మొహమ్మదీ. ఇటీవల హైదరాబాద్‌లో ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏకంగా ఈ ఏడాది నవంబరులో జపాన్‌లో జరిగే సకుర సైన్స్ ఫెస్టివల్ లో పాల్గొనబోతోంది. ఇదంతా ఎలా సాధ్యమైంది? కేవలం సైన్స్ మీద ఉన్న ఆసక్తి.. మోటారు పాఠం వినడం వల్లే అంటుంది. నబా..! తనకు సైన్స్‌పై ఉన్న ఆసక్తి తనను జపాన్ గడ్డపై కాలు మోపేలా చేస్తుందని 'సాక్షి'కి చెప్పింది.

ఏంటా మోటారు కథ...!

నబా ప్రస్తుతం శంకరపట్నంలోనే ఇంటర్ సెకండియర్ చదువుతోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం తాను 9వ తరగతిలో ఉండగా.. విన్న ఫిజిక్స్ పాఠం తన ఆలోచన తీరును మార్చివేసింది. 8 వ తరగతి వరకు బేసిక్ సైన్స్ విన్న తాను.. తొలిసారిగా మోటారు ఎలా పనిచేస్తుందో తన గురువులు చెప్పిన పాఠానికి ముగ్ధురాలైంది. విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తిని కలిపి మోటారు నడిపే విధానం తెలుసుకోవడం తనకు సైన్స్ ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిన్న సూత్రం ఆధారంగా ప్రపంచంలోని ఎన్నో మోటార్లు ఎలా నడుస్తున్నాయన్న విషయంపై తనకు పూర్తి అవగాహన వచ్చింది. అది మొదలు సైన్స్‌పాఠాలను మరింత శ్రద్ధగా చదువుతూ విశ్లేషణ చేసుకునేది. ప్రతీది తనకు అర్థమయ్యేందుకు అదనపు పుస్తకాలు, యూట్యూబ్ చూసేది. ఇటీవల జిల్లా స్థాయిలో ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కరీంనగర్ నుంచి మొదటి స్థానంలో నిలిచింది. అదే ఊపులో రాష్ట్రస్థాయికి ఎంపికై టాప్-5లో టాప్-2 స్థానం దక్కించుకుంది. ఫలితంగా నవంబరులో జపాన్‌లో జరిగే సుకుర సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశం చేజిక్కించుకుంది.



తాను కూడా ఏదైనా సాధించాలంటే..!

అదే ఉత్సాహంతో తాను కూడా ఏదైనా సాధించాలని తలచింది. అంధులకు దారి చూపేందుకు ప్రత్యేక డివైజ్ రూపొందించింది. ఇది ప్రస్తుతం ప్రోటోటైప్ దశలోనే ఉంది. దీన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికి త్వరలోనే పేటెంట్ కూడా దరఖాస్తు చేసుకుంటానని నబా 'సాక్షి'కి వివరించింది. జపాన్ పర్యటనలో అక్కడ శాస్త్ర సాంకేతిక రంగాలను గమనించి, వాటిని ఇక్కడఅమలు చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపింది. తాను ఈ ప్రగతి సాధించడం వెనక తన తండ్రి షాబీర్, ఫిర్దౌస్ సుల్తానాలు ఎంతో ప్రోత్సహించారని, సంప్రదాయ కుటుంబమైనా, బాలికనైన తనను అన్ని కాంపిటీషన్లకు పంపించారని తెలిపింది. అదే సమయంలో తనకు పాఠాలు చెప్పిన గురువులకు తానెప్పుడూ రుణపడి ఉంటానని, పెద్దయ్యాక శాస్త్రవేత్తనవుతాననీ, అంధులకు చూపునవుతాననీ వారికి దారి చూపేందుకు రూపొందించిన ఉపకరణాన్ని మరింత అభివృద్ధి చేస్తాననీ చెప్పింది. భవిష్యత్తులో శాస్త్రవేత్తగా ఎదగడమే తన కల అని వివరించింది నబా.

- బి. అనిల్‌కుమార్,
సాక్షి ప్రతినిధి, కరీంనగర్



● ఏఐ ఏరియా

ఏఐ చేతులెత్తేసిందా?!

ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంటే ఏ అద్భుతమైనా సాధ్యమే అనుకునేరోజుల్లో ఉన్నాం. చిత్రకళ పోటీల్లోకి కూడా కృత్రిమ మేధస్సు అడుగు పెట్టింది. అయితే అంత పెద్ద 'ఏఐ' కూడా చేతుల ముందు బిక్క చచ్చిపోతుంది. ఏఐ టూల్స్ చేతులను గీయడంలో తడబడుతున్నాయి. ఏఐ–జెనరేటెడ్ హ్యాండ్స్‌లో కొన్నిసార్లు తొమ్మిది వేళ్లు కనిపిస్తాయి. కొన్ని చిత్రాల్లో అయితే అరచేతితో సంబంధం లేకుండా కనిపిస్తాయి.

'హ్యాండ్స్' విషయంలో ఏఐ ఎంత పూర్‌గా ఉందో చెప్పడానికి ఒక ఉదాహరణ డోనాల్డ్ ట్రంప్ అరెస్ట్‌కు సంబంధించిన ఫేక్ ఇమేజ్. ఈ ఏఐ–జనరేటెడ్ ఇమేజ్‌లో పోలీసు అధికారి చేయి ట్రంప్ శరీరంలో కలిసిపోయి కనిపిస్తుంది.

నార్మల్ లుకింగ్ హ్యాండ్స్ విషయంలో 'ఏఐ' ఎందుకు తప్పటడుగు వేస్తుంది? అనే విషయానికి వస్తే...

చేతులు అనేవి మానవ శరీరంలో చిన్న భాగాలు. వేరియబుల్‌గా ఉంటాయి. పిడికిలి బిగించడం, చేయి ఊపడం...మొదలైనవి చేయి ఎలా పనిచేస్తుందో చెప్పే దృశ్య వ్యత్యాసాలు. త్రీ–డైమెన్షనల్ వరల్డ్‌తో యాక్సెస్ లేని 'ఏఐ'కి చేయి ఎలా కనిపిస్తుందో మాత్రమే తెలుసు. బొటన వేలు, పిడికిలి బిగించడం....మొదలైనవి ఏఐకి కష్టతరమైనవి.

'ఏఐకి చేయి అంటే చెయి మాత్రమే. అరచేయి, వేళ్లు, గోర్లు...ఇలాంటి వాటి గురించి దానికి తెలియదు. ఇప్పటి 2డీ ఇమేజ్ జనరేటర్‌లు హ్యాండ్స్‌కు సంబంధించిన త్రీ–డైమెన్షనల్ జామెట్రీని అర్థం చేసుకోలేపోతున్నాయి' అంటున్నాడు యూనివర్శిటీ కాలేజీ లండన్‌లోని కంప్యూటర్ సైంటిస్ట్ పీటర్ బెంట్లీ. మరి ఈ సమస్యకు పరిష్కారం లేదా? జవాబు బెంట్లీ మాటల్లోనే...

'భవిష్యత్‌లో ఈ సమస్యకు తప్పకుండా పరిష్కారం దొరుకుతుంది. త్రీడీ జామెట్రీలపై శిక్షణ మొదలైంది. ప్రస్తుతం 2డీ ఇమేజ్‌కు సంబంధించిన ఫలితాలు సులభంగా అందుబాటులో ఉన్నాయి. తగినంత 3డీ డిజైన్ డేటాను పొందడానికి మాత్రం సమయం పడుతుంది'

మిస్ యూనివర్స్ బరిలో యువ ఆర్మీ ఆఫీసర్






'మిస్ మిచిగాన్'గా సుపరిచితురాలైన అల్మా కూపర్ 'మిస్ యూఎస్ఏ 2024' కిరీటాన్ని గెలుచుకుంది.

నవంబర్‌లో జరగనున్న '2024 మిస్ యూనివర్స్' పోటీ కోసం సన్నద్ధమవుతోంది. 'యునైటెడ్ స్టేట్స్ మిలిటరీ అకాడమీ'లో గ్రాడ్యుయేట్ అయిన కూపర్ 'మిస్ మిచిగాన్ యూఎస్' కిరీటం దక్కించుకున్న తొలి యాక్టివ్ డ్యూటీ ఆర్మీ ఆఫీసర్.


వలస కార్మికురాలి కుమార్తె అయిన అల్మా కూపర్ కష్టపడుతూ, ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆర్మీ ఆఫీసర్ అయింది. అందాల పోటీలపై ఆసక్తి ఉన్న కూపర్‌కు సామాజిక స్పృహ కూడా ఎక్కువే. 'ఆహార అభద్రత సమస్యను పరిష్కరించడానికి, ప్రజలందరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చేపట్టే కార్యక్రమాలలో క్రియాశీలంగా పాల్గొంటాను' అని చెబుతుంది 22 ఏళ్ల అల్మా కూపర్.

● యంగ్ టాలెంట్



పారిస్ యంగెస్ట్ ఒలింపియన్

పారిస్ ఒలింపిక్స్‌లో చైనాకు చెందిన స్కేట్ బోర్డర్ జెంగ్ హావోహావో అత్యంత పిన్న వయస్కురాలైన ఒలింపియన్‌గా చరిత్ర సృష్టించింది. జెంగ్ వయసు పదకొండు సంవత్సరాలు. ఏడు సంవత్సరాల వయసులో స్కేట్ బోర్డింగ్ మొదలు పెట్టింది. 2022లో గ్వాంగ్డాంగ్ ప్రావిన్షియల్ గేమ్స్‌లో పార్క్ స్కేట్ బోర్డింగ్ ఈవెంట్‌లో జెంగ్ విజేతగా నిలిచింది. 'వేగంగా నేర్చుకొని తనదైన శైలిలో ప్రతిభ ప్రదర్శించడం జెంగ్ సొంతం' అంటున్నాడు జెంగ్ కోచ్. సరదాగా మొదలు పెట్టిన స్కేట్‌బోర్డింగ్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో జెంగ్‌కు పేరు తీసుకువచ్చింది.



మేక్ ఏ బీలైన్ ఫర్

ఏదైనా చేయడానికి వేగంగా ముందుకు వెళ్లే సందర్భంలో, అదేపనిగా లక్ష్యంపై దృష్టి పెట్టడానికి సంబంధించి వాడే మాట...మేక్ ఏ బీలైన్ ఫర్.

ఉదా: వన్స్ టికెట్స్ వెంట్ ఆన్ సేల్ ఫర్ ది మూవీ, ఫ్యాన్స్ మేడ్ ఏ బీలైన్ ఫర్ ది టికెట్ ఆఫీస్.

మై టు సెంట్స్

ఒక సమస్య లేదా విషయానికి సంబంధించి 'ఇది నా అభిప్రాయం ' 'ఇది నా సూచన' అని వినమ్రంగా చెప్పే సందర్భంలో వాడే మాట...మై టు సెంట్స్.

ఉదా: జస్ట్ మై టు సెంట్స్, బట్ ఐ థింక్ వి షుడ్ రీకన్‌సైడర్ ది ప్రపోజల్.

● గేమింగ్



వస్తున్నాడు...రణతేజంతో

యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ బ్లాక్‌మిత్: వుకోంగ్ ఈ నెల 20న విడుదల అవుతుంది. క్లాసికల్ చైనీస్ నవల 'జర్నీ టు ది వెస్ట్'ను స్ఫూర్తిగా చేసుకొని ఈ గేమ్‌ను రూపొందించారు. ప్లేయర్ 'రుయి జింగ్ బాంగ్' అనే వానరాన్ని కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. చెవిలో నించి తీసిన చిన్న పిన్ పెద్ద ఆయుధంగా మారుతుంది. మేఘాలలో నుంచి దూసుకువస్తున్న శక్తులతో పోరాడడానికి వానరం సిద్ధమవుతుంది...ఇలాంటి దృశ్యాలతో వచ్చిన 'బ్లాక్‌మిత్' ప్రీ–ఆర్డర్ సీజీ ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 5 **మోడ్:** సింగిల్ ప్లేయర్ **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్.

యువర్స్

● స్టార్ స్టైల్

కళల్లో రాణించాలన్నదే కల

మాయా నెల్లూరి ఫిల్మ్ ఆర్టిస్ట్. రణరంగం, తిమ్మరుసు చిత్రాలలోనూ అనగనగా (వెబ్‌సిరీస్), కృష్ణ ఘట్టంలో కథానాయికగానూ నటించింది. చిత్రకారిణి.. పురాణేతిహాసాల మూలాంశాలతో ఆకట్టుకునే పెయింటింగ్స్ వేస్తుంది. రైటర్.. 'స్టార్ స్టైల్ ' పేరుతో 80 ఏళ్ల సినిమా తారల ఫ్యాషన్స్‌ని పుస్తకం రూపంలో తీసుకువచ్చింది.
సైకాలజీలో డిగ్రీ పట్టా అందుకున్న మాయా నెల్లూరి హైదరాబాద్ అమ్మాయి. మల్టీటాలెంటెడ్ గర్ల్‌గా పేరుతెచ్చుకున్న ఈ హార్టిస్ట్‌ను కలిసినప్పుడు గలగలా నవ్వుతూ సినిమాయే తన ప్రపంచమని, సాధించాలనుకుంటున్న కలల గురించి ఎన్నో విశేషాలను ఇలా మన ముందుంచింది...



● మాయా నెల్లూరి

'మా అమ్మానాన్నలు నేను జాబ్ చేయాలనుకున్నారు. నా ఇష్టం మాత్రం సినిమా రంగం వైపే ఉంది. అమ్మ న్యూజిలాండ్‌లో ఆప్తమాలజిస్ట్. దీంతో చిన్నప్పుడే మా కుటుంబం ఆస్ట్రేలియాలో స్థిరపడిపోయింది. న్యూజిలాండ్‌లోనే సైకాలజీలో డిగ్రీ చేశాను. సినిమా అంటే ఉన్న ఇష్టంతో అమ్మ వాళ్లను ఒప్పించి తిరిగి హైదరాబాద్ వచ్చేశాను. ఎలాంటి ఫిల్మ్ బ్యాక్‌గ్రౌండ్ లేదు. సౌత్ స్కోప్ మ్యాగజైన్‌కు ఆర్టికల్స్ రాసేదాన్ని. అక్కణ్ణుంచే నాకు సినిమా వాళ్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. అలా, సినిమాలోనూ నన్ను నేను నిరూపించుకోవాలనుకున్నాను. స్టార్స్‌కి కాస్ట్యూమ్ డిజైనర్‌గా, 'ఐడియల్ బ్రెయిన్'కి రైటర్‌గానూ ఉన్నాను.

80 ఏళ్ల 'స్టార్ స్టైల్'

బామ్మల కాలం నుంచి వింటున్న కథానాయికల ఫ్యాషన్‌ని ఒక చోట కూర్చితే బాగుంటుందనుకున్నాను. తెలుగు సినిమా ఆన్‌స్క్రీన్ ఫ్యాషన్ గురించి ఎవరైనా తెలుసుకోవాలంటే 'స్టార్ స్టైల్' బుక్ బాగా ఉపయోగపడుతుంది. సినీతారల ఫ్యాషన్, వారి స్టైల్స్ గురించి తెలుసుకోవడం, సేకరణకు నాలుగైదేళ్ల సమయం పట్టింది. ఈ రీసెర్చ్ కోసం 1930ల కాలం నుంచి వచ్చిన తెలుగు సినిమాలు, హీరోయిన్ల ఇంటర్వ్యూలు చూశాను, చదివాను. ఫొటోగ్రాఫర్స్, డైరెక్టర్స్‌తో మాట్లాడాను. అలా 2012 వరకు తారల స్టైల్స్ తీసుకున్నాను. నాటి తారల్లో వాణిశ్రీ ఫ్యాషన్ అల్టిమేట్ అనిపించింది. ఆన్‌స్క్రీన్ లుక్ కోసం ఆవిడ చాలా ఎఫర్ట్ పెట్టేది అనిపించింది.



● 'స్టార్ స్టైల్' బుక్ లాంచింగ్ సందర్భంగా



'పురాణేతిహాసాల' పెయింటింగ్స్

నా పెయింటింగ్స్‌లో స్పిరిచ్యువాలిటీ ఎక్కువ. అమ్మ సబిత ఆధ్యాత్మికత నాలో అలాంటి పెయింటింగ్స్ వేయడానికి ప్రేరణ కలిగిస్తుంది అనుకుంటాను. కాలేజీ రోజుల నుంచి సోలో, గ్రూప్ ఎగ్జిబిషన్స్‌లో నా చిత్రాలు ప్రదర్శిస్తున్నాను. కాస్మిక్ పవర్, శివ–శక్తికి సంబంధించిన పెయింటింగ్స్ ఎక్కువ వేస్తుంటాను. బ్యాక్‌గ్రౌండ్‌లో సంస్కృత మంత్రాలతో నాదైన మార్క్ కనిపిస్తుంటుంది. యాక్టర్ సాయిధరమ్ తేజ్‌కు, డైరెక్టర్ సుధీర్ వర్మ, ఈషారెబ్బా, మేఘా ఆకాష్, హరీష్ శంకర్.. మొదలైన వారికి పెయింటింగ్ వర్క్స్ చేసిచ్చాను. హైదరాబాద్‌లో సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ 'ఓమ్', గ్రూప్ ఎగ్జిబిషన్ 'జస్ట్ ఆర్ట్ షో', 'ది ఆర్ట్ ఎడిషన్', 'ఒర్కా' వంటివి పేరు తెస్తే, ఆస్ట్రేలియా, చెన్నై, బెంగళూరులోనూ సోలో, గ్రూప్ ఎగ్జిబిషన్స్‌లో నా పెయింటింగ్స్ చాలా మందిని ఆకట్టుకున్నాయి. మైథా యాప్‌లో రెండు పురాణేతిహాస కథలకు డిజిటల్ డిజైన్ చేశాను.

నటిగా నిరూపణ

కోవిడ్‌కు ముందు 2019లో 'రణరంగం' సినిమాలో నటించాను. ఆ తర్వాత వచ్చిన 'తిమ్మరుసు' కూడా మంచి పేరు తెచ్చింది. కోవిడ్ టైమ్‌లో రైటింగ్, పెయింటింగ్ మీద ఎక్కువ వర్క్ చేశాను. ఇప్పుడు 'బచ్చన్' సినిమాలో నటిస్తున్నాను. నా ఫోకస్ మొత్తం యాక్టింగ్, రైటింగ్ మీద ఉంది. ఒక మూవీ నుంచి మరో మూవీకి వెళ్లడం అంటే ఒక జాబ్ నుంచి మరో జాబ్‌కు వెళ్లడం లాంటిదే. అలా నన్ను నేను ట్యూన్ చేసుకుంటాను.

ఆన్‌స్క్రీన్‌కు నా ఇతర వర్క్స్‌కి చాలా తేడా ఉంటుంది. కానీ, బెస్ట్ యాక్ట్రెస్‌గా నిరూపించుకోవాలన్నదే నా కల. అలాగే మంచి స్క్రిప్ట్ రైటర్‌ని అవ్వాలి. పెయింటింగ్స్‌లోనూ బెస్ట్ మార్క్ తెచ్చుకోవాలి. నాకు బాగా నచ్చితే మిగతా అందరికీ నచ్చుతుందని నమ్ముతాను. నేను పెట్టే ఎఫర్ట్ పెడుతుంటాను. ఆ రిజల్ట్ ఎలా వచ్చినా అంగీకరిస్తాను'' అంటూ నవ్వుతూ తన మల్టీ వర్క్స్ గురించి వివరించింది ఈ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సినిమా



● శోభిత, నాగార్జున, నాగచైతన్య

ట్రిపుల్ ఎయిట్... ఎంగేజ్డ్

''నా తనయుడు నాగచైతన్య నిశ్చితార్థం శోభితా ధూళిపాళ్లతో ఈ రోజు (గురువారం) ఉదయం 9 గంటల 42 నిమిషాలకు జరిగిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. ఈ నూతన జంటకు శుభాకాంక్షలు. ప్రేమ, సంతోషాలతో వీరి జీవితాలు నిండిపోవాలని కోరుకుంటున్నాను. 8.8.8.. (ఎనిమిదో తేదీ... ఎనిమిదో నెల... 2024ని కూడితే ఎనిమిది) అనంతమైన ప్రేమకు నాంది.. శోభితా, నాగచైతన్య'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేసి, నాగచైతన్య–శోభితల నిశ్చితార్థం ఫొటోలను షేర్ చేశారు అక్కినేని నాగార్జున. అక్కినేని నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం గురువారం హైదరాబాద్‌లోని అక్కినేని నాగార్జున ఇంట్లో జరిగింది. కాగా చైతన్య–శోభిత ప్రేమలో ఉన్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అడివి శేష్ నటించిన ఓ చిత్రానికి సంబంధించిన హౌస్‌పార్టీలో నాగచైతన్య, శోభితాలకు తొలిసారి పరిచయం ఏర్పడిందని, అది ప్రేమగా మారిందని టాక్. 'జోష్'తో హీరోగా ప్రయాణం మొదలుపెట్టి, ఇప్పుడు చేస్తున్న 'తండేల్' వరకూ నాగచైతన్య కెరీర్ గురించి అందరికీ తెలిసిందే. ఇక శోభితా ధూళిపాళ్ల విషయానికొస్తే... ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో వేణుగోపాల్ రావు, శాంతాకామాక్షి దంపతులకు జన్మించారు. ఆమెది బ్రాహ్మణ కుటుంబం. 2013లో ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ విజేతగా నిలిచారామె. ఆ తర్వాత 'రామన్ రాఘవ్ 2.ఓ'తో నటిగా శోభిత ప్రయాణం హిందీలో మొదలైంది. 'బార్డ్ ఆఫ్ బ్లడ్, మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్' వంటి హిందీ వెబ్ సిరీస్‌ల ద్వారానూ పాపులర్ అయ్యారు. 2018లో వచ్చిన అడివి శేష్ హిట్ ఫిల్మ్ 'గూఢచారి'లో ఓ లీడ్ రోల్‌లో నటించారు శోభిత. 'మేజర్'లోనూ ఓ ముఖ్య పాత్ర చేశారు. హాలీవుడ్ ఫిల్మ్ 'మంకీ మ్యాన్'లోనూ నటించారు.

ఇక 2017లో నాగచైతన్య–సమంత పెళ్లి చేసుకున్న విషయం, 2021లో విడిపోయిన విషయం తెలిసిందే.



హీరో చిరంజీవి గురువారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ని కలిసి కోటి రూపాయల చెక్కును అందించారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల వల్ల నష్టపోయిన వారికి చేయూతనిచ్చేందుకు హీరోలు చిరంజీవి, రామ్‌చరణ్ కోటి రూపాయలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా కేరళ ముఖ్యమంత్రి విజయన్‌ని కలిసి చిరంజీవి రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు.



● సంజయ్ దత్, రామ్

డబుల్ ఇస్మార్ట్‌ని ఎంజాయ్ చేస్తారు

– సంజయ్ దత్

''తెలుగు సినిమా డైనమిక్స్‌ని మార్చిన డైరెక్టర్ పూరి జగన్నాథ్ సార్. 'డబుల్ ఇస్మార్ట్'లో నన్ను భాగం చేసి, బిగ్ బుల్‌గా చూపిస్తున్న ఆయనకి థ్యాంక్స్. రామ్‌తో పని చేయడంతో చాలా మజా వచ్చింది. 'డబుల్ ఇస్మార్ట్'ని ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు'' అని బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ అన్నారు. రామ్ పోతినేని, కావ్యా థాపర్ జంటగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 15న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ మూవీలోని 'బిగ్ బుల్...' అంటూ సాగే పాటని ముంబైలో జరిగిన ఈవెంట్‌లో విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం అందించిన ఈ పాటని పృథ్వీ చం, సంజన కల్మంజే పాడారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ– ''డబుల్ ఇస్మార్ట్'తో ఉత్తరాది ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. సంజయ్ దత్‌గారితో పని చేయడం గౌరవంగా ఉంది'' అని పేర్కొన్నారు. ''సంజయ్ బాబాకి నేను బిగ్ ఫ్యాన్‌ని. ఆయన 'డబుల్ ఇస్మార్ట్' చేయడం చాలా హ్యాపీగా ఉంది'' అని పూరి జగన్నాథ్ చెప్పారు. ఈ వేడుకలో ఛార్మీ, కావ్యా థాపర్, పూరి కనెక్ట్స్ సీఈవో విష్, నటుడు అలీ మాట్లాడారు.



● యశ్

టాక్సిక్ ఆరంభం

యశ్ హీరోగా నటించనున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వెంకట్ కె. నారాయణ, యశ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. గురువారం బెంగళూరులో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలైంది. ''8.8.8న ఈ సినిమాను ఆరంభించాం. న్యూమరాలజీ ప్రకారం ఇది యశ్ బర్త్ డే (జనవరి 8)ని కూడా సూచిస్తుంది. పవర్‌ఫుల్ అండ్ ఎమోషనల్ కథతో 'టాక్సిక్' తెరకెక్కనుంది. ఈ ప్రాజెక్ట్‌లో స్టార్ నటీనటులు నటిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

ఫ్యామిలీ దిల్ రెడ్డి



● సాంచి, అంజన్, తనికెళ్ల భరణి

అంజన్ కస్తూరి, సాంచి బార్తి జంటగా నటిస్తున్న చిత్రం 'దిల్ రెడ్డి'. స్వీయ దర్శకత్వంలో అమ్మగారి రామరాజు (రమేశ్) నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి 'త్రినయని' ఫేమ్ నటుడు భరద్వాజ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు తనికెళ్ల భరణి క్లాప్ కొట్టారు. అమ్మగారి రామరాజు మాట్లాడుతూ– ''లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది'' అన్నారు. ''కుటుంబం అంతా కలిసి చూసేలా మా మూవీ ఉంటుంది'' అని అంజన్ కస్తూరి చెప్పారు. ''ఈ సినిమాలో కీలక పాత్ర చేస్తున్నాను'' అన్నారు భరద్వాజ్. తనికెళ్ల భరణి, అలీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామచంద్ర రావ్, సంగీతం: షారుఖ్ షేక్.

బన్వర్ ఈజ్ బ్యాక్



● ఫాహద్ ఫాజిల్

ఒక చేతిలో తుపాకీ, మరో చేతిలో గొడ్డలి పట్టుకుని బన్వర్ సింగ్ షెకావత్ చాలా కోపంగా ఉన్నాడు. మరి.. ఆయన కోపం ఏ స్థాయిలో ఉంటుందో ఈ డిసెంబరు 6న థియేటర్స్‌లో చూడొచ్చు. ఎందుకు అంటే 'పుష్ప: ది రూల్' సినిమా ఆ రోజున థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న 'పుష్ప' ఫ్రాంచైజీలోని మలి భాగం 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రంలో పుష్ప పాత్రలో అల్లు అర్జున్, ఐపీఎస్ ఆఫీసర్ బన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో ఫాహద్ ఫాజిల్, శ్రీవల్లి పాత్రలో హీరోయిన్ రష్మికా మందన్నా నటించారు. గురువారం (ఆగస్టు 8) ఫాహద్ ఫాజిల్ బర్త్ డే. ఈ సందర్భంగా బన్వర్ ఈజ్ బ్యాక్ అంటూ 'పుష్ప: ది రూల్' సినిమాలో ఫాహద్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



● ఆకాశ్ జగన్నాథ్, ఎంఎస్‌వీ సాగర్

ఐదు జంటల ప్రేమకథ

''కాలం రాసిన కథలు' మూవీ ట్రైలర్ చాలా బాగుంది. ముఖ్యంగా ఐదు జంటల మధ్య ఉన్న లవ్ కంటెంట్, డైలాగ్స్ ఆసక్తిగా ఉన్నాయి. ఈ సినిమా యూత్‌ని ఆకట్టుకుని మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని హీరో ఆకాశ్ జగన్నాథ్ అన్నారు. ఎంఎస్‌వీ సాగర్, శ్రుతీ శంకర్, వికాస్, విహారికా చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎంఎస్‌వీ సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని ఆకాశ్ జగన్నాథ్ లాంచ్ చేశారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది'' అని ఎంఎస్‌వీ సాగర్ చెప్పారు.



ఈ కథకు కనెక్ట్ అవుతారు

– విజయ్ శంకర్

''నేటి తరం ప్రేమికులంతా 'పాగల్ వర్సెస్ కాదల్' కథకు కనెక్ట్ అవుతారు. సినిమా చూశాక మా జీవితంలో ఇలాంటి సందర్భం ఒకటి వచ్చిందని ప్రతి ప్రేమికుడికి అనిపిస్తుంది'' అని విజయ్ శంకర్ అన్నారు. రాజేశ్ ముదునూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. విజయ్ శంకర్, విషిక జంటగా నటించారు. పద్దాన మన్మథ రావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ శంకర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో కార్తీక్ అనే అమాయకుడైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాత్ర చేశాను. కార్తీక్ ఓ గయ్యాళి అమ్మాయిని ప్రేమిస్తాడు. భిన్న వ్యక్తిత్వాలున్న లవర్స్ మధ్య బంధం ఎలా సాగింది? అనేది కథ'' అన్నారు.



ఎలాంటి పాత్రలు చేయడానికైనా రెడీ

"మంచి కథలకే తొలి ప్రాధాన్యం ఇస్తా. కథ బాగుండి నా పాత్రకి ప్రాధాన్యం ఉంటే మిగతా అంశాలను పట్టించుకోను. చిన్న పాత్ర, చిన్న హీరో అని కూడా ఆలోచించను. మెగా ఫ్యామిలీ నుంచి వచ్చాననే ఆలోచన వల్లో.. వేరే ఏదైనా కారణమేమో తెలియదు కానీ తెలుగు దర్శకులు ఎక్కువగా నన్ను సంప్రదించడం లేదు. అయితే నాకు సౌకర్యంగా అనిపిస్తే ఎలాంటి పాత్రలు చేయడానికైనా రెడీ" అని నటి, నిర్మాత నిహారిక కొణిదెల అన్నారు. నూతన నటీనటులతో యదు వంశీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిహారిక కొణిదెల చెప్పిన విశేషాలు.

● వెబ్ సిరీస్, షార్ట్ ఫిల్మ్స్ నిర్మించిన నేను ఫీచర్ ఫిల్మ్ చేయాలనుకున్న టైమ్‌లో అంకిత్ ద్వారా 'కమిటీ కుర్రోళ్ళు' కథ నా వద్దకు వచ్చింది. ఈ కథ నాకు, మా నాన్నకి బాగా నచ్చింది. సిటీలో పుట్టి పెరిగిన నేను జాతర అనుభూతిని పొందలేదు. ఈ కథలో నాకు కళ్లకు కట్టినట్టుగా వంశీ చూపించాడు. అందుకే ఈ కథతో ఎలాగైనా సినిమా నిర్మించాలని ఫిక్స్ అయి, తీశాను. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే జాతర చుట్టూ ఈ కథను రాశాడు వంశీ. మూడు తరాలను చూపించేలా ఈ కథ ఉంటుంది. నాకు నటించడమే ఇష్టం. నిర్మాత కావాలని ఎప్పుడూ అనుకోలేదు. 'ముద్ద పప్పు ఆవకాయ్' టైమ్ నుంచి అలా జరిగిపోయిందంతే.

● ప్రతిభ ఒక్కటే కాదు... క్రమశిక్షణ ఉంటేనే ఇండస్ట్రీలో ఎదుగుతామని చిరంజీవిగారు చెబుతుంటారు. ఆ క్రమశిక్షణ వంశీలో చూశాను. ఈ చిత్రంలోని పదకొండు మంది అబ్బాయిల పాత్రల్లో నన్ను నేను ఊహించుకున్నాను. ప్రతి ప్రేక్షకుడు ఏదో ఒక క్యారెక్టర్‌తో ప్రయాణం చేస్తాడు. ● నా గురించి బయటివారు చేసే విమర్శలు, పొగడ్తల్ని పట్టించుకోను. నా గురించి నిజాయతీగా ఉన్నది ఉన్నట్లు (పొగడ్త అయినా, విమర్శ అయినా) చెప్పేది మా అమ్మానాన్న (పద్మజ, నాగబాబు), అన్నయ్యే (వరుణ్ తేజ్). 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాని మా అన్నయ్య, వదిన (లావణ్య త్రిపాఠి) చూశారు.. వాళ్లకి బాగా నచ్చింది. ప్రస్తుతం ఓ తమిళ చిత్రంలో నటిస్తున్నాను. అలాగే తెలుగులో ఓ వెబ్ సిరీస్ చేశాను.



“నా ఆటను ముగించేందుకు ఇంతకంటే సరైన సమయం ఉండదు. మేం పతకంతో తిరిగి వెళుతున్నాం. కొందరు అభిమానులు నన్ను కొనసాగించమని కోరుతున్నారు. కానీ నా నిర్ణయంలో మార్పు లేదు. కొన్ని నిర్ణయాలు కఠినమైనవే అయినా వాటిని సరైన సమయంలో తీసుకోవడమే బాగుంటుంది. మా జట్టు సభ్యులంతా చాలా బాగా ఆడారు. టోక్యోలో గెలిచిన కాంస్యానికి నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎందుకంటే ఒలింపిక్స్‌లో మేం పతకం గెలవగలమనే నమ్మకాన్ని అది కల్పించింది. –పీఆర్ శ్రీజేశ్

కాంస్యపతక పోరు మాకూ, మా దేశానికి ఎంతో కీలకం. ఒలింపిక్స్‌లో పోటీ పడేందుకు ఎన్నో దశలు దాటాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఫలితం మనకు అనుకూలంగా రాదు. భారత్ వరుసగా రెండు సార్లు పతకం సాధించడం గొప్ప విషయం. ఇది అంత సులువు కాదు. పెనాల్టీ కార్నర్‌లను మా బృందం చాలా అద్భుతంగా నిలువరించగలిగింది. హాకీపై ఆదరణ ఇలాగే కొనసాగుతుందని ఆశిస్తున్నా –హర్మన్‌ప్రీత్ సింగ్, కెప్టెన్

ఎన్నో తరాల పాటు గుర్తుంచుకునే ప్రదర్శన ఇది. భారత హాకీ జట్టు ఒలింపిక్ కాంస్యంతో మెరిసింది. ఇది వరుసగా రెండో పతకం కావడం మరింత ప్రత్యేకం. ప్రతిభ, పట్టుదలకు తోడు సమష్టి కృషి దీనిని అందించింది. ఆటగాళ్లకు నా అభినందనలు. ప్రతీ భారతీయుడికి మానసికంగా హాకీతో బలమైన బంధం ఉంది. ఈ విజయం వల్ల యువతలో ఆటపై మరింత ఆసక్తి పెరుగుతుంది. –నరేంద్ర మోదీ, ప్రధాని

రజత నీరాజనం


- వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన నీరజ్ చోప్రా
- జావెలిన్‌ను 89.45 మీటర్లు విసిరి రజత పతకం సొంతం
- స్వర్ణ పతకం సాధించిన పాకిస్తాన్ ప్లేయర్ అర్షద్ నదీమ్
- 92.97 మీటర్లతో ఒలింపిక్ రికార్డు నెలకొల్పిన నదీమ్



నీరజ్ చోప్రా

పారిస్: పసిడి ఆశలతో ‘పారిస్’లో అడుగు పెట్టిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. రెండో ప్రయత్నంలో 26 ఏళ్ల నీరజ్ జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. చివరకు ఈ స్కోరుతోనే నీరజ్‌కు రజత పతకం ఖరారైంది. క్వాలిఫయింగ్‌లో 89.34 మీటర్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచిన నీరజ్ ఫైనల్లో కాస్త ఒత్తిడికి లోనయ్యాడు. అతడి తొలి ప్రయత్నం ఫౌల్ అయింది. రెండో ప్రయత్నంలో నీరజ్ ఆందోళన చెందకుండా సంయమనంతో జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత నీరజ్ మూడు, నాలుగు, ఐదు, ఆరో ప్రయత్నాలు కూడా ఫౌల్‌గానే నమోదయ్యాయి. దాంతో ఈ త్రోలలో నమోదైన స్కోరును పరిగణనలోకి తీసుకోలేదు. టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు.

ఎవరూ ఊహించని విధంగా జావెలిన్ త్రోలో పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ స్వర్ణ పతకాన్ని గెల్చుకొని అందర్నీ నివ్వెరపరిచాడు. 27 ఏళ్ల నదీమ్ తొలి ప్రయత్నంలో విఫలమయ్యాడు. అయితే రెండో ప్రయత్నంలో నదీమ్ జావెలిన్‌ను 92.97 మీటర్ల దూరం విసిరి కొత్త ఒలింపిక్ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో ఆండ్రెస్ థోర్‌కిల్డ్‌సన్ (నార్వే; 90.57 మీటర్లు) నెలకొల్పిన రికార్డును నదీమ్ బద్దలు కొట్టాడు. ప్రపంచ మాజీ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) 88.54 మీటర్లతో కాంస్య పతకాన్ని సాధించాడు.



అర్షద్ నదీమ్

1 వ్యక్తిగత క్రీడాంశంలో ఒలింపిక్స్ చరిత్రలో పాకిస్తాన్‌కు తొలి స్వర్ణ పతకం నదీమ్ ద్వారా లభించింది. గతంలో పాకిస్తాన్ హాకీ జట్టు 3 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలు గెలిచింది. 1960 రోమ్ ఒలింపిక్స్ రెజ్లర్ మొహమ్మద్ బషీర్ కాంస్యం... 1988 సియోల్ ఒలింపిక్స్‌లో బాక్సర్ హుస్సేన్ షా కాంస్యం సాధించారు.

4 ఒలింపిక్స్ క్రీడల్లో రెండు వ్యక్తిగత పతకాలు సాధించిన నాలుగో భారత ప్లేయర్‌గా నీరజ్ గుర్తింపు పొందాడు. గతంలో రెజ్లర్ సుశీల్ (2008 బీజింగ్: కాంస్యం... 2012 లండన్: రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో: రజతం... 2020 టోక్యో: కాంస్యం), షూటర్ మనూ భాకర్ (2024 పారిస్: 2 కాంస్యాలు) ఈ ఘనత సాధించారు.

వహ్వా హాకీ



కాంస్యం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు

టోక్యోలో అద్భుత ఆటతో అదరగొట్టిన భారత హాకీ జట్టు పారిస్ వరకు దానిని కొనసాగించింది. నాటి విజయం తర్వాత అంచనాలను పెంచిన మన టీమ్ ఈసారి కూడా దానికి తగినట్లుగా పతకాన్ని అందించింది. వరుసగా రెండో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి తమ సత్తాను చాటింది. 1952–1972 మధ్య వరుసగా ఒలింపిక్ మెడల్ పోడియంపై నిలిచిన భారత జట్టు ఆ తర్వాత ఎప్పుడూ వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో పతకాలు గెలవలేకపోయింది. ఈసారి మాత్రం గత ఒలింపిక్స్ కాంస్యపు ప్రదర్శనను పునరావృతం చేసింది. రెండు సందర్భాల్లోనూ జట్టు విజయాల్లో కీలకంగా నిలిచిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఈ గెలుపు తర్వాత ఘనంగా తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఓవరాల్‌గా ఒలింపిక్స్ చరిత్రలో భారత హాకీకిది 13వ పతకం కావడం విశేషం.

- 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో పతకాలు
- ప్లే ఆఫ్ మ్యాచ్‌లో 2–1తో స్పెయిన్‌పై గెలుపు
- ఘనంగా గోల్‌కీపర్ శ్రీజేశ్ రిటైర్మెంట్
- పారిస్ క్రీడల్లో భారత్‌కు నాలుగో కాంస్యం

పారిస్: మ్యాచ్‌లో 58 నిమిషాలు ముగిసేసరికి 2–1తో ఆధిక్యంలో భారత్... మరో రెండు నిమిషాలు బంతిపై పట్టు ఉంచుకుంటే చాలు మ్యాచ్ మనదే... అయితే సరిగ్గా 59వ నిమిషంలో స్పెయిన్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. దాంతో అందరిలో కాస్త ఆందోళన... గతంలో చాలా సందర్భాల్లో భారత జట్టు గెలిచే స్థితిలో ఉండి ఆఖరిలో పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్స్ ఇచ్చి మ్యాచ్ కోల్పోయింది. కాబట్టి కొంత ఉత్కంఠ! అయితే స్పెయిన్ ప్లేయర్ మిరాల్స్ ప్రయత్నాన్ని భారత గోల్ కీపర్ శ్రీజేశ్ అడ్డుకున్నాడు. ఆ వెంటనే 60వ నిమిషంలో కూడా వారికి మరో పెనాల్టీ కార్నర్. ఈసారి కూడా శ్రీజేశ్ నిలువరించాడు. దాంతో పాటు చురుగ్గా ఉన్న మన ఆటగాళ్లు బంతిని అందుకొని తమ ఆధీనంలోకి తెచ్చేసుకున్నారు. స్పెయిన్ ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించినా మళ్లీ మన సర్కిల్‌లోకి రాలేకపోయారు. అంతే... టీమిండియా బృందంలో సంబరాలు మొదలయ్యాయి. శ్రీజేశ్ తన కీపింగ్ పోస్ట్ వద్ద కుప్పకూలిపోగా... సహచరులంతా



చుట్టుముట్టి తమ ఆనందాన్ని ప్రదర్శించారు. సెమీస్‌లో అనూహ్యంగా ఓడినా... చివరకు కాంస్య పతకం గెలుచుకొని భారత జట్టు తమ స్థాయిని ప్రదర్శించింది. ఈ ‘ప్లే ఆఫ్’ పోరులో భారత్ 2–1 గోల్స్ తేడాతో స్పెయిన్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 2 గోల్స్ (30వ నిమిషం, 33వ నిమిషం) సాధించగా... స్పెయిన్ తరఫున మార్క్ మిరాల్స్ (18వ నిమిషం) ఏకైక గోల్ కొట్టాడు. తాజా ఫలితంతో పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ ఖాతాలో నాలుగో కాంస్యం చేరింది.

ఒక్కొక్కరికీ 15 లక్షలు

ప్లేయర్లకు హాకీ ఇండియా నజరానా

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన భారత పురుషుల హాకీ జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ఒక్కో ఆటగాడికి రూ. 15 లక్షలు, సహాయక సిబ్బందికి ఏడున్నరల లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు హాకీ ఇండియా వెల్లడించింది. ఒలింపిక్స్ హాకీలో ఘనచరిత్ర ఉన్న భారత్‌కు విశ్వక్రీడల్లో ఇది 13వ పతకం కావడం విశేషం.

సమష్టి ప్రదర్శనతో...

1980 తర్వాత ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయిన భారత్ 41 ఏళ్ల తర్వాత టోక్యోలో కాంస్యం గెలిచి అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. ఇప్పుడు మూడేళ్ల తర్వాత మళ్లీ అదే తరహాలో భారతీయుల నమ్మకాన్ని జట్టు వమ్ము చేయలేదు. అటు అటాకింగ్‌లో, ఇటు డిఫెన్స్‌లో కూడా జట్టు ప్రభావం చూపించింది. సస్పెన్షన్ కారణంగా గత మ్యాచ్ ఆడని డిఫెండర్ అమిత్ ఈ మ్యాచ్‌లో తిరిగొచ్చి బలంగా నిలబడ్డాడు. 6వ నిమిషంలో సుఖ్‌జీత్‌కు గోల్ అవకాశం వచ్చినా అతను పోస్ట్‌కు దూరంగా కొట్టాడు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు సమ ఉజ్జీలుగా పోరాడటంతో గోల్ నమోదు కాలేదు. అయితే రెండో క్వార్టర్‌లో స్పెయిన్ శుభారంభం చేసింది. క్లేప్స్‌ను టాకింగ్ చేసే ప్రయత్నంలో ‘డి’లో మన్‌ప్రీత్ ఫౌల్ చేయడంతో స్పెయిన్ పెనాల్టీ స్ట్రోక్ లభించగా, దానిని మిరాల్స్ సులువుగా గోల్‌గా మలిచాడు. అయితే 21 సెకన్లలో రెండో క్వార్టర్ ముగుస్తుందనగా పెనాల్టీతో భారత్ స్కోరు సమం చేసింది. మరో మూడు నిమిషాలకే మళ్లీ పెనాల్టీ ద్వారానే హర్మన్ స్కోరు చేయడంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మన జట్టు దానిని చివరి వరకు నిలబెట్టుకోగా... ఆఖరి మూడు నిమిషాల్లో గోల్ కీపర్‌ను తప్పించి స్కోరును సమం చేసేందుకు స్పెయిన్ తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. తమకు లభించిన 6 పెనాల్టీ కార్నర్‌లను భారత్ 2 గోల్స్‌తో సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్‌కు 9 పెనాల్టీలు లభించినా ఆ జట్టు ఒక్కదానినీ గోల్‌గా మలచలేకపోయింది. ‘గ్రేట్ వాల్ ఆఫ్ భారత్’ శ్రీజేశ్ అద్భుత ప్రదర్శనే అందుకు కారణం. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలుకుతున్నట్లు శ్రీజేశ్ ముందే ప్రకటించాడు. అతనికి ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు జట్టు సభ్యులు వెల్లడించారు.

నెదర్లాండ్స్‌కు స్వర్ణం

24 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో నెదర్లాండ్స్ పురుషుల హాకీ జట్టు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో నెదర్లాండ్స్ ‘పెనాల్టీ షూటౌట్’లో 3–1తో జర్మనీ జట్టుపై గెలిచింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు ‘షూటౌట్’ నిర్వహించారు. గతంలో నెదర్లాండ్స్ జట్టు 1996 అట్లాంటా, 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లలో పసిడి పతకాలు సాధించింది. భారత జట్టు అత్యధికంగా 8 స్వర్ణాలు నెగ్గగా... నెదర్లాండ్స్, పాకిస్తాన్, బ్రిటన్, జర్మనీ జట్లు మూడు సార్లు చొప్పున బంగారు పతకాలు గెలిచాయి.

కాంస్యం కోసం అమన్ పోరు

నేడు ప్యూర్టోరికో రెజ్లర్ దరియన్ క్రూజ్‌తో బౌట్



పారిస్: ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తొలి ప్రయత్నంలోనే పతకం సొంతం చేసుకునేందుకు భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ ఒక విజయం దూరంలో నిలిచాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో అమన్ సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. 2016 రియో ఒలింపిక్స్ రజత పతక విజేత రె హిగుచి (జపాన్)తో జరిగిన సెమీఫైనల్లో 21 ఏళ్ల అమన్ ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో పరాజయం చవిచూశాడు. మూడు నిమిషాల నిడివిగల తొలి భాగంలో 2 నిమిషాల 14 సెకన్లలో రె హిగుచి 10–0తో ఆధిక్యాన్ని సంపాదించడంతో రిఫరీ బౌట్‌ను ముగించాడు. ఇద్దరి రెజ్లర్ల మధ్య 10 పాయింట్ల తేడా వచ్చిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపి వేసి పది పాయింట్ల ఆధిక్యం సాధించిన రెజ్లర్‌ను ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో ప్యూర్టోరికో రెజ్లర్ దరియన్‌తో అమన్ తలపడతాడు.

రెండు ఘనవిజయాలతో...

అంతకుముందు అమన్ రెండు వరుస ఘనవిజయాలతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో అమన్ 3 నిమిషాల 59 సెకన్లలో 10–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో వ్లాదిమిర్ ఇగొరోవ్ (నార్త్ మెసడోనియా)ను ఓడించాడు. క్వార్టర్ ఫైనల్లో అమన్ 3 నిమిషాల 56 సెకన్లలో 12–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో అబాకరోవ్ జెలీమ్ ఖాన్ (అల్బేనియా)పై గెలుపొందాడు. అబాకరోవ్ 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 57 కేజీల విభాగంలో స్వర్ణం, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించడం విశేషం. అమన్ తన సహజశైలిలో ఆడితే నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో దరియన్‌పై నెగ్గడం అంత కష్టమేమీ కాదు.

అన్షు తొలి రౌండ్‌లోనే...

మహిళల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అన్షు మలిక్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. హెలెన్ లూసీ మరూలిస్ (అమెరికా)తో జరిగిన బౌట్‌లో అన్షు 2–7 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. అయితే హెలెన్ ఫైనల్ చేరుకోకపోవడంతో అన్షుకు రెపిచాజ్ రూపంలో కాంస్య పతకం కోసం పోటీ పడే అవకాశం చేజారింది.

జ్యోతికి మళ్లీ నిరాశ

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ నిరాశ పరిచింది. గురువారం మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రెపిచాజ్ రేసులో జ్యోతి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అంతకుముందు బుధవారం హీట్స్‌లో ఏడో స్థానంలో నిలిచిన జ్యోతి... రెపిచాజ్‌లోనూ ఆకట్టుకోలేకపోయింది. ఈ విభాగంలో పోటీ పడుతున్న తొలి భారతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందిన జ్యోతి 13.17 సెకన్లలో గమ్యానికి చేరింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన 24 ఏళ్ల జ్యోతి గతంలో 12.78 సెకన్లతో 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది.

వెనుకంజలో గోల్ఫర్లు

పారిస్ ఒలింపిక్స్ గోల్ఫ్ మహిళల వ్యక్తిగత స్ట్రోక్ ప్లేలో భారత గోల్ఫర్లు ఆకట్టుకోలేకపోయారు. గురువారం రెండు రౌండ్లు ముగిసేసరికి దీక్ష డాగర్, అదితి అశోక్ చెరో 143 పాయింట్లతో మరో ముగ్గురు గోల్ఫర్లతో కలిసి సంయుక్తంగా 14వ స్థానంలో ఉన్నారు.

భారత్ @ పారిస్ ఒలింపిక్స్


నాలుగో స్థానంలో నిలిచిన ప్లేయర్లు

- **లక్ష్య సేన్** – బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్
- **అర్జున్ బబూతా** – షూటింగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్
- **అంకిత భకత్–బొమ్మదేవర ధీరజ్** – ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్
- **మనూభాకర్** – షూటింగ్ మహిళల 25 మీటర్ల పిస్టల్ (10 మీటర్ల వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రెండు కాంస్యాలు గెలిచింది.)
- **మహేశ్వరీ చౌహాన్–అనంత్‌జీత్ సింగ్** – షూటింగ్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్
- **మీరాబాయి చాను** – వెయిట్ లిఫ్టింగ్ మహిళల 49 కేజీలు

ఆ ఆరు వచ్చి ఉంటే ‘పది’ దాటేవాళ్లం...

పారిస్ ఒలింపిక్స్‌లో అదృష్టం కూడా కలిసి వచ్చి ఉంటే భారత్ పతకాల సంఖ్య రెండంకెలు దాటేది. ఇప్పటికే ఐదు పతకాలు నెగ్గిన భారత్ త్రుటిలో నాలుగు కాంస్య పతకాలను కోల్పోయింది. షూటర్లు అదరగొట్టగా... ఆర్చరీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో మన వాళ్లు నిరాశ పరిచారు. కచ్చితంగా పతకాలు సాధిస్తారనుకున్న ఆటగాళ్లు తడబడగా... మరో ఆరుగురు ప్లేయర్లు నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో మెడల్ చేజార్చుకున్నారు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	28	25	18	71
2	అమెరికా	27	36	34	97
3	ఆస్ట్రేలియా	18	14	11	43
4	ఫ్రాన్స్	14	18	21	53
5	బ్రిటన్	13	17	21	51
6	దక్షిణ కొరియా	12	8	7	27
7	జపాన్	12	7	13	32
8	నెదర్లాండ్స్	11	6	7	24
9	ఇటలీ	10	11	9	30
10	జర్మనీ	9	7	5	21
11	కెనడా	6	5	10	21
63	భారత్	0	1	4	5

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

పడి.. లేచి.. మరో పతకం వైపు...



2023 మార్చి... సొంతగడ్డపై జరిగిన వరల్డ్ కప్‌లో భారత జట్టు అత్యంత చెత్త ప్రదర్శనను నమోదు చేసింది. పేలవ ఆటతో సంయుక్తంగా 9వ స్థానంలో నిలిచిన టీమ్... గతంలో ఏ ఆతిథ్య జట్టూ ఎదుర్కోని అవమానాన్ని భరించాల్సి వచ్చింది. దాంతో మరోసారి భారత హాకీ పాత రోజులు గుర్తుకొచ్చాయి. దాదాపు రెండేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించి ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించిన జట్టు ఇదేనా అనిపించింది. అప్పుడప్పుడే మళ్లీ ఆటపై ఆసక్తి పెరుగుతున్న దశలో స్వదేశంలో జట్టు ఆట మళ్లీ నిరాశపర్చింది. దాంతో సహజంగానే జరిగిన మార్పుల్లో భాగంగా ముందుగా కోచ్ గ్రాహం రీడ్‌పై వేటు పడింది. కొత్త కోచ్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన క్రెయిగ్ ఫుల్టన్ వచ్చాడు. ఆటగాడిగా, కోచ్‌గా విశేష అనుభవం ఉన్న అతను భారత జట్టును మళ్లీ దారిలోకి తీసుకురాగలడని అంతా భావించారు. ఈ నమ్మకాన్ని ఫుల్టన్ నిలబెట్టుకున్నాడు. తనదైన శైలిలో ఆటగాళ్లను మరింత పదునుగా మార్చే పనిలో పడ్డాడు. అప్పటికే సీనియర్లుగా దేశం తరఫున ఎన్నో చిరస్మరణీయ మ్యాచ్‌లు ఆడిన వారిని కూడా తనకు కావాల్సిన రీతిలో మలచుకున్నాడు. ముఖ్యంగా అవుట్‌ఫీల్డ్‌లో వేగం పెంచడం, ఆరంభం నుంచే దూకుడు పెంచి ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచడం వంటి విషయంలో ఆటగాళ్లలో కొత్త తరహా ఆటను తీసుకొచ్చాడు. ముందుగా ఆటగాళ్లు కొంత ఇబ్బంది పడ్డా మెల్లగా ఇవి మంచి ఫలితాలు అందించాయి. ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో స్వర్ణాలు గెలిచిన భారత్ ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆటగాళ్లలో కూడా కొత్త ఉత్సాహం కనిపించింది. వరల్డ్ కప్ వైఫల్యాన్ని దాటి ముమ్ముందు పెద్ద విజయం సాధించాలనే కసి, పట్టుదల వారిలో పెరిగాయి.

ఒలింపిక్స్‌లో భారత జట్టు ఆట చూస్తే ఫుల్టన్ ప్రణాళికలు ఎంత అద్భుతంగా పని చేశాయో తెలుస్తుంది. సరిగ్గా చెప్పాలంటే ఒకే తరహా ఆటతో కాకుండా వేర్వేరు ప్రత్యర్థుల కోసం జట్టు వేర్వేరు వ్యూహాలు పన్నింది. బెల్జియం జట్టు తమ డిఫెన్స్‌ను పటిష్టంగా ఉంచుకుంటూనే దూకుడుగా ఆడింది. అదే ఆస్ట్రేలియాపై వచ్చేసరికి ఆట మారింది. క్షణకాలం డిఫెన్స్‌లో పడినా ప్రత్యర్థి పైచేయి సాధిస్తుందని తెలుసు కాబట్టి తొలి నిమిషం నుంచి పూర్తిగా అటాకింగ్‌పైనే దృష్టి పెట్టింది. మళ్లీ బ్రిటన్‌తో మ్యాచ్ వచ్చేసరికి డిఫెన్స్‌కు కట్టుబడింది. ఒక ఆటగాడు తగ్గినా కీపర్‌తో కలిసి గోల్స్‌ను కాపాడుకోవడంలో జట్టు సఫలమైంది. సెమీస్‌లో జర్మనీతో ఓడినా గతంలో ఎన్నడూ చూడని అటాకింగ్, ఓటమిని అంగీకరించకుండా పోరాడే తత్వం మన టీమ్ నుంచి కనిపించిందని మాజీ ఆటగాడు వీరేన్ రస్కిన్హా వ్యాఖ్యానించడం విశేషం. క్షణాల వ్యవధిలో వ్యూహాలు మార్చుకోవడం, పరిస్థితికి అనుగుణంగా అప్పటికప్పుడు ఆటతీరును మలచుకోవడం గతంలో భారత జట్టు విషయంలో ఎప్పుడూ చూడనిది.

భారత జట్టు గెలుపు మరో వ్యక్తి ప్రధాన పాత్ర పోషించాడు. అతనే ప్యాడీ ఆప్టన్. స్పోర్ట్స్ సైకాలిజిస్ట్ అయిన ఆప్టన్ భారత హాకీ ఆటగాళ్లను మానసికంగా సంసిద్ధం చేయడంలో, ఒత్తిడిని ఎదుర్కోకుండా బలంగా నిలబడే విషయంలో సరైన దిశలో తీర్చిదిద్దాడు. 2011లో క్రికెట్ వన్డే వరల్డ్ కప్ గెలిచిన సమయంలో భారత జట్టు ఇదే ఆప్టన్ స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌గా వ్యవహరించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. కోచ్‌ల వ్యూహాలను అమలు చేసే విషయంలో ఆటగాళ్లు ఎక్కడా గతి తప్పలేదు. ఒలింపిక్స్‌తో రిటైర్ అవుతున్న గోల్ కీపర్ శ్రీజేశ్ అడ్డుగోడలా ప్రత్యర్థులను నిలువరించాడు. ఎనిమిది మ్యాచ్‌లలో అతను 62 షాట్‌లను ఎదుర్కొంటే 50 షాట్‌లను ఆపడం విశేషం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీలను గోల్స్‌గా మలచడంలో అద్భుత నైపుణ్యం చూపిస్తూ ఒలింపిక్స్‌లో 10 గోల్స్ నమోదు చేశాడు. డిఫెండర్లు రోహిదాస్, జర్మన్‌ప్రీత్‌లు అద్భుతంగా ప్రత్యర్థి ఆటగాళ్లను అడ్డుకున్నారు. అత్యంత సీనియర్ అయిన మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్ మిడ్‌ఫీల్డ్‌లో తన పదును చూపించగ, మరో సీనియర్ మన్‌దీప్ ఫార్వర్డ్‌గా జట్టును నడిపించాడు. అందరి సమష్టి ప్రదర్శన, పోరాటం, పట్టుదల భారత్‌కు వరుసగా రెండో కాంస్యాన్ని అందించాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన భారత జట్టులోని 11 మంది సభ్యులు ‘పారిస్’లోనూ టీమిండియాకు ప్రాతినిధ్యం వహించారు. –సాక్షి క్రీడా విభాగం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	582	78,886
నిఫ్టీ ▽	180	24,117

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,652	△	455
డోజోన్స్	39,410	△	647
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,145	▽	22
డాక్స్	17,680	△	65
షాంఘై	2,870	△	1
నికాయ్	34,831	▽	414

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	69,205	▽	264
బంగారం (99.5 స్వచ్ఛత)	68,928	▽	263
వెండి (కేజీ)	78,880	△	279

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.54	84.56
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.42	107.98
€	యూరో	ఎస్‌బీఐ	90.70	93.07
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.72	58.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.11	56.07
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.01	65.67
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.76
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.83	12.65

ధరల భయం.. వడ్డీరేట్లు యథాతథం!

- వరుసగా 9వసారీ ఎక్కడి రేట్లు అక్కడే...
- దీంతో 6.5% వద్దే రెపోరేటు కొనసాగింపు
- ద్రవ్యోల్బణం 4.5శాతంగా ఉద్ఘాటన
- జీడీపీ వృద్ధి అంచనా 7.2 శాతంగానే



ముంబై: ద్రవ్య, పరపతి విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం స్పష్టం చేసింది. దీనితో వరుసగా తొమ్మిదవసారి బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే బెంచ్‌మార్క్ వడ్డీ రేటు– రెపో యథాతథంగా 6.5 శాతంగా కొనసాగనుంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రుణ రేట్లు దాదాపు యథాపూర్వం ముమ్ముందూ కొనసాగనున్నాయి. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన (ఎంపీసీ) కమిటీ మూడురోజుల సమావేశ నిర్ణయాలు గురువారం వెలువడ్డాయి.

0.25 శాతం రేటు తగ్గింపునకు ఇద్దరు మొగ్గు

గవర్నర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీలో నలుగురు యథాతథ 6.5 శాతం రేటు కొనసాగించడానికి మొగ్గుచూపగా, పావు శాతం రేటు తగ్గింపునకు ఇద్దరు ఓటువేశారు. వీరిలో ఎక్స్‌టర్నల్ సభ్యులు జయంత్ వర్మతోపాటు అషిమా గోయల్ ఉన్నారు. 'ఆహార ద్రవ్యోల్బణం తీవ్రత తాత్కాలికమే కావచ్చు. అయితే అధిక ద్రవ్యోల్బణం కొనసాగుతున్న ప్రస్తుత వాతావరణంలో ద్రవ్య విధాన కమిటీ దీనిని సహించబోదు' అని పాలసీ ప్రకటనలో గవర్నర్ ఉద్ఘాటించారు.

మారని వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలు...

ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బీఐ పాలసీ సమీక్ష వరుసగా 7.2 శాతం, 4.5 శాతాలుగా యథాతథంగా కొనసాగించింది. ఒకపక్క ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూ మరోవైపు వృద్ధికి ఊతం ఇచ్చే చర్యలను ఆర్‌బీఐ కొనసాగిస్తుందని గవర్నర్ స్పష్టం చేశారు. దీనికి దేశంలో తగిన వర్షపాతం దోహదపడుతుందని అన్నారు. 2024–25లో 4 త్రైమాసికాల్లో వృద్ధి రేట్లు వరుసగా 7.1%, 7.2%, 7.3%, 7.2%గా కొనసాగుతాయన్నది పాలసీ సమీక్ష అంచనా. 2025–26 తొలి త్రైమాసికంలో (2026 ఏప్రిల్–జూన్) వృద్ధి 7.2%గా ఉంటుందని కూడా ఆర్‌బీఐ అంచనావేసింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు త్రైమాసికాల్లో వరుసగా 4.9%, 4.4%, 4.7%, 4.3%గా ఉంటాయని విశ్లేషించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ స్పీడ్ 4.4%గా ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనా. 2% అటు ఇటుగా 4% వద్ద రిటైల్ ద్రవ్యోల్బణం ఉండేలా చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం సూచిస్తోంది.

పాలసీ ముఖ్యాంశాలు...

- మందగమనంలో ఉన్నప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ సవాళ్లను తట్టుకునే స్థాయిలోనే కొనసాగుతోంది.
- దేశీయ ఆర్థిక, ఫైనాన్షియల్ వ్యవస్థలు పటిష్ట ధోరణిలోనే కొనసాగుతున్నాయి.
- దేశంలోకి ఒక నిర్దిష్ట కాలంలో వచ్చీ–వెళ్లే విదేశీ నిధులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) నిర్వహణ బాగుంది.
- విదేశీ మారకద్రవ్య నిల్వలు 675 బిలియన్ డాలర్ల చరిత్రాత్మక గరిష్ట స్థాయిలో ఉన్నాయి.
- 2024–25లో ఇప్పటి వరకూ రూపాయి తీవ్ర ఒడిదుడుకులతో కాకుండా ఒక నిర్దిష్ట స్థాయిలోనే కొనసాగుతోంది.
- గృహ రుణాలతో సహా నిర్దేశించిన అవసరాలకు టాప్–అప్‌ను వినియోగించకపోవడం ఆందోళనకరమే. అయితే ద్వైపాక్షిక ప్రాతిపదికన సమస్యను పరిష్కరించడానికి చర్యలు కొనసాగుతాయి.
- చెక్ క్లియరెన్స్‌ని వేగవంతం చేయడానికి చర్యలు ఉంటాయ్.
- అక్టోబర్ 7 నుంచి 9 వరకూ తదుపరి పాలసీ సమీక్ష చేపట్టనున్నారు.

ఆహార ధరల కట్టడే ధ్యేయం



ఆహార ద్రవ్యోల్బణం 'మొండిగా' అధిక స్థాయిలోనే ఉంది. ధరల స్థిరత్వం లేకుండా, అధిక వృద్ధిని కొనసాగించలేము. ద్రవ్యోల్బణం కట్టడికి తగిన ద్రవ్య విధానాన్ని సెంట్రల్ బ్యాంక్ కొనసాగించాల్సిందే. నిరంతర ఆహార ద్రవ్యోల్బణం నుండి ఉత్పన్నమయ్యే సవాళ్లు, లేదా రెండవ దశ ప్రభావాలను నివారించడానికి అలాగే ఇప్పటివరకు సాధించిన ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి ఎంపీసీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

అనధికార డిజిటల్ లెండింగ్‌పై ఉక్కుపాదం

అనధికార సంస్థల ఆట కట్టించడానికి డిజిటల్ లెండింగ్ యాప్‌ల పబ్లిక్ రిపాజిటరీ ఏర్పాటు కానుంది. నియంత్రణలోని సంస్థలు (ఆర్‌ఈ) ఈ రిపోజిటరీలో తమ డిజిటల్ లెండింగ్ యాప్‌ల గురించిన సమాచారాన్ని నివేదించాలి. అలాగే ఎప్పటికప్పుడు సంబంధిత లావాదేవీల వివరాలను అప్‌డేట్ చేయాలి. అనధికార రుణ యాప్‌లను గుర్తించడంలోవినియోగదారులకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.

యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు పన్ను చెల్లింపులు

యూపీఐ ద్వారా పన్ను చెల్లింపుల పరిమితిని ఒక్కో లావాదేవీకి రూ. లక్ష నుండి రూ. 5 లక్షలకు పెంచాలని పాలసీ నిర్ణయించింది. ఇది యూపీఐ ద్వారా పన్ను చెల్లింపులను మరింత సులభతరం చేయనుంది. ఇక యూపీఐ లావాదేవీలు చేయడానికి ఒక వ్యక్తి మరో వ్యక్తిని అనుమతించడానికి సంబంధించి తాజాగా 'డెలిగేటెడ్ పేమెంట్' సదుపాయం ఏర్పాటు చేస్తుండడం మరో కీలకాంశం.

బ్యాంక్ డిపాజిట్లు పెరగాలి

ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల వైపు గృహ పొదుపులు మారడంపై శక్తి కాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు తమ విస్తారమైన బ్రాంచ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం, అలాగే వినూత్న ఉత్పత్తులు, సేవల ద్వారా డిపాజిట్లను సమీకరించాలని కోరారు.

ఫుడ్ వెయిటేజ్‌పై సమీక్ష

బెంచ్‌మార్క్ వడ్డీ రేటును నిర్ణయించేటప్పుడు ఆహార ద్రవ్యోల్బణాన్ని మినహాయించాలన్న తాజా ఆర్థికసర్వే సూచనలను గవర్నర్ దాస్ పరోక్షంగా తోసిపుచ్చారు. ద్రవ్య విధానాన్ని రూపొందించేటప్పుడు ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని విస్మరించబోదని స్పష్టం చేశారు. అయితే వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణంలో ఆహార వెయిటేజ్ 2011–12 నుంచి 46 శాతంగా కొనసాగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, దీనిని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

నియంత్రణా మార్పులు హర్షణీయం



ఆహార ద్రవ్యోల్బణాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఇక పాలసీలో ప్రతిపాదించిన కొన్ని నియంత్రణా పరమైన సంస్కరణలు హర్షణీయం. ముఖ్యంగా డిజిటల్ లెండింగ్ మార్కెట్ క్రమబద్ధీకరణ పాలసీ నిర్ణయాల్లో కీలకాంశం. యూపీఐ సేవల విస్తరణ, పారదర్శకతకు చర్యలను స్వాగతిస్తున్నాం.

– దినేష్ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్

ఎల్‌ఐసీ మెరుగైన పనితీరు



న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) మెరుగైన పనితీరు చూపించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే 10% పెరిగి రూ.10,461 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంలో లాభం రూ.9,544 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.2,10,910 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.1,88,749 కోట్లతో పోల్చితే.. 11% పైగా పెరిగింది. మొదటి ఏడాది ప్రీమియం (కొత్త పాలసీల ద్వారా) ఆదాయం రూ.6,811 కోట్ల నుంచి రూ.7,470 కోట్లకు దూసుకుపోయింది. పాలసీల రెన్యువల్ రూపంలో ఆదాయం రూ.56,429 కోట్లకు పెరిగింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.53,638 కోట్లు.

బీఎస్‌ఈలో షేరు ధర పెద్దగా మార్పు లేకుండా రూ.1,126 వద్ద క్లోజయింది.

రిలయన్స్ జ్యువెల్స్ 'ఆభర్ కలెక్షన్'



ముంబై: రిలయన్స్ జ్యువెల్స్ 17 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఆభర్ కలెక్షన్'ను అందుబాటులోకి తెచ్చింది. ఇయర్ రింగ్స్‌తో పాటు క్యాజువల్ స్టడ్‌లు, హోప్స్, డాంగ్లర్, ఝుమ్కీలు, జే–బాలీ డిజైన్లు ఈ కలెక్షన్‌లో ఉన్నాయి. 'ఇయర్ రింగ్స్ దట్ ఎక్స్‌ప్రెస్ యు' అనే ట్యాగ్‌తో క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ సందర్భంగా బంగారం తయారీ చార్జీలు, డైమండ్ విలువపై ఫ్లాట్ 17% తగ్గింపు అందిస్తుంది. అలాగే ఈ సెప్టెంబర్ 2 వరకు రూ.5 లక్షలు అంతకు మించి కొనుగోళ్లపై అదనంగా 5% డిస్కౌంట్ ప్రకటించింది. 'గతంలో ఎలాగైతే రిలయన్స్ ఉత్పత్తులను ఆదరించారో, ఇప్పుడు కూడా ఆభర్ కలెక్షన్‌ను ఆదరిస్తారని భావిస్తున్నాం' అని సంస్థ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు.



మెప్పించని ఆర్‌బీఐ పాలసీ

- సెన్సెక్స్ 582 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 180 పాయింట్ల నష్టం

ముంబై: ద్రవ్యోల్బణంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆర్‌బీఐ తొమ్మిదోసారి కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడంతో స్టాక్ సూచీలు గురువారం 1% నష్టపోయాయి. ఈ ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ వృద్ధి అంచనాలు ఓ మోస్తరుగా తగ్గించడం కూడా ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. విదేశీ ఇన్వెస్టర్ల వరస విక్రయాలూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 582 పాయింట్లు పతనమై 78,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 180 పాయింట్లు నష్టపోయి 24,117 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో దశలో సెన్సెక్స్ 669 పాయింట్లు క్షీణించి 78,790 వద్ద, నిఫ్టీ 218 పాయింట్లు పతనమై 24,080 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ఫార్మా తప్ప అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.


- నిర్మాణ రంగ సీగల్ ఇండియా షేరు లిస్టింగ్ లాభాలు నిలుపుకోలేకపోయింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.401)తో పోలిస్తే 3% ప్రీమియంతో రూ.413 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 6% ఎగసి రూ.425 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 4% నష్టంతో రూ.386 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,725 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మెర్సిడెస్ రెండు కొత్త కార్లు
తెలుగు రాష్ట్రాల్లో ఫెడరల్ బ్యాంక్ 100 శాఖల విస్తరణ

షూటింగ్ వరల్డ్ కప్ ఫైనల్‌కు భారత్ ఆతిథ్యం

ప్రతిష్టాత్మక అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) వరల్డ్ కప్ ఫైనల్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో న్యూఢిల్లీలోని కర్ణీ సింగ్ రేంజ్‌లో ప్రపంచకప్ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు భారత రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) గురువారం ప్రకటించింది. ఒలింపిక్స్‌లోని 12 వ్యక్తిగత విభాగాల్లో విజేతలుగా నిలిచిన షూటర్లు ఈ టోర్నీకి నేరుగా అర్హత సాధించనున్నారు. వీరితో పాటు గత సంవత్సరం దోహా, ఖతార్‌లో జరిగిన వరల్డ్ కప్ ఫైనల్స్ చాంపియన్లు కూడా ఇందులో నేరుగా పాల్గొననున్నారు. ఇక ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్లు కూడా నేరుగా పోటీ పడనున్నారు. ఆతిథ్య హోదాలో భారత్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ అవకాశాలు ఉన్నాయి. 'ప్రపంచకప్ ఫైనల్ భారత్ లో జరగనుండటం ఇది రెండోసారి' అని ఎన్‌ఆర్‌ఏఐ గురువారం ప్రకటించింది.





నేను అలసిపోయాను!

కుస్తీకి స్వస్తి పలికిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్
రిటైర్మెంట్ నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్న డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్

"అమ్మలాంటి రెజ్లింగ్ నా మీద గెలిచింది. నేనేమో ఓడిపోయాను. దయచేసి... మీరంతా నన్ను క్షమించండి. మీ కలలు, నా ధైర్యం అన్నీ ముక్కలయ్యాయి. ఇకపై నాకు పోరాడే శక్తి లేదు. గుడ్‌బై రెజ్లింగ్ 2001-2024. నన్ను అభిమానించిన, మద్దతు తెలిపిన మీ అందరికీ నేనెప్పుడు రుణపడే ఉంటాను"... కుస్తీనే లోకంగా, ఒలింపిక్స్ పతకమే ధ్యేయంగా ఎదిగి... ఇంటా బయటా క్రీడ, క్రీడేతర శక్తులతో పోరాడిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన ఈ రిటైర్మెంట్ నిర్ణయంతో మళ్లీ మన గుండెల్ని బరువెక్కించింది.

పారిస్: సెమీస్‌లో గెలిచి... ఫైనల్‌కు ముందు 100 గ్రాముల తేడాతో అనర్హతకు గురైన భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మళ్లీ మ్యాట్‌పైకి దిగే ఉద్దేశం లేదని ప్రకటించింది. రెజ్లింగ్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నానని గురువారం 29 ఏళ్ల వినేశ్ వెల్లడించింది.

కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) అప్పీలుకు సైతం వెళ్లిన ఆమె తీర్పు వెలువడక ముందే అనూహ్యంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకుంది. అలసిపోయిన తనకు ఇకపై కుస్తీలో ప్రత్యర్థులను పట్టుపట్టే బలం లేదంటూ గురువారం సోషల్ మీడియా వేదికగా గుడ్‌బై చెప్పింది. ఊహించని ఆమె నిర్ణయానికి భారత క్రీడాలోకం నిర్ఘాంతపోయింది. ఆమెను పోరాట యోధురాలిగా చూసిన క్రీడాకారులంతా వారిస్తున్నారు. ఆమెను అభిమానించే వారంతా రెజ్లర్ అధైర్యపడొద్దని వేడుకొంటున్నారు. తల్లిలాంటి రెజ్లింగ్‌పై తన ఉక్కు సంకల్పం సడలించవద్దని అదేపనిగా విజ్ఞప్తి చేస్తున్నారు. వినేశ్ పెదనాన్న ద్రోణాచార్య అవార్డీ, కోచ్ మహావీర్ ఫొగాట్ మాట్లాడుతూ భారత్‌కు చేరగానే తనతో మాట్లాడి వీడ్కోలు నిర్ణయాన్ని విరమించుకునేలా చేస్తానని తెలిపారు. 'నేను బజరంగ్ పూనియా, గీత కలిసి కూర్చొని ఆమెతో మాట్లాడతాం. అంతా కలిసి ఆమెకు నచ్చజెబుతాం. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కోసం లక్ష్య నిర్దేశం చేస్తాం' అని మహావీర్ అన్నారు. వినేశ్ పోటీపడ్డ ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో స్వర్ణం గెలిచిన సారా హిల్డర్‌బ్రంట్ (అమెరికా) మాట్లాడుతూ 'వినేశ్ అనర్హతకు గురవడం బాధాకరం. బరువు తగ్గడం కోసం పడే పాట్లు ఎలా ఉంటాయో నాకు తెలుసు. ఆమె కష్టాన్ని నేను అర్థం చేసుకోగలను' అని పేర్కొంది.



ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో అభినవ్ బింద్రాతో వినేశ్

అప్పీలుపై విచారణ నేడు

వినేశ్ అనర్హత, పతకం నిరాకరణపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లోని అడ్‌హాక్ కమిటీ గురువారం రాత్రి విచారించాల్సింది. నలుగురు లాయర్లతో కూడిన బృందాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఏర్పాటు చేసుకుంది. అయితే బలమైన వాదన, పూర్తి స్థాయి సన్నద్ధత కోసం నిష్ణాతులైన లాయర్లతో అప్పీలును గెలిచేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న ఐఓఏ ఒకరోజు గడువు కోరింది. దీన్ని మన్నించిన సీఏఎస్ శుక్రవారం మధ్యాహ్నానికి విచారణను వాయిదా వేసినట్లు తెలిసింది.

కల కాదు... ఆమెకు ఒలింపిక్స్ ఓ పీడకల!

ప్రపంచ చాంపియన్‌షిప్‌లు, ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో మంచి రికార్డే ఉన్న వినేశ్‌కు ఏ ఒలింపిక్స్ కూడా అచ్చి రాలేదు. అందుకే ఆమె కెరీర్‌లో ఒలింపిక్స్ కల కాదు ఓ పీడకలగా మిగిలిపోయింది. 2016 రియో ఒలింపిక్స్‌లో కీలకమైన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో గాయం వల్ల ముందంజ వేయలేకపోయింది. మళ్లీ ఐదేళ్ల (కోవిడ్ వల్ల 2021లో) తర్వాత టోక్యో విశ్వక్రీడల్లో క్వార్టర్స్‌లోనే ఓటమితో నిష్క్రమించింది. ఇప్పుడు మూడేళ్లకే జరిగిన పారిస్ ఈవెంట్‌లో కనీసం ఖాయమనుకున్న రజతాన్ని అనర్హత వేటు అవహేళన చేసింది.

వినేశ్ ప్రొఫైల్

పుట్టిన తేదీ, స్థలం : 25 ఆగస్టు 1994, హరియాణా
అత్యుత్తమ ర్యాంక్: ప్రపంచ నంబర్‌వన్
విభాగం: ఫ్రీస్టయిల్ రెజ్లింగ్

యూత్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

2013 జొహన్నెస్‌బర్గ్	రజతం	51 కేజీలు

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు

2022 బెల్‌గ్రేడ్	కాంస్యం	53 కేజీలు
2019 నూర్ సుల్తాన్	కాంస్యం	53 కేజీలు

ఆసియా క్రీడల్లో పతకాలు

2018 జకార్తా	స్వర్ణం	50 కేజీలు
2014 ఇంచియాన్	కాంస్యం	48 కేజీలు

కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు

2014 గ్లాస్గో	స్వర్ణం	48 కేజీలు
2018 గోల్డ్‌కోస్ట్	స్వర్ణం	50 కేజీలు
2022 బర్మింగ్‌హామ్	స్వర్ణం	53 కేజీలు

ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పతకాలు

2021 అల్మటీ	స్వర్ణం	53 కేజీలు
2015 దోహా	రజతం	48 కేజీలు
2017 న్యూఢిల్లీ	రజతం	55 కేజీలు
2018 బిష్కెక్	రజతం	50 కేజీలు
2013 న్యూఢిల్లీ	కాంస్యం	51 కేజీలు
2016 బ్యాంకాక్	కాంస్యం	53 కేజీలు
2019 జియాన్	కాంస్యం	53 కేజీలు
2020 న్యూఢిల్లీ	కాంస్యం	53 కేజీలు

"క్రీడ అనేది మానవ సంకల్పానికి వేడుకలాంటిది. నా కెరీర్లో ఇలాంటి సందర్భాల్ని వేడుకల్ని చాలా సార్లు చవిచూశాను. వినేశ్ సంకల్పానికి దేశం ఒక్కటై పలికిన జేజేలను మాత్రం ఎప్పుడూ చూడలేదు. పట్టు సడలించని ఆమె సంకల్పాన్ని జాతి యావత్తు వేడుక చేసుకుంటోంది.

–అభినవ్ బింద్రా, షూటింగ్‌లో బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత

క్రీడాకారులు జీవితమంతా సవాళ్లతోనే సహవాసం చేస్తారు. ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూస్తారు. కలను నెరవేర్చుకునే రోజు నైపుణ్యంతో రాణిస్తే విజయం చేకూరుతుంది. కానీ ఊహకందని ఈ పొరపాట్లు (స్వల్ప బరువుతో అనర్హత) జరిగితే మాత్రం ఎవరికైనా గుండె బద్దలవుతుంది.

–కేంద్ర క్రీడల మాజీ మంత్రి, షూటర్ రాజ్యవర్ధన్ రాథోడ్

మేమంతా వినేశ్ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుంటుందనే నమ్మకంతో ఉన్నాం. కఠోర సాధనతో లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ (2028)లో స్వర్ణం గెలిచి మా పిన్ని (వినేశ్ తల్లి), మా నాన్న మహావీర్ కలల్ని సాకారం చేసుకుంటుంది. ఇంటికొచ్చాక నాన్న ఆమెతో మాట్లాడి రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేస్తారు.

–మాజీ రెజ్లర్ బబితా ఫొగాట్

వినేశ్... అంతపని (రిటైర్మెంట్) చేయొద్దు. బాధలో ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయం తగదు. నేను భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) తరఫున ఆమె వీడ్కోలుకు బై చెప్పి ఎప్పట్లాగే బౌట్‌లో సత్తాచాటాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

–డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ సంజయ్ సింగ్

అంతిమ్‌పై మూడేళ్ల నిషేధం!

పారిస్ ఒలింపిక్స్‌లో క్రమశిక్షణను ఉల్లంఘించిన భారత మహిళా రెజ్లర్







నిషా

పారిస్: భారత యువ రెజ్లర్ అంతిమ్ పంఘాల్‌పై మూడేళ్ల నిషేధం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పారిస్ ఒలింపిక్స్ మహిళల రెజ్లింగ్ 53 కేజీల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన అంతిమ్ తొలి రౌండ్ బౌట్‌లోనే టర్కీ రెజ్లర్ యెట్‌గిల్ జెనెప్ చేతిలో ఓడిపోయింది. ఆ తర్వాత క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడటంతో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) 19 ఏళ్ల అంతిమ్‌పై కఠిన నిర్ణయం తీసుకునే చాన్స్ కనిపిస్తోంది. బౌట్ అనంతరం క్రీడాగ్రామానికి కాకుండా.. హోటల్ రూమ్‌కు చేరుకున్న అంతిమ్.. స్పోర్ట్స్ విలేజ్‌లో ఉన్న తన వస్తువులను తీసుకురావడానికి సోదరికి అక్రిడిటేషన్ కార్డు ఇచ్చింది. దీన్ని గుర్తించిన ఒలింపిక్స్ సిబ్బంది అక్రిడిటేషన్ నిర్ధారణ కోసం అంతిమ్ సోదరి నిషాను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. మరోవైపు అంతిమ్ వ్యక్తిగత కోచ్‌లు మద్యం తాగి ట్యాక్సీ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ మొత్తం అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్న ఐఓఏ.. అంతిమ్ స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం నిర్ణయం వెల్లడించనుంది. కాగా.. ఇప్పటికే అంతిమ్‌పై నిషేధం విధించినట్లు వస్తున్న వార్తలను గురువారం ఐఓఏ ఖండించింది. దీనిపై అంతిమ్ స్పందిస్తూ.. 'నేనే తప్పు చేయలేదు. గందరగోళం వల్లే ఇదంతా జరిగింది. ఇది నా రోజు కాదు. అటు బౌట్‌లో ఓటమి ఎదురైంది. ఆ తర్వాత నా గురించి చాలా తప్పుడు వార్తలు వచ్చాయి. వాటిలో నిజం లేదు. అక్రిడిటేషన్ నిర్ధారణ కోసమే పోలీసుస్టేషన్‌కు వెళ్లా. అనారోగ్యంగా ఉండటంతో కోచ్‌ను అడిగే హోటల్‌కు వెళ్లా. క్రీడాగ్రామంలో కొన్ని వస్తువులు ఉండిపోవడంతో.. సోదరికి కార్డు ఇచ్చి తీసుకురమ్మని చెప్పా. ఇక కోచ్‌ల విషయంలో కూడా ఇలాగే జరిగింది తప్ప మరొకటి కాదు' అని వివరించింది.

ఆ చెట్టు మళ్లీ బతకాలి..

- దాదాపు 18 సినిమాల్లో ఆ చెట్టు కింద ఏదో ఒక సన్నివేశం తీశా..
- సినీ దర్శకుడు వంశీ
- కూలిపోయిన నిద్ర గన్నేరు వృక్షాన్ని చూసి భావోద్వేగం

కొవ్వూరు: సితార, లేడీస్ టైలర్, డిటెక్టివ్ నారద, చెట్టు కింద ప్లీడర్, గోపి–గోపిక–గోదావరి, మంచు పల్లకీ.. ఇలా సుమారు 18 సినిమాలకు కుమారదేవం చెట్టు కింద ఏదో ఒక సన్నివేశాన్ని చిత్రీకరించానని ప్రముఖ సినీ దర్శకుడు వంశీ తెలిపారు. ఆయన గురువారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం వచ్చి కూలిపోయిన భారీ నిద్ర గన్నేరు వృక్షాన్ని పరిశీలించి భావోద్వేగానికి లోనయ్యారు.




కూలిన వృక్షం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న సినీ దర్శకుడు వంశీ

స్థానికులతో మాట్లాడుతూ తనకు, చెట్టుకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. తాను చిన్నప్పుడు పట్టిసీమ వెళుతూ ఈ చెట్టును చూసినట్టు తెలిపారు. తాను దర్శకత్వం వహించే ప్రతి చిత్రంలోనూ గోదావరి సీన్ కచ్చితంగా ఉంటుందని, సుమారు 18 సినిమాల్లో ఈ కుమారదేవం చెట్టు ఉందని వెల్లడించారు. తాను రాసిన గోకులంలో రాధ నవలలో ప్రధానంగా ఈ చెట్టు గురించే ఉంటుందని చెప్పారు. ఈ చెట్టు మళ్లీ బతకాలన్నారు. చెట్టు బతికితే తాను మళ్లీ ఇక్కడ సినిమా తీస్తానని చెప్పారు. చెట్టు పడిపోయిన విషయం తెలిసి వేలాది మంది నుంచి తనకు వేలాది మెసేజీలు వచ్చాయని, తన తల్లి చనిపోయినప్పుడు కూడా ఇన్ని మెసేజీలు రాలేదన్నారు. ఇటువైపు వచ్చినప్పుడల్లా మిత్రులతో కలిసి ఇక్కడ చెట్టు కింద సేద తీరేవాడినని, మిత్రులతో కలిసి పార్టీ కూడా చేసుకున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా వృక్షాన్ని చిగురింపజేసే పనులను ప్రారంభించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఈ పనులను లాంఛనంగా ప్రారంభించారు.

వినోద రంగంలో భారత వినియోగదారుల అభిరుచులు ఇలా..

పట్టణ ప్రాంత భారతీయులు వినోద రంగంలోని ప్రముఖ బ్రాండ్లను ఎంత శాతం మేర వినియోగిస్తున్నారో తెలిపే డ్యాష్‌బోర్డ్ ఇది. మే-జూలై త్రైమాసికానికి సంబంధించి జరిగిన ఆన్‌లైన్ పోల్‌లో నెటిజన్ల అభిప్రాయాల ఆధారంగా యూగవ్ అనే వెబ్‌సైట్ దీన్ని రూపొందించింది.



సినీ నటుడు రాజ్‌తరుణ్‌కు
ముందస్తు బెయిల్

'నార్సింగి' కేసులో హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో సినీ నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.20 వేల సొంత బాండ్‌తో పాటు ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. రాజ్‌తరుణ్ తనను మోసం చేశారంటూ లావణ్య అనే మహిళ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రాజ్‌తరుణ్ హైకోర్టులో గత వారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి గురువారం మరోసారి విచారణ చేపట్టారు. రాజ్‌తరుణ్ కథానాయకుడిగా పలు సినిమాలు చేశారని, అతనిపై ఇప్పటివరకు ఎలాంటి ఆరోపణలు రాలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్య.. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు సమర్పించలేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రాజ్‌తరుణ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

సివిల్స్ అభయ హస్తం
తుది గడువు 12 వరకు..

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ అమలు చేస్తున్న రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తే సింగరేణి సంస్థ తరఫున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దరఖాస్తులకు తొలుత ఈ నెల 6 వరకు గడువు విధించారు. గడువు పొడిగించాలన్న అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 12వ తేదీ వరకు పెంచినట్లు ఆయన తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www.scclmines.com ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.